www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఒక్కరోజే 4 పతకాలు

10

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ జోరు

షూటర్ అవనీ లేఖారాకు స్వర్ణం

మనీష్‌కు రజతం.. మోనా, ప్రీతిలకు కాంస్యాలు



అవని మోనా

శనివారం | 31-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 137 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి తె. 3.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పుష్యమి రా. 7.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 6.04-7.43; అమృతఘడియలు: మ. 12.48-2.31; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పక్కా స్కెచ్‌తోనే..

జగన్ మనుషులను కాపాడేందుకు ముంబై నటి బలి

జెత్వానీ కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు

నిబంధనలు తుంగలోకి.. తాడేపల్లి డైరెక్షన్‌లో కథ

ఎస్సై వెళ్లాల్సిన కేసులో ఎస్పీ స్థాయి అధికారి

నోటీసు ఇవ్వకుండా ఏకంగా వారెంట్‌తో ముంబైకి

ముంబైలో కేసు నమోదయ్యాక జగన్‌తో సజ్జన్ భేటీ

ఆ తర్వాతే ఇబ్రహీంపట్నంలో జెత్వానీపై కేసు

తెల్లకాగితాలపై బలవంతపు సంతకాలైన మర్నాడే

కడపలో జగన్‌తో కలిసి సజ్జన్ భూమిపూజ

విద్యాసాగర్ భూముల్ని రాయించుకోవడం కట్టుకథే

జగన్ రోత పత్రికలో సంబంధంలేని చెత్త రాతలు

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పక్కా స్కెచ్‌తోనే ముంబై నటి కాదంబరి జెత్వానీని వేధించారు. నాటి ముఖ్యమంత్రి జగన్ తన సొంత మనుషులను కాపాడుకోవడం కోసం ఓ మహిళను బలి చేశారు. ఐపీఎస్ అధికారులు, పోలీసులు 24 గంటల్లో కథ నడిపారు. నిబంధలనకు పూర్తి విరుద్ధంగా

మిగతా 11వ పేజీలో...



విజయవాడలో మీడియాతో మాట్లాడుతున్న జెత్వానీ

పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ...

ఈ ముగ్గురు ఐపీఎస్‌లే వేధించారు

మరో ఇద్దరు పోలీసు అధికారులూ ఉన్నారు

వారి పేర్లు నాకు తెలియదు

మానసికంగా, శారీరకంగా టార్చర్ చేశారు

కొందరు పోలీసులు నన్ను అసభ్యకరంగా

ఫొటోలు, వీడియోలు తీశారు

సజ్జన్‌పై కేసు రాజీ చేసుకోవాలని బెదిరించారు

పోలీసులకు వెల్లడించిన కాదంబరి జెత్వానీ!

బెజవాడలో పోలీసు అధికారులకు వాంగ్మూలం

విద్యాసాగర్ పెళ్లి చేసుకుంటానన్నాడు

11

కాదన్నాననే నాపై వేధింపులు

ఆ ఫోర్జరీ డాక్యుమెంట్ అతడి సృష్టే!.. పోలీసులు నన్ను ముంబైలో కిడ్నాప్ చేసి తీసుకొచ్చారు

నాటి విజయవాడ సీపీ కాంతిరాణా అక్రమంగా కేసులో ఇరికించారు

45 రోజులు నా జీవితాన్ని దుర్భరం చేశారు.. డబ్బు కోసం ఓ మహిళపై అక్రమ కేసు పెడతారా?

పారిశ్రామికవేత్తలను బ్లాక్‌మెయిల్ చేస్తే వారు నాపై కేసులు పెట్టేవారుగా.. మీడియాతో జెత్వానీ

ఎవరున్నా వదలొద్దు

జెత్వానీ కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయండి

పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, ఐపీఎస్‌లు

ఎవరు తప్పు చేసినా చట్టం ముందు నిలబెట్టండి

గుడ్లవల్లేరు ఘటనపై పూర్తి విచారణ జరపాలి

పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం



కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఆందోళన చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

హాస్టల్ బాత్రూంలో కెమెరా కళ్లు!

గుడ్లవల్లేరు కాలేజీ హాస్టల్లో 'హిడెన్' కెమెరాల కలకలం

ఇంజనీరింగ్ విద్యార్థినుల తీవ్ర ఆందోళన

వసతి గృహం మూడు వాష్ రూమ్‌లలో వీడియోలు తీశారని ఆరోపణలు

న్యాయం కోరుతూ గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వరకు నిరసన

హుటాహుటిన స్పందించిన సీఎం చంద్రబాబు

తక్షణం అక్కడకు వెళ్లాలని మంత్రి, అధికారులకు ఆదేశం

విద్యార్థినులతో మంత్రి కొల్లు, కలెక్టర్, ఎస్పీ చర్చలు



4 గంటలకు పైగా కాలేజీని జల్లెడపట్టిన వైనం

ఎలాంటి కెమెరాలూ లభించలేదన్న పోలీసులు

అదుపులో ముగ్గురు.. ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

మచిలీపట్నం/గుడ్లవల్లేరు/జేఎన్టీయూకే, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రి ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం వాష్‌రూమ్‌లలో 'హిడెన్' కెమెరాల కలకలం రేగింది. బాలికల వసతి గృహంలోని మూడు బాత్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి వీడియోలు

మిగతా 12వ పేజీలో...

నేడే పింఛన్ల పండగ

1న ఆదివారం కావడంతో నేడే పంపిణీకి ఏర్పాట్లు

ఉద్యోగుల సెలవుకు ఇబ్బంది లేకుండా చర్యలు

65 లక్షల మందికి రూ.2,730 కోట్లు అందజేత

ఓర్వకల్లులో పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు

నేడు తీసుకోలేనివారికి 2న ఇచ్చే ఏర్పాటు

అమరావతి/ఓర్వకల్లు/కర్నూలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్ల పండుగ ఒకరోజు ముందే వచ్చింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31నే (శనివారం) పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతినెలా ఒకటో తేదీన ఉదయం సామాజిక పెన్షన్లు ఇవ్వడం ఆనవాయితీ. అయితే సెప్టెంబరు 1 ఆదివారం కావడం, ఆ రోజు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినం కావడంతో సీఎం చంద్రబాబు ఈ మేరకు నిర్ణయం

మిగతా 12వ పేజీలో...



శుక్రవారం విశాఖలో జోరున పడుతున్న వర్షం

దంచికొట్టిన వాన

పలుచోట్ల జనజీవనానికి అంతరాయం

బలపడిన అల్పపీడనం.. రేపటికల్లా వాయుగుండంగా మారే అవకాశం

నేడు, రేపూ భారీ వర్షాలు.. పెనుగాలులు, పిడుగులు కూడా

వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరికలు.. అరేబియాలోనూ తుఫాన్

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. కోస్తా, రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం అనేక చోట్ల తెలికపాటి నుంచి మోస్తరు.. అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం సహా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో సాధారణ జనజీవనానికి

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రానికి పచ్చ తోరణం

పర్యావరణమే భావితరాల భవిష్యత్తు

50% పచ్చదనమే ప్రభుత్వ లక్ష్యం

జీవ వైవిధ్యానికి చిరునామాగా ఏపీ.. 175 నగర వనాల అభివృద్ధి

రాష్ట్రానికి 13 వన్య సంరక్షణా కేంద్రాలు, 3 జాతీయ పార్కులు, 2 జూ పార్కులు

టైగర్ పార్కు, ఏనుగుల సంరక్షణ కేంద్రం: సీఎం చంద్రబాబు

మంగళగిరిలో ఘనంగా వన మహోత్సవం

చెట్ల పెంపకం సామాజిక బాధ్యత: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, (ఆంధ్రజ్యోతి), మంగళగిరి, ఆగస్టు 30: 'భావితరాల భవిష్యత్తు అంతా పర్యావరణం మీదే ఆధారపడి ఉంది. అలాంటి పర్యావరణాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసింది. అందుకే కూటమి ప్రభుత్వం పర్యావరణ సంస్కరణకు ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం లక్ష్యంగా చెట్ల పెంపకాన్ని చేపడుతున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆయన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి మంగళగిరిలోని ఎకోపార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... పర్యావరణానికి ముప్పు తెస్తున్న ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టిస్తామని, డ్రోన్ టెక్నాలజీతో స్మగ్లింగ్‌ను అడ్డుకుంటామని చెప్పారు. ఇకపై స్మగ్లింగ్ కోసం అడవుల్లో అడుగు పెట్టేవారికి అదే చివరిరోజు అవుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో జపాన్ టెక్నాలజీ మియాబకీ విధానంలో నగర వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని జీవవైవిద్యానికి

మిగతా 12వ పేజీలో...



మంగళగిరిలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఛత్రపతి శివాజీ మాకు దేవుడు!

10

మహారాష్ట్రలో ఆయన విగ్రహం

కూలడంపై క్షమాపణ చెబుతున్నా: ప్రధాని



నవ్వుతో చెల్లింపు!

'స్మైల్‌పే' పేరిట ముఖ గుర్తింపు

ఆధారిత చెల్లింపు వ్యవస్థ

2

ప్రారంభించిన ఫెడరల్ బ్యాంకు

దేశంలో తొలి ఫేషియల్ పేమెంట్ వ్యవస్థ

నేడు ఆరుగురు ఐఏఎస్‌ల రిటైర్మెంట్

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ నీరబ్ కుమార్

రజత్ భార్గవకు చివరి రోజు జీపీడీలో పోస్టింగ్

12



ప్లీజ్.. నన్ను విడిచి వెళ్లొద్దు!

ఎంపీలకు జగన్ వేడుకోలు

రాజ్యసభలో బలం వల్లే ఢిల్లీలో నాకు గౌరవం

మీరు వెళ్లిపోతే ఆ పదవులన్నీ టీడీపీకే

ఇది వెన్నుపోటేనంటూ నిష్ఠూరం

11

మీడియా ముందుకు అయోధ్య, బోస్

జీవితాంతం జగన్ వెంటే ఉంటామని వెల్లడి

మేడా, బాబూరావూ వెళ్లరని వ్యాఖ్య

అటు మరో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్సీలు గుడ్‌బై

కర్రి పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తి రాజీనామా

రాత్రిపూట డ్యూటీ..

భయం భయం!

దేశంలో మూడింట ఒక వంతు మంది వైద్యులు అభద్రతలోనే

మహిళా డాక్టర్లలో మరింత భయం

ఆత్మరక్షణ కోసం వెంట ఆయుధాలు

45% ఆసుపత్రుల్లో డ్యూటీ రూమ్‌లు, విశ్రాంతి గదులు కూడా కరువు

ఉన్నవాటిలో బాత్‌రూమ్‌లూ లేవు

ఐఎంఏ ఆన్‌లైన్ అధ్యయనంలో వెల్లడి

22 రాష్ట్రాల్లో 3,885 మందితో సర్వే



న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశవ్యాప్తంగా మూడింట ఒక వంతు మంది వైద్యులు అభద్రతలో ఉన్నారని భారత వైద్య మండలి(ఐఎంఏ) అధ్యయనంలో వెల్లడైంది. మరీ ముఖ్యంగా రాత్రిపూట విధులంటే వైద్యులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని తెలిపింది. పురుష వైద్యులకంటే మహిళా వైద్యులు మరింత అభద్రతాభావంలో ఉన్నారని, వారిలో కొందరు ఆత్మరక్షణ కోసం ఆయుధాలు వెంటబెట్టుకుని వస్తున్నారని అధ్యయనం పేర్కొంది. ఆసుపత్రుల్లో భారీగా ఉంటున్న రోగులు, మౌలిక సదుపాయాలు లేకపోవడం, డ్యూటీ రూమ్‌లు కూడా ఉండకపోవడంతో వైద్యులు అభద్రభావంతో ఉన్నారని తెలిపింది. వైద్యులకు సరైన భద్రత, సౌకర్యాలు కల్పిస్తే.. తద్వారా రోగులకు మరింత

మిగతా 2వ పేజీలో...

పూడిమడకలో 387 కోట్లతో ఫిషింగ్ హార్బర్



మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా నుంచి వర్చువల్ విధానంలో పూడిమడక ఫిషింగ్ హార్బర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మోదీ

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

12

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌నూ ప్రారంభించిన పీఎం

ఆ 15 వేల కోట్లూ గ్రాంటే

అమరావతి నిర్మాణానికి కేంద్ర సాయం

ఈఏపీ అప్పుగా తెచ్చి రాష్ట్రానికి ఇస్తుంది

తిరిగి 100 శాతం కేంద్రమే చెల్లిస్తుంది

గత సర్కారులో భారీగా నిధుల మళ్లింపు

పెండింగ్ బిల్లులు రూ.1.30 లక్షల కోట్లు

ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్



3

టైట్లర్‌పై అభియోగాలు నమోదు చేయండి

» 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 30: కాంగ్రెస్ నాయకుడు జగదీశ్ టైట్లర్‌పై హత్య సహా ఇతర అభియోగాలను నమోదు చేయాలని శుక్రవారం ప్రత్యేక న్యాయస్థానం సీబీఐని ఆదేశించింది. ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984లో సిక్కులపై జరిగిన దాడులకు సంబంధించిన కేసులో ఈ ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర ఢిల్లీలోని పుల్ బంగేష్ వద్ద ముగ్గురు సిక్కులు హత్యకు గురికావడం వెనుక ఆయన ప్రమేయం ఉందంటూ కేసు నమోదయింది. ఆయనపై విచారణ జరిపేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని ప్రత్యేక జడ్జి రాకేష్ సియాల్ అభిప్రాయపడ్డారు. హత్యతో పాటు చట్టవ్యతిరేకంగా గుమికూడడం, అలర్లు సృష్టించడం, వివిధ వర్గాల మధ్య శతృత్వాన్ని పెంచడం, ఇళ్లల్లో చొరబడడం, దొంగతనం చేయడం వంటి అభియోగాలు కూడా నమోదు కానున్నాయి. ఓ సాక్షి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ అభియోగాలు మోపనున్నారు. "1984 నవంబరు ఒకటో తేదీన తెల్లని అంబాసిడర్ కారులో గురుద్వారా పుల్ బంగేష్ వద్దకు వచ్చిన టైట్లర్ 'సిక్కులను చంపండి. మన అమ్మను వారు చంపేశారు' అంటూ రెచ్చగొట్టాడని, అనంతరం ముగ్గురు హత్యకు గురయ్యార"ని ఆ వ్యక్తి అఫిడవిట్‌లో పేర్కొన్నాడు. దాని ఆధారంగా అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించిన కోర్టు తదుపరి విచారణను వచ్చే నెల 13కు వాయిదా వేసింది.

దర్శన్ విషయంలో ఓ మంత్రికి సిద్దూ హెచ్చరిక!

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రేణుకాస్వామి హత్యకేసులో నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్ విషయంలో జోక్యం చేసుకోవద్దని కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఓ మంత్రిని తీవ్రంగా హెచ్చరించినట్టు సమాచారం. పరప్పన అగ్రహార జైలులో దర్శన్‌కు అందుతున్న సదుపాయాలపై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వివాదంతోనే బళ్లారి జైలుకు ఆయన్ను తరలించారు. పరప్పన జైలులో దర్శన్‌కు విలాసవంతమైన సౌకర్యాలకు ఓ మంత్రి కారణమనే ప్రచారం సాగుతోంది. సీఎం సదరు మంత్రికి ఫోన్‌లో క్లాస్ తీసుకున్నట్టు సమాచారం. ఈ విషయంలో జోక్యం సరికాదని మందలించిన సీఎం, 'మంత్రి నాగేంద్ర విషయంలో ఏం జరిగిందో తెలుసు కదా' అని ప్రశ్నించినట్టు తెలిసింది.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలకలం

» కలుషితాహారం తిని 110 మందికిపైగా విద్యార్థినులకు అస్వస్థత

» 60 మందికి పైగా అరకు ఏరియా ఆస్పత్రికి తరలింపు



అరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

అరకులోయ, ఆగస్టు 30: గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కలకలం రేపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం జామిగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఈ ఘటన జరిగింది. శుక్రవారం రాత్రి భోజనం చేసిన కొద్దిసేపటికి విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. పాఠశాలలోని 110 మంది వరకూ అస్వస్థతకు గురవ్వగా, 60 మందిని అంబులెన్స్‌లలో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇందులో కొంత మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందంటున్నారు. వైద్య సిబ్బంది విద్యార్థినులకు సేవలను అందిస్తున్నారు. జిల్లా వైద్య శాఖ అధికారి జమాల్ బాషా ఆస్పత్రికి చేరుకుని బాధితులకు సక్రమంగా వైద్యసేవలందేలా పర్యవేక్షిస్తున్నారు.

రాత్రిపూట డ్యూటీ

భయం భయం!

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్వేలో వెల్లడైన అంశాలను ఐఎంఏ వివరించింది. కాగా, ఈ సర్వే వివరాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు అందించనున్నట్టు ఐఎంఏ కేరళ విభాగం, పరిశోధన సెల్ చైర్మన్ డాక్టర్ జయదేవన్ తెలిపారు.



వైద్యుల గోడు ఇదీ..

- రాత్రి విధుల్లో ఉన్న వైద్యులకు 45 శాతం ఆసుపత్రుల్లో డ్యూటీ రూమ్‌లు లేవు. దీంతో నైట్ డ్యూటీలో ఉంటున్నవారు తీవ్ర అభద్రతలో ఉంటున్నామనే భావనలో ఉన్నారు. కచ్చితంగా తమకు డ్యూటీ రూమ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.
- డ్యూటీ రూమ్ ఉన్నప్పటికీ.. తమకు గోప్యత ఉండడం లేదని, భారీ సంఖ్యలో వస్తున్న రోగుల కారణంగా తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలిపారు. వీటిలో ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ లేవని మరికొందరు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా తమకు విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలన్నారు.
- ఆసుపత్రుల్లో భద్రత లేదని 24.1% మంది, అస్సలు ఏమాత్రం సురక్షితం కాదని 11.4% మంది వైద్యులు తెలిపారు. వీరిలో ఎక్కువ మంది మహిళా వైద్యులే ఉన్నారు. "సుశిక్షితులైన సిబ్బందితో ఆసుపత్రుల్లో భద్రత కల్పించాలి. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆసుపత్రి ఆవరణలో లైట్లు ఏర్పాటు చేయాలి" అని వారు కోరారు.
- సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్(సీపీఏ)ను అమలు చేయాలి. అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వైద్యులకు కనీస భద్రత కల్పించాలి.
- రోగులు ఎక్కువగా ఉన్న ఆసుపత్రుల్లో గుంపు నియంత్రణ సిబ్బందిని నియమించాలి. తద్వారా రోగులకు నిర్భయంగా వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది.
- ఆత్మ రక్షణ కోసం చిన్నపాటి ఆయుధాలను తీసుకువెళ్తున్నట్టు సర్వేలో కొందరు తెలిపారు.
- తన హ్యాండ్ బ్యాగులో చిన్నపాటి కత్తితో పాటు మిరియాల ద్రావకాన్ని కూడా పెట్టుకుంటున్నట్టు ఓ మహిళా వైద్యురాలు తెలిపారు.
- రోగుల బంధువులు కొందరు మద్యం తాగి, మరికొందరు మాదద్రవ్యాల మత్తులో జోగుతూ వైద్యులను బెదిరిస్తున్నారని మెజారిటీ వైద్యులు ఫిర్యాదు చేశారు. వీరిని కట్టడి చేయాలని కోరారు.
- మహిళా వైద్యులను కొందరు తాకరాని చోట తాకుతున్నారు. రోగుల సమూహం ఎక్కువగా ఉన్న ఆసుపత్రుల్లో ఇది సర్వసాధారణం అయిపోయింది.
- ప్రైవేటు ఆసుపత్రుల్లో భద్రతను ప్రశ్నిస్తే.. యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. చులకనగా చూస్తున్నాయి. జూనియర్ వైద్యులపై దాడులు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి.

సర్వే సాగింది ఇలా..

22 రాష్ట్రాల్లో ఐఎంఏ ఆన్‌లైన్ అధ్యయనం సాగింది. మొత్తం 3,885 మంది వైద్యులు పాల్గొన్నారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది 35 ఏళ్లలోపున్న వైద్యులు. వీరిలో 61% మంది ఇంటెర్న్, లేదా పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీలే.

ఆధారాల్ని చెరిపేయలేదు..

కోల్‌కతా, ఆగస్టు 30: కోల్‌కతా హత్యాచార ఘటనాస్థలంలో ఆధారాలను తారుమారు చేశారంటూ సీబీఐ చేసిన ఆరోపణలను కోల్‌కతా పోలీసులు తోసిపుచ్చారు. కోల్‌కతా పోలీసుల తరఫున డీసీపీ సెంట్రల్ ఇందిరా ముఖర్జీ సుప్రీంకోర్టులో ఈ ఆరోపణలకు వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరలైన ఫొటోలో.. ఘటనాస్థలంలో ఉన్న వారంతా విచారణ బృందానికి సంబంధించిన వారేనని, ఆ చిత్రంలో ఉన్న వారి వివరాలతో సహా వివరించారు. అంతేకాక, ఆ ఫొటో విచారణ పూర్తయిన తర్వాత ఆగస్టు 9న తీసిన చిత్రమని తెలిపారు. ఇక, సీబీఐ తరఫున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యాన్ని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోల్‌కతా పోలీసులు పేర్కొన్న ప్రకారం ఆగస్టు 9న ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మృతదేహాన్ని గుర్తించిన ఆస్పత్రి వర్గాలు పోలీసులకు పది గంటల పది నిమిషాలకు సమాచారం అందించాయని తెలిపారు. తొలి ఎఫ్ఐఆర్ రాత్రి 11:45 గంటలకు నమోదు కావడం మరింత అనుమానం కలిగించే అంశమని పేర్కొన్నారు.

ప్రధాని మోదీకి మమత మరో లేఖ

కోల్‌కతా, ఆగస్టు 30: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని మోదీకి శుక్రవారం మరో లేఖ రాశారు. హత్యాచార ఘటనలకు పాల్పడే వారిని శిక్షించేందుకు కఠిన చట్టం తీసుకురావాలని, నిర్దిష్ట కాలపరిమితిలో కేసుల్ని పరిష్కరించేలా అది ఉండాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై గత వారం తాను రాసిన లేఖకు ప్రధాని మోదీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖ నుంచి తనకు బదులు వచ్చిందని, అయితే సమస్య తీవ్రత దృష్ట్యా ఆ సాధారణ సమాధానం సరిపోదని మమత పేర్కొన్నారు. గత వారం ఇదే అంశంపై మమత మోదీకి తొలిసారి లేఖ రాశారు. కాగా, కోల్‌కతాలో హత్యాచార ఘటనపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వచ్చే వారం ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అత్యాచారాల నిరోధానికి కొత్త బిల్లు తీసుకురానున్నట్లు పేర్కొంది.

12 సార్లు పరీక్ష రాశా.. అందులో

ఏడింటిని వదిలేయండి..

» ఢిల్లీ హైకోర్టుకు పూజా ఖేద్కర్ అభ్యర్థన



న్యూఢిల్లీ, ఆగస్టు 30: తాను 12 సార్లు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రవేశ పరీక్షలు రాశానని, అందులో ఏడింటిని వదిలేసి మిగిలిన ఐదు పరీక్షలనే పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ ట్రైనీ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును కోరారు. అలాగే, ఏసీఎల్ గాయం వల్ల తన ఎడమ మోకాలు అస్థిరంగా ఉన్నట్టు మహారాష్ట్ర ఆస్పత్రి ఇచ్చిన ధ్రువపత్రం తన వద్ద ఉందని, అందువల్ల దివ్యాంగుల కోటాలో తాను రాసిన పరీక్షలనే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. 40% అంగవైకల్యం ఉన్న వారు దివ్యాంగులని నిబంధనలు చెబుతున్నాయని, తనకు 47% వైకల్యం ఉందని తెలిపారు. ఈ మేరకు న్యాయస్థానంలో శుక్రవారం ఆమె ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. జనరల్ కేటగిరీ అభ్యర్థిగా తాను రాసిన పరీక్షలను గుర్తించవద్దని కోరారు. న్యాయస్థానం ఇందుకు అంగీకరిస్తే తాను రాసిన పరీక్షల సంఖ్య ఐదు(అన్నింటిల్లో ఆమె ఉత్తీర్ణత సాధించారు)కు తగ్గుతుందని పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులు సివిల్స్ రాసేందుకు ఉన్న తొమ్మిది పరిమిత ప్రయత్నాల కంటే ఈ అంకె నాలుగు తక్కువని, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఉన్న అత్యధిక అవకాశాల కంటే ఒకటి తక్కువేనని పూజా అభ్యర్థించారు. ఫోర్జరీ, చీటింగ్ కేసుల్లో తన అరెస్టును అడ్డుకోవాలంటూ పూజా కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. కాగా, పూజా ఖేద్కర్ 12 సార్లు పరీక్ష రాయగా అందులో ఓసారి పేరును మార్చి బోర్డును మోసగించారంటూ యూపీఎస్సీ చేసిన ఆరోపణను కూడా పూజా ఖండించింది. తాను తన పేరును మార్చలేదని మధ్యలో అటు పదం ఇటు మార్చి చిన్న మార్పు చేశానని సమర్థించుకున్నారు. ఇదిలా ఉండగా, పూజా ఖేద్కర్ వివాదం నేపథ్యంలో సివిల్స్ అభ్యర్థుల గుర్తింపును ఆధార్ ఆధారితంగా ధ్రువీకరించుకోవడానికి యూపీఎస్సీకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

అరేబియాలో తుఫాన్.. పేరు 'అస్నా'

విశాఖపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అరేబియా సముద్రంలో తుఫాన్ ఏర్పడింది. దీనికి పాకిస్థాన్ సూచించిన 'అస్నా' అని పేరు పెట్టారు. ఆగస్టులో తుఫాన్‌లు రావడం చాలా అరుదు. అయితే సముద్రాలు వేడెక్కడంతో తుఫాన్ ఏర్పడింది. అరేబియా సముద్రంలో ఆగస్టులో 1891 నుంచి 1976 వరకూ మూడు తుఫాన్‌లు వచ్చాయి. 'అస్నా' నాలుగోది. గతంలో 1944, 1964, 1976 సంవత్సరాల్లో ఆగస్టు నెలలో తుఫాన్‌లు వచ్చాయి.

కనీస పెన్షన్ రూ.7,500 చేయండి

» ఆర్థిక మంత్రికి పెన్షనర్ల సంఘం వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 30: కనీస నెలవారీ పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని ఈపీఎస్-95 నేషనల్ యాజిటేషన్ కమిటీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలను విజ్ఞప్తి చేసింది. ఈ సంఘం 78 లక్షల మంది పెన్షనర్లకు, పరిశ్రమల్లో పనిచేస్తున్న 7.5 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆ సంఘం ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం సానుభూతితో వ్యవహరిస్తోందని, సమస్యకు పరిష్కారాన్ని అన్వేషిస్తుందని ఆమె వారికి హామీ ఇచ్చారు. పెన్షనర్లకు ఆర్థిక భద్రత కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గత నెలలో ఈ సంఘం ప్రతినిధులు కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి ఇదే సమస్యపై వినతి పత్రం సమర్పించారు.

నవ్వుతో చెల్లింపు!

'స్మైల్‌పే' పేరిట ముఖ గుర్తింపు ఆధారిత చెల్లింపు వ్యవస్థ

» ప్రారంభించిన ఫెడరల్ బ్యాంకు

» దేశంలోనే మొదటి ఫేషియల్ పేమెంట్ వ్యవస్థ



న్యూఢిల్లీ, ఆగస్టు 30: మారుతున్న కాలానికి అనుగుణంగా సులభంగా, సురక్షితంగా చెల్లింపులు చేసేందుకు కొంగొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. నగదు నుంచి కార్డులు తర్వాత క్యూఆర్ కోడ్‌లు, వేరబుల్స్‌తో వివిధ రకాల చెల్లింపులు చేస్తున్నాం. తాజాగా ముఖ గుర్తింపు టెక్నాలజీ ఆధారంగా చెల్లింపులు జరిపే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఫెడరల్ బ్యాంకు 'స్మైల్‌పే' పేరిట ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ తరహా చెల్లింపు విధానాన్ని ప్రారంభించడం దేశంలోనే మొదటిది. రిలయన్స్ రిటైల్, స్వతంత్ర మైక్రో హౌసింగ్‌ల సహకారంతో ఎంపిక చేసిన శాఖలు, ఔట్‌లెట్లలో పైలెట్‌గా దీన్ని ప్రారంభించింది. యూఐడీఏఐకి చెందిన భీమ్ ఆధార్ పేపై అత్యాధునిక ఫేషియల్ అథెంటికేషన్ టెక్నాలజీతో దీనిని రూపొందించారు. ఈ వినూత్న సదుపాయం వల్ల నగదు, కార్డులు, మొబైల్ డివైజ్‌ల అవసరం లేకుండా ఒక్క నవ్వుతో చెల్లింపులు చేయవచ్చు. తొలుత స్మైల్ పే సర్వీసు కేవలం ఫెడరల్ బ్యాంకు కస్టమర్లకే అందుబాటులో ఉంటుంది. వ్యాపారులు, కస్టమర్లు ఇద్దరు కూడా ఫెడరల్ బ్యాంకు ఖాతాలను కలిగి ఉండాలి. రానున్న కాలంలో ఈ సేవలను విస్తృతం చేయనున్నారు. స్మైల్‌పే ద్వారా ఒక్కో లావాదేవీకి రూ.5వేల వరకు పరిమితి ఉంటుంది. నెలకు రూ.50 వేల వరకు చెల్లింపులు చేయవచ్చు. బ్యాంకు మర్చంట్స్ తమ మొబైల్‌లో ఫెడ్ మర్చంట్ అప్లికేషన్‌లో పేమెంట్ అప్షన్లలో ఉండే స్మైల్ పే ఆప్షన్ ఎంచుకొని ఈ సదుపాయాన్ని పొందవచ్చు. ఫెడ్ మర్చంట్స్.. కస్టమర్ ఆధార్ నంబరును ఎంటర్ చేసి చెల్లింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. అనంతరం వ్యాపారి మొబైల్ నుంచి కస్టమర్ ముఖాన్ని స్కాన్ చేస్తారు. యూఐడీఏఐ వ్యవస్థలో నిల్వ ఉన్న ఫేషియల్ డేటా ఆధారంగా వెరిఫికేషన్ జరుగుతుంది. ఆ తర్వాత కస్టమర్ ఖాతా నుంచి సొమ్ము డెబిట్ అవుతుంది. ఆ మొత్తం వ్యాపారి ఫెడరల్ బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

బిజినెస్

అమ్మకానికి కాగ్నిజెంట్ చెన్నై ప్రధాన కార్యాలయం!

15 ఎకరాల స్థలానికి రూ.800 కోట్లు వస్తాయని అంచనా

చెన్నై: అమెరికా ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ చెన్నైలోని తన భారత ప్రధాన కార్యాలయాన్ని అమ్మకానికి పెట్టింది. చెన్నై ఐటీ కారిడార్‌లో 15 ఎకరాల విస్తీర్ణం, నాలుగు లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్ ఉన్న ఈ ఆస్తి గత 20 సంవత్సరాలుగా కంపెనీ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతోంది. ఈ ఆస్తికి ఎంత లేదన్నా రూ.800 కోట్ల వరకు ధర లభించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. కాగ్నిజెంట్ ఈ ఆస్తి అమ్మకం కోసం జేఎల్ఎల్‌ను ప్రాపర్టీ అడ్వైజరీగా నియమించింది. చెన్నైకి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థలు భాష్యం గ్రూప్, కాసాగ్రాండ్ ఈ ఆస్తి కోసం పోటీ పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికల్లా ఈ విక్రయాన్ని పూర్తి చేయాలని కాగ్నిజెంట్ యోచిస్తున్నట్లు సమాచారం. చెన్నై జీఎస్‌టీ రోడ్డులోని తాంబరం ప్రాంతానికి కాగ్నిజెంట్ తన ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తుండడంతో ఈ కార్యాలయాన్ని అమ్మకానికి పెట్టింది.

టర్మ్ పాలసీలకు జీఎస్‌టీ మినహాయింపు?

న్యూఢిల్లీ: బీమా కంపెనీలు అందించే టర్మ్ పాలసీలపై ప్రభుత్వం త్వరలో తీపికబురు చెప్పబోతున్నట్టు సమాచారం. ఈ పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వచ్చే నెల 9న జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో ఈ విషయం అధికారికంగా ప్రకటిస్తారని అధికార వర్గాలు చెప్పాయి. ఇతర బీమా పాలసీల్లానే ఈ పాలసీలపైనా ప్రస్తుతం 18 శాతం జీఎస్‌టీ విధిస్తున్నారు. పన్ను మినహాయింపు లభిస్తే ఈ పాలసీలకు మరింత ఆదరణ లభించనుంది. 10 నుంచి 30 సంవత్సరాల కాలపరిమితి ఉండే ఈ పాలసీల గడువులో.. పాలసీదారుడు మరణిస్తే.. అతడి కుటుంబానికి బీమా కంపెనీ ద్వారా పాలసీలో పేర్కొన్నంత మేరకు ఆర్థిక రక్షణ లభిస్తుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు ఆమోదిస్తే ఏటా రూ.200 కోట్ల మేర జీఎస్‌టీ ఆదాయం మాత్రమే నష్టపోతుందని అంచనా.

గతంలో ఇచ్చిన ఆఫర్లన్నీ గౌరవిస్తాం: విప్రో

న్యూఢిల్లీ: గతంలో జారీ చేసిన ఉద్యోగాల ఆఫర్ పత్రాలన్నింటినీ గౌరవించడం, వారందరినీ ఉద్యోగాల్లో చేర్చుకోవడం తమ ప్రాధాన్యత అని ఐటీ కంపెనీ విప్రో ప్రకటించింది. వర్తమాన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అలాంటి 3,000 మంది "కొత్త తరం అసోసియేట్ల"ను (ఎన్‌జీఏ) ఉద్యోగాల్లో చేర్చుకున్నట్టు తెలిపింది. మొత్తం 10 వేల నుంచి 12 వేల ఎన్‌జీఏలకు ఉద్యోగాలివ్వనున్నట్టు తెలిపింది. టెక్నాలజీ పరిశ్రమలో ఉద్యోగాల కోతలు ఉన్న నేపథ్యంలో ఈ హామీకి ప్రాధాన్యత ఏర్పడింది. తాము జెనరేటివ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ విభాగాల్లో ఉద్యోగులను చేర్చుకుంటున్నట్టు తెలిపింది.



జోరు తగ్గిన ఆర్థికం

15 నెలల కనిష్ఠానికి జీడీపీ వృద్ధి రేటు

క్యూ1లో 6.7 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో జోరు తగ్గింది. దేశంలో స్థూల వస్తూత్పత్తిలో వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (క్యూ1)లో 6.7 శాతానికి పరిమితమైంది. ఇది 15 నెలల లేదా ఐదు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి. వ్యవసాయ, సేవల రంగాలు ప్రదర్శించిన నిరాశావహమైన పనితీరు ఇందుకు కారణం. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు దిగజారినప్పటికీ ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకుంది. మన పోటీ ఆర్థిక వ్యవస్థ అయిన చైనా ఇదే త్రైమాసికంలో 4.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతంలో జీడీపీ వృద్ధి రేటులో కనిష్ఠ స్థాయి 6.2 శాతం 2023 జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైంది. స్థిర ధరల ప్రకారం క్యూ1లో జీడీపీ పరిమాణం రూ.43.64 లక్షల కోట్లున్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ రూ.40.91 లక్షల కోట్లుగా (6.7% వృద్ధి) ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం ఇది రూ.77.31 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో 9.7 వృద్ధితో జీడీపీ పరిమాణం రూ.70.50 లక్షల కోట్లుగా ఉంది. మరిన్ని వివరాలు..

- వ్యవసాయ రంగంలో స్థూల విలువ జోడింపులో (జీవీఏ) వృద్ధి 3.7% నుంచి 2 శాతానికి దిగజారింది. ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తి సర్వీసుల్లో జీవీఏ 12.6% నుంచి 7.1 శాతానికి తగ్గింది.
- వాణిజ్య, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవల రంగం 9.7% నుంచి 5.7 శాతానికి మందగించింది.
- తయారీ రంగం జీవీఏ మాత్రం 5% నుంచి 7 శాతానికి పెరిగింది. గనులు, క్వారీ రంగాల్లో జీవీఏ 7% నుంచి 7.2 శాతానికి, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సర్వీసుల్లో జీవీఏ 3.2% నుంచి 10.4 శాతానికి దూసుకుపోయింది. నిర్మాణ రంగంలో వృద్ధి 8.6% నుంచి 10.5 శాతానికి పెరిగింది.



ప్రధాని మోదీ

ఫిన్‌టెక్‌ల పనితీరు భేష్

సైబర్ మోసాలకు చెక్ పెట్టాలి

లేకపోతే ఫిన్‌టెక్‌ల మనుగడకే ప్రమాదం

ముంబై: దేశంలో ఫిన్‌టెక్ కంపెనీల పనితీరుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ సంస్థల కారణంగానే ఆర్థిక సేవల ప్రజాస్వామీకరణ జరిగిందని ముంబైలో శుక్రవారం ముగిసిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్), 2024 సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలిపారు. అయితే ఈ సంస్థలు అందించే ఆర్థిక సేవల్లో సైబర్ మోసాలు పెరిగి పోతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అడ్డుకోకపోతే ఫిన్‌టెక్ కంపెనీల మనుగడ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. దేశంలో ఫిన్‌టెక్‌లు, స్టార్టప్ కంపెనీల అభివృద్ధికి సైబర్ మోసాలు అడ్డంకి కాకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ మోసాలకు చెక్ పెట్టేందుకు డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెగ్యులేటరీ సంస్థలు మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.2.6 లక్షల కోట్ల పెట్టుబడులు: దేశంలో ఫిన్‌టెక్ కంపెనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఇందుకోసం ఏంజిల్ ట్యాక్స్ రద్దు, పరిశోధన-నవకల్పనలకు రూ.లక్ష కోట్ల కేటాయింపుతో పాటు విధానపరమైన అనేక సానుకూల నిర్ణయాలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ చర్యలతో ఫిన్‌టెక్ రంగం గత పదేళ్లలో 3,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.6 లక్షల కోట్లు) పెట్టుబడులు ఆకర్షించగలిగిందన్నారు. ప్రపంచ ఫిన్‌టెక్‌ల విజయపరంపరలో మన యూపీఐ ఒక ఉదాహరణ అన్నారు. ఫిన్‌టెక్‌లతో అక్రమ నగదు లావాదేవీలకూ తెరపడుతుందని తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ కారణంగా ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెరిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. నేరుగా నగదు బదిలీ పథకం విజయమే ఇందుకు ఉదాహరణ అన్నారు.

గూగుల్ పే నుంచి యూపీఐ సర్కిల్


గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ సందర్భంగా గూగుల్ పే పలు కొత్త డిజిటల్ చెల్లింపుల విధానాలను ఆవిష్కరించింది. ఇందులో యూపీఐ సర్కిల్ ఒకటి. ఈ ఫీచర్ ద్వారా గూగుల్ పే ఖాతాదారులు తమ కుటుంబ సభ్యులు, మిత్రుల బ్యాంకు ఖాతాలను లింక్ చేయకుండానే వారిని సెకండరీ యూజర్లుగా గూగుల్ పేలో చేర్చవచ్చు. ఎన్‌పీసీఐ భాగస్వామ్యంతో గూగుల్ పే ఈ ఫీచర్ తీసుకొచ్చింది. ఇంకా 'ఈ-రూపీ, రూపే కార్డు హోల్డర్ల కోసం ట్యాప్ అండ్ పే విధానాలను ఆవిష్కరించింది.

9 రోజులు..రూ.10 లక్షల కోట్లు

ఈక్విటీ ఇన్వెస్టర్లకు కాసుల పంట.. ఆల్‌టైమ్ హైలో సూచీలు

ఈక్విటీ మార్కెట్ సూచీలు వరుస లాభాలతో కొత్త రికార్డుల పయనం సాగిస్తూనే ఉన్నాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన పటిష్ఠమైన సంకేతాలు, విదేశీ నిధుల రాక, అమెరికా వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలు మార్కెట్‌ను పరుగులు తీయిస్తున్నాయి. సెన్సెక్స్ వరుసగా తొమ్మిదో రోజు లాభపడగా నిఫ్టీ వరుసగా 12వ రోజు లాభాలతో ముగిసింది. 12 వరుస సెషన్లలో నిఫ్టీ 1,096.90 పాయింట్లు లాభపడింది. 1996లో నిఫ్టీ ఏర్పడిన తర్వాత అత్యుత్తమ ప్రదర్శన ఇదే. శుక్రవారం భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ మార్కెట్ ర్యాలీకి మద్దతు ఇచ్చాయి. సెన్సెక్స్ 231.16 పాయింట్ల లాభంతో చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో కూడా 502.42 పాయింట్లు లాభపడి 82,637.03 పాయింట్ల రికార్డుకు దూసుకుపోయింది. నిఫ్టీ 83.95 శాతం లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 25,235.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 116.4 పాయింట్ల లాభంతో కొత్త చారిత్రక రికార్డు 25,268.35 పాయింట్లను తాకింది.


తొమ్మిది రోజుల ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.10,00,028 కోట్ల మేరకు పెరిగి రూ.4,64,39,993.77 కోట్ల (5.54 లక్షల కోట్ల డాలర్లు) రికార్డును తాకింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,150 ▼	67,050 ▼	93,000 ▼
ముంబై	71,958 ▼	65,914 ▼	85,019 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31 వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	508	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	98
వరంగల్	99	గుంటూరు	98
కరీంనగర్	99	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	92
విశాఖపట్నం	94	అనంతపురం	98
గోదావరి	98		

విస్తారా కథ కంచికి

ఎయిర్ ఇండియాలో విలీనం నవంబరు 11 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ: పది సంవత్సరాల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన విస్తారా విమానయాన సంస్థ కథ కంచికి చేరుతోంది. ఈ ఏడాది నవంబరు 11 వరకే ఈ పేరుతో విమానాలు నడుస్తాయి. నవంబరు 12 నుంచి ఈ సంస్థ టాటాల నిర్వహణలోని ఎయిర్ ఇండియా గ్రూప్‌లో విలీనమవుతోంది. ఎయిర్ ఇండియా గ్రూప్ ఈక్విటీలో రూ.2,058.5 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)తో 25.1 శాతం వాటా తీసుకునేందుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) సంస్థ చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పదేళ్ల విస్తారా ఎయిర్‌లైన్స్ కథ కంచికి చేరుతోంది. ఈ ఏడాది చివరికల్లా ఈ విలీన ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు. పదేళ్ల క్రితం ఎస్ఐఏతో కలిసి 51:49 శాతం భాగస్వామ్యంతో టాటా గ్రూప్.. విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసింది.

ఈ ఏడాది నవంబరు 12 నుంచి విస్తారా విమానాలు, సిబ్బంది ఎయిర్ ఇండియాకు బదిలీ అవుతారని ఎయిర్ ఇండియా సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. నష్టాల్లో ఉన్నప్పటికీ విస్తారా ఎయిర్‌లైన్స్ 70 విమానాలతో 50 ప్రాంతాలకు విమాన సర్వీసులు నడుపుతోంది. ఈ విలీనంతో ఎయిర్ ఇండియా సేవలు మరింత విస్తృతమవుతాయని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో కాల్ సెంటర్

పాలసీబజార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పాలసీబజార్ దక్షిణ భారత్‌లో తన కార్యకలపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా త్వరలో హైదరాబాద్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. 20 నుంచి 25 మంది ఉద్యోగులు ఈ సెంటర్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఖాతాదారులకు సేవలు అందిస్తారని పాలసీబజార్ అనుబంధ సంస్థ పీబీపార్ట్‌నర్స్ మోటార్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ అభిమన్యు శర్మ చెప్పారు. అక్టోబరు నాటికి తమ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం కూడా ప్రారంభమవుతుందన్నారు. పాలసీబజార్ ఆదాయంలో 73 శాతం మోటార్ ఇన్సూరెన్స్ ద్వారా వస్తోందన్నారు. ఇందులో 45 శాతం వాటా వాణిజ్య వాహనాలు, 35 శాతం ద్విచక్ర వాహనాల బీమా ద్వారా వస్తోందన్నారు. పీబీ పార్ట్‌నర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ పాలసీలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్టు తెలిపారు. పాలసీల నమోదు నుంచి క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ వరకు ఈ పార్ట్‌నర్స్ సేవలు అందిస్తారని శర్మ చెప్పారు.

ఎన్‌హెచ్‌పీసీ, ఎస్‌జేవీఎన్‌కు

నవరత్న హోదా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థలైన నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ), సట్లెజ్ జల్‌విద్యుత్ నిగమ్ లిమిటెడ్ (ఎస్‌జేవీఎన్), సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈసీఐ)లకు కేంద్ర ప్రభుత్వం నవరత్న హోదాను ప్రకటించింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌హెచ్‌పీసీ, ఎస్‌జేవీఎన్‌లకు ఇప్పటికే మినీ నవరత్న హోదా ఉండగా తాజాగా ప్రభుత్వం నవరత్న హోదాను ఇచ్చింది.

బాలయ్య అన్‌స్టాపబుల్‌గా సాగాలి

- ఎన్‌బీకే 50ఏళ్ల సినీ ప్రస్థానంపై సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అభిమాన కథానాయకుడు నందమూరి బాలకృష్ణ తన అర్ధ శతాబ్ద నట ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. "50 ఏళ్ల క్రితం ఇదే రోజున 'తాతమ్మ కల' చిత్రంతో సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టిన బాలయ్య.. ఇప్పటికీ అగ్రహీరోగా రాణిస్తూ, నేటి తరాన్ని కూడా అలరించే చిత్రాలతో బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొడుతున్నారు. తండ్రి ఎన్టీఆర్ పోషించిన పౌరాణిక పాత్రలతో పాటు అన్ని జానర్లలో నటించి, తానేంటో చాటి చెప్పారు. కథానాయకుడిగానే కాకుండా.. ప్రజానాయకుడిగా కూడా రాణిస్తున్న బాలకృష్ణ మరిన్ని రికార్డులు సృష్టించి, మరెన్నో మైలు రాళ్లను అధిగమించి, అన్ స్టాపబుల్‌గా ముందుకు సాగాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

బాల మామయ్యా.. సరిలేరు నీకెవ్వరూ!: లోకేశ్

యాభై ఏళ్లుగా వెండితెరపై తిరుగులేని కథానాయకుడిగా వెలుగుతూ ఉన్న బాలకృష్ణకు మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బాల మామయ్యా.. సరిలేరు నీకెవ్వరూ.. అంటూ లోకేష్ శుక్రవారం 'ఎక్స్'లో కొనియాడారు.

కాంట్రాక్టర్లను ఎందుకు మార్చలేదు?

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో వీసీ, జేసీ విచారణ
- నాసిరకం ఆహారంపై లోకేశ్‌కు విద్యార్థుల మెయిల్
- మంత్రి ఆదేశాలతో క్యాంపస్‌కు అధికారుల బృందం
- స్టోర్ రూంలో రేషన్ బియ్యం గుర్తింపు, కేసు నమోదుకు ఆదేశం

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 30: నాసిరకం భోజనం, అల్పాహారాలపై విద్యార్థులు పలుమార్లు ఫిర్యాదు చేసినా కాంట్రాక్టర్‌ను ఎందుకు మార్చలేదని వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహన్‌రావు నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులను ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శుక్రవారం ఉదయం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు నాలుగు పేజీల లేఖను మెయిల్ ద్వారా పంపారు. దీంతో లోకేశ్ ఆదేశాలపై శుక్రవారం క్యాంపస్‌లో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో బాధ్యత వహించాల్సిన ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి హఠాత్తుగా శుక్రవారం ఉదయం సెలవుపై వెళ్లిపోవడంతో ఎవరికి వారు సమాధానం చెప్పే విషయంలో తప్పించుకున్నారు. అధికారుల బృందం తొలుత మెస్‌లను, స్టోర్ రూమ్‌లను పరిశీలించింది. మంత్రి కొలుసు పార్థసారథి క్యాంపస్‌ను పరిశీలించటానికి వచ్చినప్పుడు బాలికల హాస్టల్ గేటుకు తాళాలు వేసి, మంత్రిని కలవకుండా ఎందుకు నిరోధించారని ప్రశ్నించారు. ఆ తర్వాత అధికారులు, విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాగా.. నూజివీడు ట్రిపుల్ ఐటీలో భోజన సదుపాయాలు కల్పిస్తున్న పలు కేటరర్ సంస్థలు విద్యార్థులకు రేషన్ బియ్యాన్ని వండి వార్చుతున్న విషయం జేసీ తనిఖీల్లో శుక్రవారం బయటపడింది. తనిఖీల్లో మెస్ స్టోర్ రూమ్‌ల్లో కుళ్లిన కూరగాయలతోపాటు రేషన్ బియ్యం దొరకడంతో పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావును సదరు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని జేసీ ఆదేశించారు.



మెస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

తగ్గని జ్వరాలు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో జ్వరం, ఇతర రుగ్మతలతో 134 మంది చికిత్స పొందుతున్నారు. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు చెందిన 132 మంది విద్యార్థులు అవుట్ పేషెంట్లుగా వైద్య సేవలను పొందగా, డయేరియా లక్షణాలతో మరో ఇద్దరు, క్యాంపస్‌లోని క్లినిక్‌లో ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు.

ఆ 15,000 కోట్లూ గ్రాంటే

అమరావతి నిర్మాణానికి కేంద్రం సాయం

- ఈఏపీ అప్పుగా తెచ్చి రాష్ట్రానికి ఇస్తుంది
- తిరిగి 100 శాతం కేంద్రమే చెల్లింపు
- రాష్ట్రంపై ఎలాంటి భారమూ పడదు
- కేంద్ర పథకాలను గాడిలో పెడుతున్నాం
- ప్రతి రూపాయీ సద్వినియోగం చేస్తాం
- గత సర్కారులో భారీగా నిధుల మళ్లింపు
- పెండింగ్ బిల్లులు రూ.1.30 లక్షల కోట్లు
- వచ్చే ఏడాది డిసెంబరు నాటికి చెల్లింపు
- ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్



అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రూ.15,000 కోట్లను గ్రాంటుగా భావించాల్సి ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ చెప్పారు. ఈ రూ.15,000 కోట్లను కేంద్రం ఈఏపీ అప్పుగా తెచ్చి రాష్ట్రానికి ఇస్తుందని తెలిపారు. తిరిగి ఆ అప్పును పూర్తిగా 100 శాతం కేంద్రమే చెల్లిస్తుందని స్పష్టంచేశారు. దీనికి సంబంధించి రాష్ట్రంపై ఎలాంటి భారం పడబోదని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..సాధారణంగా ఈఏపీ 90:10, 70:30, 85:15 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రం వాటాలుంటాయని, కానీ ఏపీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆ మొత్తం భారాన్ని కేంద్రమే భరిస్తోందన్నారు. అలాగే గత ఐదేళ్లలో నిర్వీర్యమైన కేంద్ర ప్రభుత్వ పథకాలను తిరిగి గాడిలో పెడుతున్నట్టు చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి రూపాయి తీసుకొచ్చి సద్వినియోగం చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వాడుకోవడానికి కేంద్రం ఇచ్చిన అప్పుల అనుమతి రూ.47,000 కోట్లు దాదాపు పూర్తి కావొచ్చిందని తెలిపారు. అక్టోబరు-డిసెంబరు కాలానికి మరో 0.5 శాతం అంటే రూ.8,000 కోట్లకు అనుమతి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇది కాకుండా చివరి త్రైమాసికంలో మరికొంత అప్పునకు కేంద్రం అనుమతిస్తుందని పేర్కొన్నారు. ఈఏపీల ద్వారా తీసుకున్న రుణాలు చాలా ఖరీదయ్యాయని, 9-10 శాతం వడ్డీ పడుతోందని చెప్పారు. విదేశీ కరెన్సీతో పోల్చితే రూపాయి విలువ తగ్గడంతో ఆ రుణాలు ఖరీదయ్యాయని చెప్పారు. కానీ ఆర్‌బీఐ, నాబార్డు, జైకా, ఏడీబీ నుంచి ఇంకా తక్కువ వడ్డీకే రుణాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అప్పులు తెచ్చి సొంత అవసరాల కోసం వాడుకుని భారీగా నిధులు మళ్లించిందని, ఆ తప్పు తాము చేయబోమని చెప్పారు. కార్పొరేషన్లు వాటి అవసరాల మేరకు అప్పులు తెచ్చుకుని వాడుకుంటాయని తెలిపారు. ఐదేళ్ల పాటు పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను ఒక్కరోజులో చెల్లించలేమని, దీనికి చాలా సమయం పడుతుందని పీయూష్ కుమార్ అన్నారు. ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రంలోని వివరాల ప్రకారం రూ.1.30 లక్షల కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని, వీటిని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తిగా చెల్లించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో ఖజానాకు ఆదాయం పెరగలేదన్నారు. మైనింగ్, ఎక్సైజ్ విభాగాల్లో అవలంబించిన విధానాల వల్ల కూడా ఆదాయం దెబ్బతిందని చెప్పారు. వీటన్నింటిని సరిచేసి ఖజానాకు ఆదాయం పెంచేందుకు తాము చేపట్టిన చర్యలు ఫలితమిచ్చి ఆదాయం పెరగడానికి ఏడాదిన్నర సమయం పట్టొచ్చని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు. బిల్లుల చెల్లింపులో కూడా ఇదే విధానం పాటిస్తామని, క్యాపిటల్ వ్యయం కింద ఉన్న బిల్లులు త్వరగా చెల్లించి యూసీలు సమర్పిస్తే కేంద్రం నుంచి తదుపరి నిధులు వస్తాయని పేర్కొన్నారు. ఖజానాకు ఆదాయం పెంచడంతో పాటు ప్రభుత్వ ఖర్చులు కూడా తగ్గించుకుంటామని వెల్లడించారు. ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వివిధ శాఖల నుంచి గత ప్రభుత్వం దాదాపు రూ.4,700 కోట్లు డిపాజిట్లు తీసుకుందని తెలిపారు. వీటిని వివిధ శాఖలకు ఇచ్చిందని, 2033 వరకు వెనక్కి తిరిగివ్వలేమని పీయూష్ కుమార్ చెప్పారు. అప్పటి వరకు ఆ డిపాజిట్లపై వడ్డీ అందుతుందని చెప్పారు.

శ్రీవారి సేవలో జస్టిస్ రాకేష్‌కుమార్



ఆలయం ముందు జస్టిస్ రాకేష్‌కుమార్

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రాకేష్‌కుమార్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఐదు నెలల్లో 60 లక్షల మొక్కలు నాటారా?

- అవి ఎక్కడున్నాయో చూపిస్తే రాజీనామా చేస్తా: అయ్యన్న

అనకాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ద్వారా ఐదు నెలల్లో 60 లక్షల మొక్కలు నాటినట్టు రికార్డుల్లో చూపుతున్నారని, అవి ఎక్కడ ఉన్నాయో చూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని నర్సీపట్నం శాసనసభ్యుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవం-2024 సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో తొలుత మాట్లాడిన కలెక్టర్ ఐదు నెలల్లో జిల్లాలో అటవీ శాఖ ద్వారా 60 లక్షల మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. అనంతరం అయ్యన్నపాత్రుడు తన ప్రసంగంలో కలెక్టర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. సోషల్ ఆడిట్ చేయిస్తే అటవీ శాఖ పనితనం తెలుస్తుందన్నారు. మొక్కలు నాటినట్టు రికార్డులు ఇస్తే.. ఓకే, ఓకే అని చప్పట్లు కొడుతున్నామన్నారు. ఐదు నెలల్లో 60 లక్షలు ఎక్కడ నాటారు? నర్సరీలు ఎక్కడ పెంచారు? ఆ నర్సరీల్లో మొక్కలెన్ని? వివరాలు చెప్పగలరా? అని సభాముఖంగా అధికారులను ప్రశ్నించారు. తప్పుడు రికార్డులు వద్దని అటవీ శాఖ సిబ్బందికి హితవు పలికారు. సోషల్ ఆడిట్ జరిపించి 60 లక్షల మొక్కలు ఉన్నాయని చెబితే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. సామాజిక వనాల పెంపులో ఎన్‌సీసీ, రెడ్ క్రాస్‌ను భాగస్వాములను చేయాలని సూచించారు. సభకు ముందు అయ్యన్నపాత్రుడు మొక్క నాటారు.

తెలుగు రాష్ట్రాల చరిత్రకు ఇది ఆధార గ్రంథం

- గల్లా అరుణకుమారి స్వీయచరిత్రను ఆవిష్కరించిన ప్రసిద్ధ రచయిత్రి ఓల్గా



సభలో ప్రసంగిస్తున్న రచయిత్రి ఓల్గా

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అరవై ఏళ్ల ఆర్థిక, రాజకీయ, సామాజిక, అభివృద్ధి చరిత్రను రాయాలనుకున్నవారికి ముఖ్య ఆధారంగా గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర ఉపయోగపడుతుందని ప్రసిద్ధ రచయిత్రి ఓల్గా అన్నారు. తిరుపతి సమీపం కరకంబాడిలోని అమరరాజ ప్రాంగణంలో గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకాన్ని శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఒక సాధారణ రాజకీయ నాయకురాలిగా కాక అరుణకుమారి భిన్నమైన వ్యక్తిత్వాన్ని ఈ పుస్తకం ఆవిష్కరించిందన్నారు. ఇది ఆత్మకథ కాదని, ఒక స్త్రీ పోరాట కథగా స్ఫూర్తినిచ్చే పుస్తకమని ఓల్గా అన్నారు. సభలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఈనాడు ఏపీ ఎడిటర్ మానుకొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. స్త్రీ సాధికారతకు చిహ్నంగా గల్లా అరుణకుమారి ఆత్మకథను అభివర్ణించారు. ఎమెస్కో అధినేత చంద్రశేఖరరెడ్డి పుస్తకాన్ని పరిచయం చేయగా, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు గ్రంథ విశేషాలను వివరించారు. అమ్మగా గల్లా అరుణ పుస్తకంలోని నిజాయితీని మాజీ ఎంపీ గల్లా జయదేవ్, అమర హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమాదేవి వివరించారు. అరుణ ఆత్మకథలోని ప్రతి ఘట్టానికీ తాను ప్రత్యక్ష సాక్షినని ఆమె భర్త గల్లా రామచంద్రనాయుడు చెప్పారు. తన స్వీయచరిత్రలో రాసిన ప్రతి సందర్భమూ సొంత అనుభవమేనని, వాస్తవమని, ఎవరినీ కించపరచడానికీ, బాధపెట్టడానికి రాయలేదని అరుణకుమారి తెలిపారు.

ప్రజలకు పక్కాగా ఉచిత ఇసుక

- అమలులో రాజకీయ ఒత్తిళ్లకు లొంగకండి
- జిల్లా స్థాయిలో సీసీఆర్‌లను ఏర్పాటు చేసుకోండి
- కలెక్టర్లు, గనుల శాఖ అధికారులతో మీనా వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పంపిణీ అత్యంత పారదర్శకంగా సాగేలా పర్యవేక్షించాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను కోరారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి ఆయన, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రభుత్వ పాలసీని నీరుగార్చేలా రాజకీయ నేతలు చేసే ఒత్తిళ్లకు లొంగవద్దు. ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు పక్కాగా ప్రజలకు ఉచితంగా ఇసుక అందేలా జిల్లాల వారీగా కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి. సెప్టెంబరు 11 నుంచి నూతన ఇసుక సమగ్ర పాలసీ అమలులోకి రానుంది. తక్షణమే జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. పట్టా భూముల్లో ఇసుక తవ్వకం, అమ్మకాలకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు ఇస్తాం. రాష్ట్ర స్థాయిలో ఏకీకృత ధర అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం' అంటూ కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇకపై ఆరు పని దినాలు

- ఉన్నత విద్యామండలి

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇకపై వారంలో ఆరు రోజులు ఆఫీసుకు రావాలని అధికారులు, ఉద్యోగులను ఉన్నత విద్యామండలి ఆదేశించింది. ఈ మేరకు మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. రోజువారీ పనిభారాన్ని అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అయితే ఈ నిర్ణయంపై ఉద్యోగుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉన్న కె.రామ్మోహన్‌రావు ఆదేశాలతో పని దినాలను పెంచడాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఉన్న విధానానికి విరుద్ధంగా సొంత నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

జస్టిస్ శ్యామ్‌సుందర్‌కు ఘనంగా వీడ్కోలు

- 33 ఏళ్లు... సుదీర్ఘకాలం న్యాయ వ్యవస్థకు సేవలు
- క్లిష్టమైన కేసుల పరిష్కారం... పలు కీలక తీర్పులు
- కొనియాడిన సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



జస్టిస్ శ్యామ్‌సుందర్‌ను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం సభ్యులు

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్ సుందర్‌కు శుక్రవారం హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఆయన శుక్రవారం పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో మొదటి కోర్టు హాలులో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ శ్యామ్ సుందర్ అందించిన న్యాయసేవలను కొనియాడారు. న్యాయాధికారిగా, న్యాయమూర్తిగా వివిధ హోదాల్లో 33 ఏళ్లపాటు న్యాయవ్యవస్థకు సేవలు అందించారన్నారు. ఇంత సుదీర్ఘకాలం న్యాయవ్యవస్థలో సేవలు అందించడం చిన్నవిషయం కాదన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ఎన్నో క్లిష్టమైన కేసులను పరిష్కరించారన్నారు. పలు కీలక తీర్పులు ఇచ్చారన్నారు. పదవీ విరమణ తరువాత జస్టిస్ శ్యామ్ సుందర్ శేషజీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా సాగాలని కోరుకుంటున్నానన్నారు. జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ... 'న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించినప్పుడు నా తండ్రి మార్గదర్శకం చేశారు. వృత్తిలో ఈ స్థాయికి ఎదుగుతానని ఎన్నడూ అనుకోలేదు. సహకరించిన వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు. సుదీర్ఘ కెరీర్ ఎన్నో మధురస్మృతులను అందించింది' అని అన్నారు. అంతకముందు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.ద్వారకానాథ్‌రెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు మాట్లాడుతూ జస్టిస్ శ్యామ్‌సుందర్ అందించిన న్యాయసేవలను కొనియాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ శ్యామ్‌సుందర్ కుటుంబ సభ్యులు, రిజిస్ట్రార్‌లు, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జస్టిస్ శ్యామ్‌సుందర్ దంపతులను ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరావు, కార్యవర్గం ఆధ్వర్యంలో జస్టిస్ బి.శ్యామ్‌సుందర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

మంత్రి నారాయణతో వీఐటీ వర్సిటీ చాన్స్‌లర్ భేటీ



ఏపీ మంత్రి నారాయణతో వీఐటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డా. విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలో గల 'వీఐటీ-ఏపీ' యూనివర్సిటీ చాన్స్‌లర్ డా.విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ శుక్రవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వానికి వీఐటీ యూనివర్సిటీ అన్ని రకాలుగా సహకరిస్తుందని వారు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో వీఐటీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.ఎస్వీ కోటరెడ్డి, రిజిస్ట్రార్ డా.జగదీశ్ చంద్ర ముదిగంటి కూడా ఉన్నారు.

సీఎం సార్.. ప్రాణ రక్షణ కల్పించండి!

- చంద్రబాబుకు లేఖ రాసిన ఆరుద్ర

సర్పవరం జంక్షన్, ఆగస్టు 30: కుటుంబసభ్యుల నుంచి దివ్యాంగురాలైన తన కుమార్తెకు ప్రాణ రక్షణ కల్పించాలని.. తన బిడ్డ ఆరోగ్యం కోసం ఆస్తి అమ్మించి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శుక్రవారం వారాణసి నుంచి రాజులపూడి ఆరుద్ర విలేకరులకు విడుదల చేశారు. కాకినాడ రూరల్ రాయుడుపాలేనికి చెందిన తమ దంపతులకు కుమార్తె సాయిలక్ష్మి చంద్ర ఉందని, ఆమె వెన్నెముక అనారోగ్య సమస్యతో బాధపడుతోందని తెలిపారు. అమలాపురంలో తన భర్త ద్వారా తనకు, తన బిడ్డకు సంక్రమించిన ఆస్తి ఉందన్నారు. తన భర్త అన్నయ్య రాజులపూడి సోమశేఖర్, ఆతడి కుమారుడు భరత్‌కుమార్, పెదబావ కుమారుడు చక్రధర్ గతంలో పలుసార్లు తక్కువ ధరకు ఆ ఆస్తిని కొనేయాలని రాయబారం పంపించారన్నారు. ఇందుకు తాను, తన భర్త అంగీకరించకపోవడంతో కామన రామ్మోహనరావు అనే వ్యక్తితో కలిసి కొందరు కుటుంబ సభ్యులతో తమను బెదిరించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో తన బిడ్డకు న్యాయం జరక్కపోగా, అడుగడుగునా అడ్డంకులు సృష్టించి పోలీసులు, వైద్యులతో కలిసి అనేకరకాలుగా ఇబ్బందులు పెట్టి ఈ రాష్ట్రంలో ఉండలేని పరిస్థితులు కల్పించారని అన్నారు. దీంతో పరాయి రాష్ట్రంలో తలదాచుకుంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడంతో భరోసాతో సొంతూరుకు వచ్చామన్నారు. కుమార్తె వైద్యం ఖర్చుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.5 లక్షలు ఇచ్చారని, ఈ సొమ్ముతో కాశీలో వైద్యం చేయించుకుంటున్నామని తెలిపారు. అయితే ఆస్తి జోలికి రావద్దని, ప్రాణం పోయాకా ఎలాగూ ఆస్తి వాళ్లదేనని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఏపీకి వచ్చినా.. ఏ ఫిర్యాదు ఇచ్చినా యాక్సిడెంట్ జరిగిపోతుందంటూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. దీంతో రహస్య ప్రదేశంలో తలదాచుకుంటున్నానని వెల్లడించారు. కదలలేనిస్థితిలో ఉన్న దివ్యాంగురాలైన తన కుమార్తెకు రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, సీఎంవోకు లేఖ రాసి పంపినట్టు తెలిపారు.

హార్టీ సెట్ ఫలితాల విడుదల

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ హార్టీకల్చర్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన హార్టీ సెట్ ఫలితాలను ఉప కులపతి డాక్టర్ కె.గోపాల్ శుక్రవారం విడుదల చేశారు. 266 మంది హార్టీసెట్ రాయగా 255 మంది ఉత్తీర్ణత సాధించారు. హార్టీసెట్‌లో మొదటి ర్యాంకు అనుమల విజయలక్ష్మి (సత్యసాయి జిల్లా), రెండో ర్యాంకు కుంపాటి పావని(నంద్యాల), మూడో ర్యాంకు గోసాల సతీష్ (ప్రకాశం) సాధించినట్టు వీసీ వెల్లడించారు.

దేశానికి ఆదర్శంగా ప్రభుత్వ బడులు

- మానవ వనరుల మంత్రి లోకేశ్
- భీమిలి కస్తూర్బా, కొమ్మాది జడ్పీ పాఠశాలల సందర్శన



విశాఖ నగర శివారునున్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులతో మంత్రి లోకేశ్

భీమునిపట్నం/కొమ్మాది (విశాఖపట్నం జిల్లా), ఆగస్టు 30: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దేశానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్టు మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శుక్రవారం ఆయన విశాఖ జిల్లా భీమిలి కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలి చెప్పులను బయట విడిచిపెట్టి తొమ్మిదో తరగతి గదిలోకి వెళ్లారు. ఆ సమయంలో విద్యార్థినులు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష రాస్తుండగా.. ఒక విద్యార్థి వద్ద నుంచి ప్రశ్నపత్రాన్ని, ఆన్సర్ షీట్‌ను తీసుకుని చూసి వెరీగుడ్ అన్నారు. విద్యార్థినులను ఉద్దేశించి 'పరీక్షలు ఏ లాంగ్వేజీలో అయితే మీకు బాగుంటుందని' ప్రశ్నించారు. 'మాట్లాడడం తెలుగులో బాగుంటుంది, బోధన ఇంగ్లీష్‌లోనే జరుగుతోంది, అందువల్ల ఇంగ్లీష్‌లోనే పరీక్షలు బాగా రాస్తున్నామని' వారు సమాధానమివ్వగా.. ఇంగ్లీష్ లాంగ్వేజీలో మరింత మెరుగుగా తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. అనంతరం పదో తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యపుస్తకం తీసుకుని పలు ప్రశ్నలు వేసి విద్యార్థినుల నుంచి సమాధానాలు రాబట్టారు. క్లాస్ రూమ్‌లో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాస్ రూమ్‌లో ఏర్పాటుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. లక్ష్య సాధనకు పట్టుదలతో చదవాలన్నారు.

తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తాం

విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేస్తామని లోకేశ్ అన్నారు. విశాఖ నగర శివారునున్న మధురవాడ చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలకు ఇంగ్లీషు ల్యాబ్ కావాలని ఒక విద్యార్థిని కోరగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ఎంతమంది విద్యార్థినులకు ఎన్ని మరుగుదొడ్లు ఉన్నాయని ఆరా తీశారు. క్రీడా మైదానంలో పూర్తిగా నీరు నిలిచి ఉండడాన్ని పరిశీలించారు. పాఠశాలకు చేరుకోవడానికి జాతీయ రహదారి దాటాల్సి ఉన్నందున అనేకసార్లు విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని, అందువల్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి లోకేశ్



- ఎక్స్‌లో కార్యకర్త పోస్టుకు స్పందన
- మత్స్యకార బాలుడి వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.5.14 లక్షలు మంజూరు

కూనవరం, ఆగస్టు 30: మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. టీడీపీ కార్యకర్త 'ఎక్స్'లో తెలిపిన సమస్యకు వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిరుపేద కుటుంబానికి రూ.5.14 లక్షలు మంజూరు చేయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కాచవరం గ్రామంలోని మత్స్యకార కుటుంబానికి చెందిన శ్రీలత ఈ నెల 22న భద్రాచలంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ ఉమ్మనీరు తాగడంతో అక్కడి వైద్యులు ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యానికి సుమారు రూ.5 లక్షలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో శ్రీలత కుటుంబానికి ఏమీ పాలుపోలేదు. విషయం తెలుసుకున్న టీడీపీ అరకు పార్లమెంటరీ యువజన విభాగం ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్ బాలుడి పరిస్థితిని ఎక్స్‌లో మంత్రి లోకేశ్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన వైద్య పరీక్షలకు రూ. 5.14 లక్షలు మంజూరు చేశారు. ఖమ్మం ఆసుపత్రిలో రూ.లక్ష చెల్లించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. తన బిడ్డకు సాయం అందేలా కృషి చేసిన రంజిత్‌కుమార్‌కు శ్రీలత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

7 నుంచి మద్యం షాపులు బంద్

- ఉద్యోగ భద్రత కల్పించాలన్న ఉద్యోగుల సంఘం

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌పై సెప్టెంబరు 7 నుంచి మద్యం షాపులు బంద్ చేయాలని నిర్ణయించినట్లు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. గత ప్రభుత్వంలో ఇంటర్వ్యూల ద్వారా తమను ఎంపిక చేశారని, ఇప్పుడు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని పేర్కొంది. ఉద్యోగ భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం స్పందించే వరకు బంద్ కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలంటూ ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రారావు, జి.కోటేశ్వరరావు శుక్రవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ప్రైవేటు మద్యం షాపుల పాలసీ వస్తే 15 వేల మంది రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. మద్యం షాపుల్లో కాకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈనెల 4 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం ఉపాధి కల్పించాలని మాత్రమే కోరుతున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'నికోబార్' భయాలు

డెబ్బైరెండువేల కోట్ల రూపాయల 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' మళ్ళీ చర్చలోకి వచ్చింది. మాజీ పర్యావరణ మంత్రి జైరామ్ రమేష్‌కీ, ప్రస్తుత మంత్రి భూపేందర్ యాదవ్‌కూ మధ్య ఇటీవల రేగిన వాగ్వాదం పర్యావరణ ప్రేమికులకు మరోమారు ఈ ప్రాజెక్టుమీద తమ భయాలు, అభ్యంతరాలు పంచుకోవడానికి అవకాశం ఇచ్చింది. విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, ఎంత అప్రదిష్టపాల్జేసినా ఈ ప్రాజెక్టు ఆగదని ప్రభుత్వం అంటోంది. ప్రాజెక్టుకు సంబంధించి వివిధ అంశాలపై తన అభ్యంతరాలు తెలియచేస్తూ పర్యావరణమంత్రికి జైరామ్ రమేష్ రాసిన సుదీర్ఘ లేఖలను పాలకులు ఏ విధంగా తీసుకున్నప్పటికీ, పర్యావరణ ప్రేమికులు మాత్రం స్వాగతిస్తున్నారు.

నేషనల్ సెంటర్ ఫర్ సస్టయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎమ్) తన నివేదికలో ప్రస్తావించిన అంశాలను, ఈ ప్రాజెక్టు ఎట్టిపరిస్థితుల్లోనూ కోస్టల్ రెగ్యులేషన్ జోన్-1ఎ లోపలకు విస్తరించకూడదన్న ఆ హెచ్చరికలను, కార్యక్షేత్రంలో అందుకు పూర్తిభిన్నంగా వ్యవహారం సాగుతున్న విషయాన్నీ రమేష్ తన లేఖలో ప్రస్తావించారు. ప్రాజెక్టు అమలు జరుగుతున్న ప్రాంతాల్లో ఎన్ని పగడపు దీవులున్నాయో, అరుదైన తాబేళ్ళు, పక్షుల సంతానోత్పత్తి స్థావరాలు ఎలా ప్రమాదంలో పడ్డాయో వివరించారు. ఈ కీలకమైన, సున్నితమైన ప్రాంతాల వర్గీకరణల్లోనూ, నిర్వచనాల్లోనూ అత్యున్నతస్థాయి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మార్పుచేర్పులు ప్రజలకు తెలియచేయాల్సి ఉండగా, రక్షణపరంగా కీలకమైన అంశం అంటూ వాటిని దాచిపెడుతున్నారన్నది ఆయన ఆరోపణ. ఈ ప్రాజెక్టులో అధికభాగం ఆర్థిక, వాణిజ్య పరమైనదేనని ఆయన గుర్తుచేస్తున్నారు. ఒకభాగమైన ఓడరేవుకు స్థలాన్ని ఎంపికచేయడంలో కేవలం సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని, పర్యావరణాంశాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని నిపుణుల కమిటీ 2021ఏప్రిల్ నివేదికలో వ్యాఖ్యానించిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఇతర ప్రాంతాల ప్రజల, పర్యాటకుల రాకపోకల వల్ల ఇక్కడి అరుదైన షోంపెన్ తెగలవారి ఉనికికి ముప్పు ఏర్పడటం ఖాయమనీ, స్థానిక ఆదివాసీ తెగల మనోభిప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించలేదనీ జైరామ్ రమేష్ చేస్తున్న విమర్శను భూపేందర్ యాదవ్ కొట్టిపారేస్తున్నారు.

ఈ ప్రాజెక్టుకు మీ మంత్రిత్వశాఖ ఇచ్చిన అన్ని అనుమతులనూ రద్దుచేయండి అంటూ పర్యావరణమంత్రికి జైరామ్ రమేష్ రాసినలేఖతో మొదలై, అనేకరోజులుగా సాగుతున్న ఈ వివాదం ఇప్పట్లో ముగిసేట్టు లేదు. రాష్ట్రపతి ఏడాదికాలంలో రెండుసార్లు ఇక్కడకు వెళ్ళిరావడం, రక్షణ పరంగా, వ్యూహాత్మకంగా ఈ ద్వీపం మనకు ఎంత ముఖ్యమో సైనికాధికారులనుంచి తెలుసుకోవడం పాలకుల పట్టుదలకు నిదర్శనం. ఇక్కడ ఓ నౌకాస్థావరాన్ని ఏర్పాటు చేస్తే చైనామీద కన్నువేయవచ్చునని, కీలకమైన సముద్ర రవాణామార్గాలను నియంత్రించవచ్చునని భారత ప్రభుత్వం ఆలోచన. వ్యూహాత్మకంగా, రక్షణపరంగా ఈ ప్రాజెక్టు మనకు ఎంతోముఖ్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అత్యధికమేలు అస్మదీయులకేనని విపక్షాల అనుమానం. నికోబార్ ద్వీపంలో పదిహేను శాతం అటవీప్రాంతాన్ని ప్రభావితం చేసే ప్రాజెక్టు ఇది. లక్షలాదిచెట్లు కూల్చి, మూడువందల హెక్టార్ల మేరకు సముద్రాన్ని మధించి, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ కంటైనర్ టెర్మినల్, ఒక టౌన్‌షిప్, సౌర విద్యుత్ కేంద్రం అభివృద్ధిచేస్తారు. భారీ నిర్మాణాలకోసం సంవత్సరాల తరబడి డ్రెడ్జింగ్, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్‌లతో ఈ ప్రాంతం దద్దరిల్లబోతున్నది. స్వచ్ఛమైన ఆ నేల, నీరు, గాలి తీవ్రంగా కలుషితం కాబోతున్నాయి. పర్యావరణానికి కానీ, గ్రేట్ నికోబార్‌లో ఉన్న ఏకైక తెగ మనుగడకు కానీ ఏ లోటూ ఉండదన్న ప్రభుత్వం వాదనను పర్యావరణవేత్తలు ఎవరూ నమ్మడం లేదు. పర్యావరణం అంశాన్ని పక్కనబెట్టినా, రెండుదశాబ్దాలక్రితం సునామీ తీవ్రతను అధికంగా చవిచూసిన, భూకంపాలకు పుట్టినిల్లయిన ఈ ప్రదేశంలో ఒక నౌకాస్థావరాన్ని నెలకొల్పడం సరైనదేనా అన్నది ప్రశ్న.

పెన్షన్ చిక్కుల్లో ప్రభుత్వాలు, పార్టీలు

కేంద్రంలోని అధికార పక్షంతో సహా రాజకీయ పార్టీలు, ముఖ్యమంత్రులు ఇప్పుడు ఒక ఉభయ సంకటంలో ఉన్నారు. వారు ఎదుర్కొంటున్న సందిగ్ధత పెన్షన్ (పింఛన్) పథకానికి సంబంధించినది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక కొత్త పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అనే ఆ కొత్త పింఛన్ పథకం వచ్చే ఆర్థిక సంవత్సరం (1, ఏప్రిల్, 2025) నుంచి అమలులోకి వస్తుంది. 'ఇది ఉద్యోగుల గౌరవం, ఆర్థిక భద్రతకు భరోసా ఇచ్చే పథకం' అని ప్రధాని మోదీ అన్నారు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ఉద్యోగ విరమణ వయసు దాటిన భారత పౌరులు అందరూ పెన్షన్ పొందడం లేదు. ఆ మాటకొస్తే అసలు ఎటువంటి పింఛన్ పొందనివారే దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నారు. కారణమేమిటి? ఒక పౌరుడికి అతని వృద్ధాప్యంలో పెన్షన్‌ను ప్రసాదించే సామాజిక భద్రతా సదుపాయం ఏదీ మన దేశంలో లేదు ప్రైవేట్ రంగంలో ఉద్యోగులుగా ఉన్న కోట్లాది పౌరులు ఉద్యోగ విరమణ అనంతరం ఎటువంటి పింఛన్‌కు నోచుకోవడం లేదు. చివరకు దేశ సరిహద్దులను కాపాడే సాయుధ బలగాలలోని స్వల్ప కాలిక సర్వీస్ కమిషన్డ్ అధికారులకు సైతం పెన్షన్ సదుపాయం లేదు.

దేశ ప్రజల సగటు జీవిత కాలం తక్కువగా ఉన్నప్పుడు పెన్షన్ ఒక సమస్య కాలేదు. ఆ సామాజిక భద్రతకు ఎవరూ ప్రాధాన్యమివ్వలేదు. కొద్ది మంది మాత్రమే పెన్షన్ పొందేవారు. ఉద్యోగ విరమణ అనంతరం దీర్ఘకాలం జీవించే వారూ తక్కువే. 1947లో స్వతంత్ర భారతదేశం ఆవిర్భవించినప్పుడు భారతీయుల సగటు జీవితకాలం కేవలం 35 సంవత్సరాలు మాత్రమే. ఇప్పుడు మన సగటు ఆయుర్దాయం 70 సంవత్సరాలకు పై మాటే. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ చెల్లించాల్సిన బాధ్యత సగటున పది లేదా పన్నెండు సంవత్సరాల దాకా ఉంటుంది. కుటుంబ పెన్షన్ సదుపాయముంటే అతడు/ ఆమె చనిపోయిన తరువాత భార్య/ భర్తకు పెన్షన్ చెల్లించడం తప్పనిసరి అవుతుంది. ఈ కారణంగానే చాలా మంది యజమానులు పెన్షన్ కల్పనకు విముఖత చూపడం కద్దు. అయితే ఉద్యోగులు విధిగా పెన్షన్‌ను కోరుకోవడం కూడా అంతే కద్దు. ఇది అత్యంత సహజం. ఉద్యోగులు పెన్షన్‌ను కోరుకోవడం పూర్తిగా సమర్థనీయం. సుదీర్ఘకాలం, విధేయంగా సేవలు అందించిన తరువాత జీవన భద్రతకు పెన్షన్ అవసరం. పెన్షన్ అనేది వాయిదా వేసిన వేతనం. మరింత స్పష్టంగా చెప్పాలంటే పెన్షన్ ఒక హక్కు. ఈ హక్కు ప్రతి పౌరుడికీ ఉండాలి. విశ్రాంత జీవితంలో గౌరవప్రదంగా, భద్ర భావనతో జీవించేందుకు పెన్షన్ అనేది ఒక సుగమ బాట.

ప్రభుత్వోద్యోగుల విషయంలో 'పెన్షన్ హక్కు' వాదన గెలిచింది. అది సరైన వాదన. కనుక న్యాయమైన తీర్పు. మరి పెన్షన్ హక్కు లేని వారి మాట ఏమిటి? (ఇటువంటి వారే దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నారని మనం మరచిపోకూడదు). ఆ ప్రశ్నకు సమాధానం పెన్షన్ హక్కును ఆ అసంఖ్యాక పౌరులకు కూడా కల్పించడమే అని నిస్సంకోచంగా చెప్పి తీరాలి. నిజానికి మన సమాజంలోని అన్ని వర్గాలవారూ ప్రయోజనం పొందేలా ఒక సార్వజనీన పెన్షన్ పథకం ఉండి తీరాలి.

ప్రభుత్వోద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ భరోసా సంపూర్ణంగా, సుస్థిరంగా లభించిన తరువాత స్థిరపడిన తరువాత బీమా చేసిన కనీస పింఛన్ భావన కూడా ప్రభవించి బలపడింది. ఈ భావన ప్రకారం ఉద్యోగ కాలం చివరి సంవత్సరంలో పొందిన మూల వేతనం + కరువు భత్యం (బేసిక్ శాలరీ + డీఏ)లో 50 శాతాన్ని పెన్షన్‌గా చెల్లించేందుకు నిర్ణయం జరిగింది. 2004లో పాత పింఛన్ పథకం (ఓల్డ్ పెన్షన్ స్కీమ్ – ఓపీఎస్) స్థానంలో కొత్త పింఛన్ పథకం (న్యూ పెన్షన్ స్కీమ్ – ఎన్‌పీఎస్) అమలులోకి వచ్చింది. ఈ ఎన్‌పీఎస్, పెన్షన్ సదుపాయం రెండు ఆధారాలకు భంగం కలిగించింది: నాన్ కంట్రిబ్యూటరీ డిఫైన్డ్ బెనిఫిట్ స్కీమ్ (దీని ప్రకారం ఉద్యోగి రిటైర్మెంట్ ప్రయోజనాలకు అవసరమైన మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలి. ఉద్యోగి ఏమీ చెల్లించనవసరం లేదు)ను పూర్తిగా ఒక డిఫైన్డ్ కంట్రిబ్యూషన్ స్కీమ్ (దీని ప్రకారం పెన్షన్ కోసం ఉద్యోగీ, ప్రభుత్వమూ నిర్దిష్ట మొత్తాలను పెన్షన్‌కై చెల్లించవలసి ఉంటుంది. ప్రావిడెంట్ ఫండ్ మేనేజర్లు ఆ సొమ్మును మదుపు చేసి, వచ్చే రాబడి, పన్ను మినహాయింపుతో ఉద్యోగి పెన్షన్ మొత్తాన్ని నిర్ణయిస్తారు)కు మార్చి వేసింది; కనీస పెన్షన్ భావనను ఎన్‌పీఎస్ పూర్తిగా త్యజించింది.

ఎన్‌పీఎస్‌ను మరింత సులభరీతిలో వివరిస్తాను: ఎన్‌పీఎస్‌లో ఉద్యోగులు తమ మూలవేతనంలో 10 శాతాన్ని పెన్షన్ కోసం చెల్లిస్తారు. ప్రభుత్వం కూడా తన వంతుగా 10 శాతం మొత్తాన్ని జమ చేస్తుంది. ఇలా జమ చేసిన డబ్బుతో ప్రభుత్వం ఎంపిక చేసిన బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలకు చెందిన ఫండ్ మేనేజర్లు వివిధ మార్గాల్లో మదుపు చేస్తారు. ఆ మదుపుల ద్వారా వచ్చే రాబడి ఒక్కోసారి ఒక్కో విధంగా ఉంటుంది. ఇంత రాబడి వస్తుందనే భరోసా ఉండదు. ఈ కారణంగానే ఉద్యోగులు ఎన్‌పీఎస్‌ను వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున నిరసనలు ప్రజ్వరిల్లాయి. నాటి ప్రధాని వాజపేయి ఉద్యోగుల ఒత్తిడికి లొంగలేదు. ఆయన తరువాత ప్రధానమంత్రి అయిన మన్మోహన్‌సింగ్ కూడా ఎన్‌పీఎస్ అమలుకే కట్టుబడి ఉన్నారు. పది సంవత్సరాల పాటు ఉద్యోగుల డిమాండ్‌ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ వచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ సైతం పది సంవత్సరాల పాటు ఉద్యోగుల డిమాండ్‌కు ససేమిరా అంటూ వచ్చారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. మోదీ ప్రభుత్వం యూపీఎస్‌ను తీసుకు వచ్చింది.

ఆగస్టు 3, 2022న ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఖ్య 69,76,240. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో వీరికి



> యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించే ముందు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రతింపులు జరిపారా? ఉద్యోగుల సంఘాలూ సంప్రదింపుల్లో పాల్గొన్నాయా? ఎన్‌పీఎస్, యూపీఎస్ ఉభయ సంకటం నుంచి ప్రభుత్వాలు, రాజకీయపక్షాలు ఎలా బయటపడనున్నాయి? పెన్షనర్లకు ఆర్థిక భద్రత ఏ ఏరకు సమకూరనున్నది?

పింఛన్లు చెల్లించేందుకు బడ్జెట్ పరమైన వ్యయం రూ.2,43,296 కోట్లు. మీడియా వార్తల ప్రకారం మార్చి 2023 నాటికి ఎన్‌పీఎస్‌లో 23.8 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 60.7 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. 2024లో వీరి సంఖ్య కొంచెం అటూ ఇటూగా ఉండవచ్చు. అయితే దేశ జనాభాలో వీరి సంఖ్య చాలా చాలా స్వల్పమనేది ఒక సునిశ్చిత వాస్తవం.

నిధులు సమకూర్చని పెన్షన్ పథకం (అన్‌ఫండెడ్ పెన్షన్ స్కీమ్)తో సమస్యేమిటంటే అది ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించే ప్రమాదమున్నది. పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అలాంటి పథకమే. ప్రభుత్వాలు ఉద్యోగి రిటైర్ అయినప్పుడు అతనికి దక్కవలసిన రిటైర్‌మెంట్ ప్రయోజనాలను కరెంట్ రెవెన్యూ రాబడి నుంచి చెల్లించలేవు. 'పే యాజ్ యు గో' రీతిలో చెల్లించడం అసాధ్యం. అందుకు నిధులు సమకూర్చడం అత్యవసరం. ఎవరు సమకూర్చాలి? ప్రభుత్వం సమకూర్చాలి. లేదంటే ఉద్యోగులు సమకూర్చాలి. లేదూ ప్రభుత్వమూ ఉద్యోగులూ ఇరువురూ సమకూర్చాలి. ప్రభుత్వమూ, ఉద్యోగులూ నిధులు సమకూర్చే పెన్షన్ పథకమే ఎన్‌పీఎస్. ఈ కొత్త పెన్షన్ పథకానికి ప్రభుత్వం తన వాటాగా 14 శాతాన్ని, ఉద్యోగి తన వాటాగా 10 శాతాన్ని సమకూరుస్తున్నారు. 'నిధులు సమకూర్చడమనేది భద్రమైన ఆర్థిక వ్యవహారం.

యూపీఎస్ పెన్షనర్లకు ఆర్థిక భద్రత సమకూరుస్తుందని మోదీ ప్రభుత్వం ఘంటాపథంగా చెప్తుతోంది. ఈ పథకానికి ఉద్యోగులు చెల్లించే వాటా (10 శాతం) యథావిధిగా ఉంటుంది. ప్రభుత్వ వాటా 18.5 శాతానికి పెరుగుతుంది. కనీస పెన్షన్ చెల్లింపునకు యూపీఎస్ హామీపడుతోంది. 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినవారు రిటైర్ అయ్యే ముందు 12 నెలలపాటు తీసుకున్న సగటు మూల వేతనంలో 50 శాతాన్ని కనీస పెన్షన్‌గా నిర్ణయిస్తారు. హీనపక్షం నెలకు రూ.10 వేలు పెన్షన్‌గా లభించే అవకాశం ఉన్నది.

ఈ వ్యాసం రాస్తున్న సమయానికి చాలా రాష్ట్ర ప్రభుత్వాలు యూపీఎస్‌పై తమ వైఖరి ఏమిటో వెల్లడించ లేదు. అసలు ఎలాంటి ప్రకటనలు చేయలేదు. కాంగ్రెస్‌తో సహా ప్రధాన రాజకీయ పక్షాలు యూపీఎస్‌పై తర్జన భర్జనలు చేస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు అనేకం పెన్షన్ నిధికి ఉద్యోగుల విధిగా తమ వాటాను చెల్లించవలసిన నిబంధనను వ్యతిరేకిస్తున్నాయి.


ప్రభుత్వాలు, రాజకీయ పక్షాలు, ఉద్యోగుల సంఘాలు పరిపూర్ణ సందిగ్ధావస్థలో ఉన్నాయి కోశ సంబంధ దృక్కోణం నుంచి మాట్లాడితే యూపీఎస్‌ను తిరస్కరించవలసిన అవసరం లేదు అయితే కొన్ని ప్రశ్నలు : ప్రస్తుతం పెన్షన్ నిధికి ప్రభుత్వ, ఉద్యోగుల వాటా మధ్య ఉన్న 8.5 శాతం వ్యత్యాసం భవిష్యత్తులో మరింతగా పెరుగుతుందా?; 'లోటును ప్రభుత్వం భర్తీ చేస్తుందని ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి టి.వి. సోమనాథన్ (ఈయనే యూపీఎస్‌ను సిఫారసు చేసిన కమిటీకి నేతృత్వం వహించారు) ఇది ఇంచుమించు 'పే యాజ్ యు గో' వంటి పరిస్థితిని ప్రభుత్వానికి కల్పించదూ?; 10+10 వాటాల మొత్తాన్ని మదుపు చేసే బాధ్యతను ఆమోదం పొందిన పెన్షన్ ఫండ్ మేనేజర్లకు అప్పగిస్తూ 8.5 శాతం ప్రభుత్వ కంట్రిబ్యూషన్ మొత్తాన్ని ఎవరు ఎక్కడ మదుపు చేస్తారు?; యూపీఎస్ అమలుకు తొలి సంవత్సరానికిగాను అదనంగా ఇచ్చిన రూ.6,250 కోట్లు చాలా తక్కువగా కనిపిస్తోంది. ఇది నిజంకాదా?; కొత్త పెన్షన్ పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రతించారా? ఉద్యోగుల సంఘాలూ ఆ సంప్రదింపుల్లో పాల్గొన్నాయా? ఎన్‌పీఎస్, యూపీఎస్ ఉభయ సంకటం నుంచి ప్రభుత్వాలు, రాజకీయపక్షాలు ఎలా బయటపడనున్నాయి? పెన్షనర్లకు ఆర్థిక భద్రత ఏ మేరకు సమకూరనున్నది?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఖనిజ సంపదపై రాష్ట్రాలకే హక్కు

సుప్రీంకోర్టు జూలై 25న ఒక చరిత్రాత్మక తీర్పునిచ్చింది. సహజ వనరులపై పన్ను విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి కాక రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలని 1989 నుండి చాలా సంవత్సరాలగా అనేక రాష్ట్రాలు న్యాయపోరాటం సాగిస్తున్నాయి. ఆ న్యాయపోరాటం ఫలితంగానే సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రాలలో లభించే వివిధ సహజ వనరులపై పన్నులు (రాయల్టీ) వసూలు చేసుకోవచ్చు అని తీర్పు ఇచ్చింది. రాష్ట్రాల హక్కులను గుర్తిస్తూ, భారతదేశ రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తిని ఈ తీర్పు శక్తిమంతంగా చాటి చెప్పింది. ఈ కేసు విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ రిషికేశ్ రాయ్, జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ జెబి పార్థివాల, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ విజువల్ బియాన్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ, జస్టిస్ ఆగస్టు ఇన్ జార్జ్ మా షిహ్, మరియు జస్టిస్ బీవీ నాగరత్న ఉన్నారు.

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భూమి నుండి వెలికితీసే సహజ వనరులైన ఇనుము, సిలికా, మైకా, బాక్సైట్, గ్రానైట్, వజ్రాలు, బంగారం, మాంగనీస్ మొదలగు వాటిపై పన్నులను రాష్ట్రాలు వసూలు చేసుకునే హక్కుకు తెరతీసింది. ఈ తీర్పు ఫలితంగా అప్పులలో ఉన్న ఇతర రాష్ట్రాలతో పాటు నిండా అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సంపద్వంతమైన రాష్ట్రంగా అభివృద్ధిపరచవచ్చు. భూమి నుండి మైనింగ్ ద్వారా వెలికితీసినటువంటి ఖనిజాలపై పన్ను విధించడానికి సుప్రీంకోర్టు తీర్పు ఒక మహదవకాశాన్ని కల్పించింది. ఈ తీర్పుతో సహజ వనరులు దండిగా ఉన్నటువంటి ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఆర్థికంగా బలోపేతం కావటానికి అవకాశం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా లభించిన హక్కుతో ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టి కేంద్రం వైపు ఆర్థిక సహాయం కోసం చూడవలసినటువంటి అవసరం ఇతర రాష్ట్రాలతో పాటు ఆంధ్ర ప్రజలకు ఉండదు. అపార సహజ వనరులు ఉన్న రాష్ట్రాలు కేంద్ర పాలకుల అధిపత్య విధానాల ఫలితంగా తక్కువ ఆదాయంతో వెనుకబడిన రాష్ట్రాలుగా ఉంటూ, పర్యావరణ దుష్ప్రభావాలనన్నిటినీ అనుభవిస్తూ పేదరికంలో మగ్గుతున్నాయి.



సహజ వనరులపై రాష్ట్రాల హక్కులను గుర్తిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు వెలుగులో కొన్ని రాష్ట్రాలు గనులు, ఖనిజాలపై 1989 నుంచి విధించిన రాయల్టీ సొమ్మును వాపసు ఇవ్వాలని సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం ప్రారంభించాయి. రాష్ట్రాల న్యాయబద్ధమైన డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఆగస్టు 14న జరిగిన విచారణలో వ్యతిరేకించింది. ఈ డిమాండ్‌ను అంగీకరిస్తే ఒక్క ప్రభుత్వరంగ కంపెనీలే 70 వేల కోట్లను తిరిగి చెల్లించాల్సి వస్తుందని, దానివల్ల వాటి ఖజానా ఖాళీ అయి పౌరుల నుంచి ఆ సొమ్మును అధికధరల రూపంలో వసూలు చేసుకోవాల్సి వస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వ వాదనలను సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తిరస్కరించి 2005 ఏప్రిల్ 1 నుంచి కేంద్రం, గనుల కంపెనీలు వసూలు చేసిన రాయల్టీని తిరిగి రాష్ట్రాలకు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆగస్టు 14న ఎవరు ఊహించని విలువైన తీర్పునిచ్చింది. రాయల్టీ బకాయిలు రెండు లక్షల కోట్ల రూపాయలకు మించి ఉండొచ్చని అంచనా. వచ్చే 12 ఏళ్లలో దశలవారీగా కేంద్రం, గనుల కంపెనీలు రాష్ట్రాలకు బకాయిలు చెల్లించవచ్చన్న వెసులుబాటును ధర్మాసనం కల్పించింది. అలానే బకాయిలు చెల్లింపుపై ఎటువంటి అపరాధ రుసుమును విధించరాదని రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ అసాధారణమైన తీర్పు అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాలకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగజేస్తుంది. కేంద్ర ప్రభుత్వం, గనుల కంపెనీలు సంవత్సరాల తరబడి వసూలు చేసిన పన్నుల బకాయిల చెల్లింపుల కోసం వివిధ రాష్ట్రాలు చేసిన న్యాయపోరాటం రాష్ట్రాల హక్కుల సాధనలో కలికితురాయిగా మిగిలిపోతుంది.

అయితే కోర్టు విచారణ అంశాలలో ఆయిల్ ఫీల్డ్స్, మినరల్ ఆయిల్ రిసోర్సెస్, సహజవాయువు, పెట్రోల్, పెట్రోలియం ప్రొడక్ట్స్ గురించి లేకపోవడం విచారకరం. 438 మంది పిటిషన్‌దారులు గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ పెట్రోలియం ప్రొడక్ట్స్ గురించి అడగనందువలన విచారణలో లేవని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. భూగర్భంలో లభించే ఇనుప ఖనిజం, బొగ్గు, మైకా, బాక్సైట్, గ్రానైట్ లాంటివే కాకుండా శిలాజ ఇంధనాలు అంటే చమురు, సహజవాయువులను అన్ని దేశాలలో ఖనిజ సంపదగా పరిగణిస్తారు. ఖనిజ సంపదను ఆర్గానిక్, ఇనార్గానిక్‌గా విభజించారు. ఆయిల్ ఫీల్డ్స్, మినరల్ ఆయిల్ రిసోర్సెస్, పెట్రోల్, గ్యాస్‌లను ఆర్గానిక్ సంపదగా పేర్కొన్నారు. ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు అపారంగా ఉన్న రష్యా, అమెరికా, ఇరాన్, సౌదీ దేశాలు సంపద్వంతంగా వున్నాయి. మనకు కేజీ గ్యాస్ బేసిన్‌లో గ్యాస్, ఆయిల్ దండిగా వున్నా మన రాష్ట్రం ప్రపంచ బ్యాంకు నుండి అప్పులు తెచ్చుకునే దుస్థితిలో ఉంది. భూగర్భంలో లభించే ఆయిలు, గ్యాస్‌లపై రాష్ట్రాల హక్కుల సాధన కోసం ఇప్పుడు సాధించిన హక్కుల పోరాట స్ఫూర్తితో న్యాయపోరాటం సాగించటానికి ఇతర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రం కూడా రాజీలేని పోరాటం సాగించాలి.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రాలలో లభించే సహజ వనరులపై హక్కు, వాటిపై పన్ను విధించే హక్కు, ఇంతవరకు భారీ మొత్తంలో వసూలు చేసిన పన్నులను తిరిగి రాబట్టుకునే హక్కు మన రాష్ట్ర ప్రజలకు లభించాయి. ఈ న్యాయమైన హక్కుల సాధనకై అన్ని వామపక్ష విప్లవపార్టీలు, వివిధ రంగాల ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు సమైక్యంగా ప్రజా ఉద్యమానికి పూనుకోవాలి.

• ముప్పాళ్ళ భార్గవ శ్రీ
సీపీఐ ఎంఎల్ నాయకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఉత్తర్వులు

తెలుగుదేశం ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ఉత్తర్వు (జీఓ)ల సమాచారాన్ని ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా గవర్నమెంట్ ఆర్డర్స్ ఇష్యూ రిజిస్టర్ (జీఓఐఆర్) వెబ్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఈ నిర్ణయంతో కీలకమైన ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కల్పించి జవాబుదారీ, పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది కూటమి ప్రభుత్వం. ఈ వెబ్ పోర్టల్ 2008లో మొట్టమొదట ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చింది. అంతకుముందు వరకు వివిధ అంశాలపై జీఓలను తెలుసుకోవడం ఒక పెద్ద ప్రహసనంగా ఉండేది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన నెలల తరువాత కూడా సామాన్యులకు అవి అందుబాటులోకి వచ్చేవి కావు. జీఓఐఆర్ వెబ్‌పోర్టల్ ఆవిష్కరణతో ఆ ఇబ్బందులు కొంత మేర తప్పాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాధినేతలు కూడా ఈ విధానం కొనసాగించారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. 2021 ఆగస్టు 15 నుండి జీఓఐఆర్ వెబ్ పోర్టల్‌ను నిలిపివేసి చీకటి పాలనకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రజలతో సంబంధం ఉన్న అనేక ప్రభుత్వ నిర్ణయాలు గుట్టుచప్పుడు కాకుండా అమలులోకి వచ్చాయి. దీనిపై ప్రజానీకంతో పాటు పలు తరగతుల ఉద్యోగుల్లో సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా జగన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరకు హైకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలిచ్చినా ఫలితం దాదాపు శూన్యమే. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జీఓఐఆర్ వెబ్‌పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించి పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేసింది. పారదర్శకత అనేది సుపరిపాలన ప్రధాన సూత్రం. పారదర్శకత ఉంటే కచ్చితమైన సమాచారాన్ని సకాలంలో, సంపూర్ణంగా ఆయా శాఖల ద్వారా ఆ సమాచారాన్ని పౌరసమాజం సమర్థంగా వినియోగించగలుగుతుంది. ఒక్క జీఓలకే కాదు. అన్ని రకాల ప్రభుత్వ నిర్ణయాలకు, కార్యక్రమాలకూ ఇది వర్తించనున్నది.

ప్రజల డబ్బుతో పాలన చేస్తున్నప్పుడు ప్రజలకు జవాబుదారీగా ఉండటం ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వ బండారం జీఓల ద్వారా బహిర్గతం అవుతుందని భావించి దాని నుంచి తప్పించుకొనేందుకు జీఓలను దాచిపెట్టింది జగన్ ప్రభుత్వం. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు తెలిస్తే నష్టం అని భావించి రహస్యంగా ఉంచారు. ఈ కాలంలో కూడా సమాచారాన్ని ప్రజలకు తెలియకుండా దాచిపెట్టడమా?! పరిపాలనలో పారదర్శకత వుండాలన్న ఆశయంతో ప్రభుత్వ ఉత్తర్వుల జారీలో రహస్యం వుండకూడదని తీసుకొన్న నిర్ణయాన్ని తరువాత వచ్చిన ప్రభుత్వాలు దానిని కొనసాగించడంతో పాటు, సాంకేతికంగా మరింత అభివృద్ధి చేశాయి. రాష్ట్ర విభజన తరువాత కూడా రెండు రాష్ట్రాల్లోనూ ఆ విధానం కొనసాగింది. సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు సులభంగా లభ్యమయ్యే విధంగా అందుబాటులో ఉంచి తీరాలి. సాధ్యమైనంత వరకు డాక్యుమెంట్లేనన్న ఎలక్ట్రానిక్ ఫార్మట్‌లో స్థానిక భాషల్లో సమాచారాన్ని ఉంచాలని చట్టం నిర్దేశించింది. జీవోలన్నీ పబ్లిక్ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సమాచార హక్కు చట్టం ఈ తరహా డాక్యుమెంట్లన్నింటిని పబ్లిక్ డొమైన్‌లో ఉంచి తీరాలని, ఎటువంటి పరిస్థితుల్లోనూ దాచిపెట్టరాదని స్పష్టంగా పేర్కొంది. జీవోలను ఆన్‌లైన్‌లో పెట్టకుండా జగన్‌రెడ్డి ప్రభుత్వం ఆ చట్టాన్ని బాహాటంగా వ్యతిరేకించింది. జీఓల ద్వారా ప్రజలకు సమాచారం తెలియచేయాల్సిన ప్రథమ బాధ్యత ప్రభుత్వాలదే. సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలనే ఆర్టీఐ చట్టం 2005 నిబంధనలను దృష్టిలో వుంచుకొని పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ మార్చి 2012లో నేషనల్ డేటా షేరింగ్ అండ్ యాక్సెసిబిలిటీ పాలసీ (NDSAP)ని భారత ప్రభుత్వం తీసుకొచ్చింది.

కోర్టులు కూడా తమ తీర్పులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ఉంచుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ గెజిట్‌లు, ఇతర నోటిఫికేషన్‌లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజల ముందుంచేందుకు జగన్ ప్రభుత్వం దాచిపెట్టి, రహస్య జీఓలతో చీకటిపాలన చేసింది. గవర్నమెంట్ ఆర్డర్స్ ఇష్యూ రిజిస్టర్ (జీఓఐఆర్) వెబ్ పోర్టల్‌ను పునరుద్ధరించడం ద్వారా జవాబుదారీ, పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది కూటమి ప్రభుత్వం.

– నీరుకొండ ప్రసాద్

'విజ్ఞాన శాస్త్రాలు' వద్దనుకుంటున్నారా?

భారతదేశంలో ఒకప్పుడు స్నాతకస్థాయి(డిగ్రీ) కళాశాలలో 'వృక్షశాస్త్రం' (బోటని) లేని కాలేజీ లేదంటే అతిశయోక్తి కాదు. నేడు డిగ్రీలో 'వృక్షశాస్త్రం' బోధనాంశంగా లేని కళాశాలలే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలోని 90శాతం కళాశాలల్లో ఈ వృక్షశాస్త్ర శాఖలు, దీని అనుబంధ విజ్ఞాన శాస్త్రాలైన జువాలజీ, కెమిస్ట్రీ, భౌతికశాస్త్రాలు మూతపడ్డాయి. బోధనా సిబ్బంది లేరు. ఉన్నా వాళ్ళు పార్ట్-టైం ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. ప్రతిభ ఉన్న కొద్దిమంది అధిక మొత్తం జీతాల కోసం ఎంసెట్, నీట్ కోచింగ్ సెంటర్లలో పనిచేస్తున్నారు. భావితరం విద్యార్థులను ఉన్నతస్థాయి పరిశోధనల వైపు మళ్లించే ఉపన్యాసకులు కాలేజీల నుంచి కనుమరుగయ్యారు. ఇతర రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉందా, లేదా అన్న దానిపై చర్చ కన్నా రాష్ట్రంలో ఇది కనిపించక పోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

మన రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయాధారితం, పర్యావరణపరంగా సున్నితమైనది. పైపెచ్చు ఉద్యానవనాలు, వాణిజ్య పంటలు, పూల తోటలు, పండ్ల తోటలు, సరస్సులు, నదులు, కొండలు, అపార ప్రకృతి సంపద, విస్తారమైన సముద్ర సంపద ఉన్న రాష్ట్రంలో 'వృక్షశాస్త్రం' ఒక బోధనాంశంగా లేకపోవటం రాష్ట్ర ప్రకృతి సౌభాగ్యానికే అవమానకరం. ఒక రకంగా రాష్ట్ర వ్యవసాయ సంపదకు, విద్యావిధాన శాస్త్రీయతకు చీడ పట్టినట్టే. నిజానికి నానాటికీ పెరిగిపోతున్న ప్రకృతి విధ్వంసానికి యువత, యూనివర్సిటీ, కాలేజీ, స్కూల్ విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున ఉద్యమించవలసి ఉంది. కానీ, అసలు వృక్షశాస్త్రం, దాని అనుబంధ విజ్ఞాన శాస్త్రాలే విద్యా వ్యవస్థ నుంచి మాయమైపోయినప్పుడు వృక్ష సంపద గొప్పతనం నేటి యువతకు, భావితరాలకు తెలియకుండా పోయే ప్రమాదం ఉందన్న సంగతి మనం గుర్తించాలి. కొండలు, నదులు, వర్షాలు, మేఘాలు, భూసారం, ఉష్ణోగ్రతలు మొదలైన వాటికీ వృక్షాలకు మధ్య పర్యావరణపరంగా ఉన్న సున్నితమైన సంబంధం (ఎకాలజి) ఎన్ని రకాలుగా ఉంటుందో వృక్షశాస్త్రం ద్వారానే తెలుస్తుంది. ఎన్విరాన్‌మెంటల్ బోటనీ, ఎకాలోజి, ఎకనామిక్ బోటనీ, ప్లాంట్ టాక్సానమీ, మార్ఫాలజి, ఫిజియాలజీ వంటి వృక్షశాస్త్ర ఉప విభాగాలు మనకు ఈ జ్ఞానాన్ని అందిస్తాయి.

ఉదాహరణకు కొన్ని రకాల ఆల్గే వాతావరణంలోని సునిశిత మార్పులను ఇట్టే బయటపెడుతోంది. అలాగే కొన్ని రకాల మొక్కలను వేరే పంటలతో కలిపి పెంచడం వల్ల భూసారం ఎప్పటికీ తరగదు. ఎరువుల వాడకం అవసరం ఉండదు. వృక్షశాస్త్ర అధ్యయనం వల్ల నీటి ఒత్తిడి, లవణాల ఒత్తిడి తట్టుకొనే మొక్కలను పెంచటం సాధ్యమవుతుంది. మొక్కల గురించి, వృక్షాల గురించి వృక్షశాస్త్ర అధ్యయనంలో తెలిసినట్టుగా అగ్రికల్చర్ బీఎస్సీలో తెలుసుకొనే వెసులుబాటు లేదు. మొక్కలపై పూర్తి అవగాహన, వాటి ఫిజియాలజీ, జన్యుశాస్త్ర లోతుల అధ్యయనం, పోషక లవణాల గ్రహణం వృక్ష శాస్త్రాధ్యయనంతోనే సాధ్యం. ప్రకృతి సేద్యం, సేంద్రియ సేద్యం, రసాయనరహిత సేద్యం వంటివి మొక్కకు–మొక్కకు మధ్య ఉన్న సంబంధం తెలుసుకోవటం ద్వారా, మొక్కలకు–భూమికి మధ్య ఉన్న రసాయన పోషణ మూలకాల సంబంధం తెలుసుకోవటం ద్వారా (సేంద్రియ వ్యవసాయం) జరిపించవచ్చనే పరిజ్ఞానం వృక్షశాస్త్రం నుంచే లభిస్తుంది. ఈ అధ్యయనం లోతుగా చేసేందుకు భౌతిక, రసాయన శాస్త్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ శాస్త్రాలు గత దశాబ్దన్నర కాలంగా విద్యారంగంలో అందుబాటులో లేకపోవటం వల్లనే ఆంధ్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలలో కోనోకార్పస్ వంటి మొక్కలు హరిత తోరణాలుగా వాడటం జరిగింది. తీరా అవి మహావృక్షాలు అయ్యాక ఇప్పుడు ఆ మొక్కల పెంపకం వల్ల వాతావరణానికి, మానవాళికి జరిగే హానిని గుర్తించి వాటిని నరికివేస్తున్నారు. ఈ నేపథ్యంలో వృక్షశాస్త్ర ప్రాధాన్యం, దానికి అనుబంధ శాస్త్రాలతో ఉన్న అనుబంధం ఇప్పటికీ తెలియకపోతే అసలు పర్యావరణ సమస్యలు, వాతావరణ మార్పులు, నదుల, కొండల పరిరక్షణ, నీటి భద్రత వంటివి ఎలా ప్రజలకు బోధిస్తారు? ఎవరు తెలియచెబుతారు? నిజానికి అగ్రికల్చర్ బీఎస్సీకి కూడా తల్లి వంటిది డిగ్రీలోని వృక్షశాస్త్రం.

> 21వ శతాబ్దం ప్రారంభంలో విద్యావిధానంలో వచ్చిన పెనుమార్పుల తుపానులో ఈ ప్రాథమిక విజ్ఞాన శాస్త్రాలు ఇంత ఘోరంగా నలిగిపోతాయని ఎవ్వరూ ఊహించలేదు. 'జ్ఞాన' ప్రధానమైన విద్యావిధానం నుంచి 'నిపుణత' ప్రాధాన్యం, 'ఉపాధి కల్పన' ప్రాధామ్యం ప్రధానంగా కలిగిన విద్యావిధానం వైపు వ్యవస్థ మారడంతో ప్రాథమిక విజ్ఞానశాస్త్రాల బోధనే అనవసరంగా ప్రభుత్వ కళాశాలలు, యాజమాన్యాలు భావించి వాటికి మంగళం పాడటం అనాలోచితం, ఎంతో శోచనీయం.



ఒకప్పుడు మన దేశంలో ఈ వృక్షశాస్త్రం, అనుబంధ శాస్త్రాలలో గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు ప్రపంచం మెచ్చిన ఆవిష్కరణలు చేసి దేశానికి ఘన కీర్తి తెచ్చారు. ఇటువంటి మహనీయులు ఇంక అవసరం లేదన్న విధాన నిర్ణయానికి వచ్చామా? లేక మన విద్యా విధాన నిర్ణయాలు చేసేవారు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీలలో ప్రాథమిక పరిశోధనకు స్నాతక, స్నాతకోత్తర స్థాయి బోధన, పరిశోధన ఇక అనవసరం అన్న భావనకు ప్రాచుర్యం కల్పించాలని నిశ్చయించారా? అలా అయితే మరి స్నాతకస్థాయిలో కనుమరుగైన బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధనాంశాలకు విశ్వవిద్యాలయాలలో ప్రత్యేక శాఖలు ఇంకా ఎందుకు ఉంచినట్టు? ఎక్కడో లోపం జరిగినట్టు స్పష్టంగా తెలియటం లేదా? క్రింది స్థాయిలో వృక్షశాస్త్రం నుంచి విద్యార్థులు గణనీయంగా తగ్గిపోగా, విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యార్థులు ఎక్కడి నుంచి వస్తారు? స్నాతకోత్తర స్థాయి గుర్తింపు పొందిన కళాశాలల్లో ఒకప్పుడు ఏర్పరచిన పైన పేర్కొన్న నాలుగు ప్రాథమిక విజ్ఞానశాస్త్రాల శాఖలు, వాటిలో బోధన కోసం కొన్న పరికర సామాగ్రి, ప్రయోగశాలలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం వరకూ ఎంతో ప్రభావంతో వెలిగిన ఈ వైజ్ఞానిక శాస్త్రాలు కళాశాల స్థాయిలో, స్నాతకోత్తర కళాశాల స్థాయిలో కళతప్పి వెలాతెలా పోతున్నాయి. విద్యావిధాన నిర్ణేతలు ఎందుకిలా నిశ్చయించారో బోధపడటం లేదు.

21వ శతాబ్దం ప్రారంభంలో విద్యావిధానంలో వచ్చిన పెనుమార్పుల తుపానులో ఈ ప్రాథమిక విజ్ఞాన శాస్త్రాలు ఇంత ఘోరంగా నలిగిపోతాయని ఎవ్వరూ ఊహించలేదు. 'జ్ఞాన' ప్రధానమైన విద్యావిధానం నుంచి 'నిపుణత' ప్రాదాన్యం, 'ఉపాధి కల్పన' ప్రాథామ్యం ప్రధానంగా కలిగిన విద్యా విద్యావిధానం వైపు వ్యవస్థ మారడంతో ప్రాథమిక విజ్ఞానశాస్త్రాల బోధనే అనవసరంగా ప్రభుత్వ కళాశాలలు, యాజమాన్యాలు భావించి వాటికి మంగళం పాడటం అనాలోచితం, ఎంతో శోచనీయం. కేవలం సంపాదన ప్రధాన లక్ష్యంగా వృత్తి కోర్సులైన ఎంబీబీఎస్, అగ్రికల్చర్ బీఎస్సీ అని వాటి కోచింగ్‌ను హైస్కూల్ స్థాయి నుంచి బోధిస్తున్నారు. దీనితో తల్లిదండ్రులలోనూ, విద్యార్థులలోనూ ప్రాథమిక విజ్ఞాన శాస్త్రాలైన వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, బయోఎనెర్జెటిక్స్, బయోఫిజిక్స్, బయోకెమిస్ట్రీ, శాస్త్రీయ పరిశోధన వంటి సబ్జెక్టుల పట్ల చులకన వైఖరి ఏర్పడింది.

ఆశ్చర్యమేమిటంటే అమెరికా, యూరప్ దేశాలలో టెక్నాలజీ, వృత్తినైపుణ్యానికి ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఇలా ఎంబీబీఎస్, అగ్రికల్చర్ కోర్సులకు హైస్కూలు నుంచి ప్రత్యేక శిక్షణ ఇవ్వటం, ప్రాథమిక విజ్ఞాన శాస్త్రాలను చిన్నచూపు చూడటం వంటివి జరగడం లేదు. ఆ దేశాలలో నేటికీ డిగ్రీ కళాశాలల్లో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సులున్నాయి. ఇంటర్ డిసిప్లినరీ శాస్త్రాలైన బయో కెమిస్ట్రీ, బయో ఫిజిక్స్ లైఫ్ సైన్సెస్ కూడా అందిస్తున్నారు. ఇవిగాక ఫిజియోలజీ, జెనెటిక్స్, హైడ్రోపోనిక్స్ వంటి కోర్సులను కూడా అందిస్తున్నాయి. ఇలా ఆ దేశాలలో విద్యావ్యవస్థ వక్రీకరణావస్థ పొందలేదు. కానీ మన దేశంలో, మన రాష్ట్రంలో ఈ పరిస్థితి, ఈ అసమతుల్యం విద్యావ్యవస్థలో ఎందుకు దాపురించింది?

ఇందుకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. ఒకటి– గతంలో మన భారతీయ శాస్త్రవేత్తలు, మన తెలుగు శాస్త్రవేత్తలు వృక్షశాస్త్రంలో ఎటువంటి అద్భుత పరిశోధనలు చేశారో మర్చిపోవటం. రెండవది– ఈ శాస్త్రాల బోధన, పరిశోధనావశ్యకత గురించి పునస్మరణ గత కొన్ని దశకాలుగా ఆగిపోవటం. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విధమైన విధాన లోపం సరిదిద్ది మూతపడిన వృక్షశాస్త్ర శాఖలను, అనుబంధ విజ్ఞానశాస్త్ర శాఖలను కళాశాలలో తెరిపించేందుకు తగిన ప్రోత్సాహకాలు ప్రకటించాలి. అంతేకాదు, ఈ కోర్స్ చదవటం వల్ల ఎన్ని విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో కూడా వివరించాలి. వృక్షాలను, వాతావరణ పవిత్రతను గౌరవించలేనివాడు సాటి మనుషుల్ని కూడా ప్రేమించలేడు. యంత్రమై మానవాళి హననానికి కారణమవుతాడు.

▪ డా. కొప్పరపు నారాయణమూర్తి





జోరువాన

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- నగరాన్ని వీడని ముసురు

భవానీపురం, ఆగస్టు 30 : అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. కొద్దిరోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడుతున్న నగరవాసులు గురువారం అర్ధరాత్రి నుంచి కురుస్తూనే ఉన్న వర్షాలకు ఉపశమనం పొందారు. నగరంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం ముసురుకుంది. జిల్లాలో మొత్తం 271.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటు 13.57 మిల్లీమీటర్లుగా ఉంది. తిరువూరులో 24.2, విజయవాడ నార్త్‌లో 22.2, విజయవాడ సెంట్రల్‌లో 21.8, విజయవాడ ఈస్ట్‌లో 21.6, విజయవాడ వెస్ట్‌లో 21.8, ఎ.కొండూరులో 20.0, విస్సన్నపేటలో 19.2, విజయవాడ రూరల్‌లో 17.8, గంపలగూడెంలో 15.2, ఇబ్రహీంపట్నంలో 15.0, రెడ్డిగూడెంలో 13.2, జి.కొండూరులో 10.6, కంచికచర్లలో 8.4, వీరులపాడులో 6.2, నందిగామలో 6.0, మైలవరంలో 8.4, పెనుగంచిప్రోలులో 6.2, వత్సవాయిలో 4.2, జగ్గయ్యపేటలో 3.8, చందర్లపాడులో 3.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సృజన తెలిపారు. వర్షాలకు సంబంధించి జిల్లాలో ఏ సమస్య ఉత్పన్నమైనా 0866-2575833 ఫోన్ నెంబరుకు తెలపాలని కోరారు.

హోరు వరద

విజయవాడ/జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 30 : ప్రకాశం బ్యారేజీ మళ్లీ కళకళలాడుతోంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో పులిచింతల గేట్లు పైకెత్తారు. ఎగువ నుంచి బ్యారేజీకి 2,36,169 క్యూసెక్కుల వరద వస్తుండటంతో బ్యారేజీ మూడు గేట్లను పూర్తిస్థాయిలో, మిగిలిన 67 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 3,22,606 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఇక ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ముక్త్యాల వద్ద కృష్ణమ్మ వరద ప్రవాహం పెరిగింది. నది ఒడ్డున ఉన్న ముక్తేశ్వర స్వామి ఆలయం నీట మునిగింది. దీంతో నదీపరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోని ప్రజలను అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టు 40.07 టీఎంసీల నీటితో కళకళలాడుతోంది.

కృష్ణానదికి మళ్లీ పెరిగిన వరద

- పులిచింతల నుంచి భారీగా ఇన్‌ఫ్లో
- బ్యారేజీ వద్ద అన్ని గేట్లు పైకెత్తిన అధికారులు
- 3 లక్షలకు పైగా క్యూసెక్కులు దిగువకు..


జగ్గయ్యపేటలో నీటమునిగిన భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం


ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉధృతి

ఇసుక దొంగలపై 'వేటు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన జిల్లా యంత్రాంగం

నందిగామ నియోజకవర్గంలోని స్టాక్ యార్డుల్లో రెండు లక్షల టన్నుల ఇసుక మాయంపై అధికార యంత్రాంగం స్పందించింది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో నందిగామకు విచారణ బృందాలను పంపింది. మొత్తం 21 వాహనాల్లో ఓవర్ లోడింగ్‌తో ఇసుక వెళ్తోందని గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేశారు. అంతేకాదు.. కీసర, మోగులూరు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జులను కలెక్టర్ సృజన సస్పెండ్ చేశారు. స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్ జేసీబీల కాంట్రాక్టును రద్దు చేయాల్సిందిగా ఆదేశించారు.

- నందిగామలోని స్టాక్‌యార్డులకు వెళ్లిన అధికారులు
- ఓవర్ లోడుతో వెళ్తున్న 21 లారీల సీజ్
- కీసర, మోగులూరు స్టాక్ ఇన్‌చార్జుల సస్పెన్షన్
- జేసీబీ కాంట్రాక్టు రద్దుకు ఆదేశాలు
- అంత స్టాక్ లేదని బుకాయిస్తున్న ఇన్‌చార్జులు




కీసర స్టాక్ యార్డులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జేసీ నిధి మీనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/నందిగామ) : నందిగామ నియోజకవర్గంలోని స్టాక్ యార్డుల్లో ఇసుక మాయంపై నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, నందిగామ, నందిగామ రూరల్ తహసీల్దార్లు, సీఐలు రంగంలోకి దిగి శుక్రవారం విచారణ జరిపారు. ప్రాథమిక విచారణలో కీసర, మోగులూరు స్టాక్ ఇన్‌చార్జులు బాల శంకరరావు, మీర్జావలిని బాధ్యులుగా గుర్తించి జిల్లా యంత్రాంగానికి రిపోర్టు చేశారు. వెంటనే ఈ ఇద్దరిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. అలాగే, జాయింట్ కలెక్టర్ నిధి మీనా కూడా శుక్రవారం కీసర స్టాక్‌యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక పంపిణీ విధానాన్ని, స్టాక్ పాయింట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కంచికచర్ల ఎండీవో కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బాలశంకరరావు కీసర స్టాక్‌యార్డులో లారీకి రూ.1,000 చొప్పున లంచం తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అలాగే, రోజుకు నాలుగైదు లారీల్లో ఇసుకను తరలించుకుపోతున్నాడని చెబుతున్నారు. ఇక పరిటాల గ్రామ పంచాయతీ కార్యదర్శి మీర్జావలి మోగులూరు స్టాక్ పాయింట్‌లో పనిచేస్తున్నారు. ఆయన ఇక్కడ ఏమీ మాట్లాడకుండా కూర్చున్నందుకు రోజుకు రూ.25 వేల వరకూ సిండికేట్ నుంచి తీసుకెళ్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఇసుక అంత లేదట!

జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఎంతమేర ఇసుక నిల్వలు ఉన్నాయో.. ఉచిత ఇసుక విధానం ప్రారంభం రోజునే కలెక్టర్ సృజన ప్రకటించారు. కానీ, సస్పెన్షన్‌కు గురైన స్టాక్ ఇన్‌చార్జులు మాత్రం బుకాయిస్తున్నారు. అంత ఇసుక లేదని చెబుతున్నారు. తమకు అప్పగించకముందే ఇసుక మాయమైందంటున్నారు. కీసర వద్ద 2,25,000 టన్నుల ఇసుక ఉండగా, గురువారం నాటికి 82,200 టన్నులు పంపిణీ చేశారు. ఇంకా 1,42,800 టన్నుల ఇసుక ఉండాలి. మైనింగ్ అధికారులు మాత్రం దీనికంటే ఎక్కువగా 1,60,000 టన్నులు ఉందని చూపించటం గమనార్హం. వాస్తవంగా 50 వేల టన్నులు కూడా లేదని తెలుస్తోంది. మోగులూరులో 1,39,895 టన్నుల ఇసుక ఉండగా, 69,360 టన్నులే పంపిణీ చేశారు. ఈ లెక్కన మరో 70 వేల టన్నులకు పైగా ఇసుక ఉండాలి. మైనింగ్ లెక్కల ప్రకారం ఇక్కడ 20 వేల టన్నులు మాత్రమే ఉందని తెలుస్తోంది. వాస్తవంగా దీనికంటే తక్కువగా ఉందని తెలుస్తోంది.

అవకతవకలకు పాల్పడితే చర్యలే : కలెక్టర్ సృజన హెచ్చరిక

ఇసుక స్టాక్ యార్డుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సృజన తెలిపారు. టోకెన్లు లేని వాహనాలను స్టాక్ యార్డులో గుర్తిస్తే, తక్షణమే స్వాధీనం చేసుకుని, స్టాక్ ఇన్‌చార్జులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, జిల్లాలో ఇసుక సరఫరాపై రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ సృజన పాల్గొన్నారు. అనంతరం సృజన జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక విధానంలో మరింత పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడంతో పాటు సరఫరాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. కీసర, మోగులూరు, చెవిటికల్లు, అనుమంచిపల్లి, పోలంపల్లి స్టాక్ యార్డుల నుంచి జరుపుతున్న ఇసుక సరఫరాపై రెవెన్యూ, పోలీసు, ఇంటెలిజెన్స్, మైనింగ్ అధికారులు పూర్తి పర్యవేక్షణ జరపాలన్నారు. యార్డుల్లో ఇసుక సరఫరాకు సంబంధించిన నిల్వలపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా పొందుపరచాలన్నారు. వెబ్‌సైట్‌లో రిజిస్టరైన వాహనాలకు మాత్రమే బుకింగ్ చేయాలని, ఇన్‌వాయిస్ లేని వాహనాలను స్టాక్ పాయింట్ల దగ్గరకు అనుమతించొద్దన్నారు. బుకింగ్ చేసుకున్న దానికంటే ఎక్కువగా లోడ్ చేసిన 21 వాహనాలపై కేసులు కూడా నమోదు చేశామన్నారు.

విచారణ ఏదీ?

బాధ్యులైన వారిపై సస్పెన్షన్ విధించినప్పటికీ స్టాక్ యార్డుల్లోని ఇసుక నిల్వల మాయంపై జిల్లా యంత్రాంగం కేసు పెట్టకపోవటం అనుమానాలకు తావిస్తోంది. కేసు పెడితే సిండికేట్ దందా వెలుగుచూస్తుంది. ఈ వ్యవహారంలో స్థానిక టీడీపీ నాయకుల భాగస్వామ్యం ఉంది. అయితే, అధికార పార్టీ కారణంగానే జిల్లా యంత్రాంగం కేసులు పెట్టలేదని తెలుస్తోంది. కేసులు పెడితే సమగ్ర విచారణ జరుగుతుంది. సీసీ ఫుటేజీ ద్వారా బాధ్యులైన వారిని గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని ఇలాగే వదిలేస్తే మరింత మంది ప్రైవేట్ వ్యక్తులు ఇందులో భాగస్వామ్యమయ్యే ప్రమాదం ఉంటుంది.



వన మహోత్సవం

నగరంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. లబ్బీపేటలోని బిషప్ అజరయ్య బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మొక్కలు నాటారు.

6లో

ఒకరోజు ముందే పెన్షన్లు ఇవ్వండి

- శనివారమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు

కృష్ణలంక, ఆగస్టు 30 : ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఒకరోజు ముందే.. అంటే.. ఈనెల 31వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభించి, పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబరు 1 ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందే పెన్షన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అధికారులు సమన్వయంతో వ్యవహరించి సజావుగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2,33,501 పెన్షన్లకు సంబంధించి రూ.98.58 కోట్ల మేర పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్లు ఇస్తారన్నారు. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు.

కెమెరాల వెనుక కథ ఏంటి?

గుడ్లవల్లేరు కాలేజీలోని బాలిక వసతి గృహాల్లో కెమెరాలు పెట్టిందెవరు?


గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు వెనుక అసలు ఉద్దేశమేంటి? ప్రేమికుల మధ్య ఉన్న అంతరంగిన వ్యవహారాలే దీనంతటికీ కారణమా? ఈ వ్యవహారాన్నే ఆధారంగా చేసుకుని ఒక గ్రూపునకు చెందిన విద్యార్థులు సదరు ప్రేమికులను బ్లాక్‌మెయిల్ చేశారా? లేక మరేమైనా ప్రేమకోణం దాగి ఉందా? ఇంతా జరుగుతున్నా కళాశాల యాజమాన్యం ఎందుకు విన్నకుండిపోయింది? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆ ప్రేమికులను ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేశారా?
- మరో ప్రేమ వ్యవహారం ఏమైనా నడిచిందా?
- యాజమాన్యం ఎందుకు మిన్నకుండిపోయింది?
- ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదెందుకు?
- విద్యార్థినుల ఆందోళనతో కాలేజీలో ఉద్రిక్తత
- ఆందోళన చేసిన వందలమంది విద్యార్థినులు
- మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ హామీతో విరమణ
- విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

గుడ్లవల్లేరు, ఆగస్టు 30 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాల ఏర్పాటు వివాదం వందలమంది విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేసింది. ఇంత జరుగుతున్నా కళాశాల యాజమాన్యం ఎందుకు విన్నకుండిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఒక విద్యార్థినికి ఉన్న రాజకీయ నేపథ్యం కారణంగానే యాజమాన్యానికి బెదిరింపులు ఎదురయ్యాయా అనే కోణం వెలుగుచూసింది. ఈ అంశంపై నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి విచారణకు ఆదేశించడంతో మరింత సంచలనంగా మారింది.

ప్రేమ వ్యవహారాలే కారణమా..?

కళాశాలలో కొందరు విద్యార్థుల మధ్య జరిగిన ప్రేమ వ్యవహారాలే ఈ హిడెన్ కెమెరాల ఏర్పాటుకు కారణమని తెలుస్తోంది. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రేమికులిద్దరూ ప్రకాశం జిల్లాకు చెందినవారు. వీరి మధ్య పరిచయం స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారింది. ఈ విషయం బయటకు రాకుండా కొందరు కావాలనే ఇలా చేయించారని చెబుతుండగా, తెరవెనుక మరో కథ కూడా నడిచిందని తెలుస్తోంది. సదరు ప్రేమికుడికి అదే కళాశాలకు చెందిన ఓ స్నేహితుడు ఉన్నాడు. ఇద్దరూ సరదాగా ఉండేవారు. ఒకరిళ్లకు ఒకరు

- మిగతా 6లో

హరితాంధ్ర వైపు అడుగులు

- వనమహోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పిలుపు

వన్‌టౌన్, ఆగస్టు 30 : రాష్ట్రాన్ని హరితాంధ్రగా చేయటం కోసం ప్రతిఒక్కరూ సమిష్టిగా అడుగులు వేయాలని, భవితకు పచ్చని బాట వేయాలని, ప్రతిఒక్కరూ ఒకమొక్క నాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని బిషప్ అజరయ్య బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ఈ ఏడాది వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి మొక్కలు నాటిన కలెక్టర్ అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యం లోపించటం కారణంగా పలు విపత్కర పరిస్థితులు సంభవిస్తున్నాయన్నారు. దీనికి పరిష్కారంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం మార్గమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయన్నారు. జిల్లాలో 30 వేలకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచనున్నట్టు తెలిపారు. తల్లిపై ఉన్న ప్రేమకు గుర్తుగా 'ఏక్ పెడ్ మాకే నామ్' నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. 2025 మార్చినాటికి దేశవ్యాప్తంగా 140 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్లాంట్ ఫర్ మదర్ (తల్లికోసం ఒక మొక్క) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, పచ్చని చెట్లు ప్రగతికి సోపానమని, వాతావరణ సమతుల్యానికి మొక్కలను విరివిగా పెంచాలని చెప్పారు. జిల్లా అటవీ శాఖ అధికారి కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సూచనల మేరకు కార్తీకమాసం వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 27,446 చదరపు కిలో మీటర్ల అటవీ విస్తీర్ణం ఉందని, ప్రస్తుతం 20 శాతం మాత్రమే ఉన్న పచ్చదనాన్ని 30 శాతానికి తీసుకువెళ్లేందుకు లక్ష్యంగా పెట్టుకుని మొక్కలు నాటిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, వీఎంసీ అదనపు కమిషనర్ ఎ.మహేష్, అటవీ శాఖ అధికారులు ఎం.సోమరాజు, ఎస్.భానుప్రకాష్, జి.దుర్గారావు, జి.సాయి శివకుమార్, ఎస్.నరసింహారావు, బిషప్ అజరయ్య కళాశాల కరస్పాండెంట్ టి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


బిషప్ అజరయ్య పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థినులు


అధికారులు, నేతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక హైనీ హైస్కూలు ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం అధికారులు, ప్రజలతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ప్రాణవాయువు అందించే మొక్కలను పెంచవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో 26 శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలన్నారు. కృష్ణాజిల్లాలో 9.8 శాతం అడవుల విస్తీర్ణం ఉందని, దీనిని మరింత విస్తరించాలన్నారు. సముద్ర తీరం వెంట ఉన్న మడ అడవులు పరిరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వాణి, నగరపాలక సంస్థ కమిషనరు బాపిరాజు, తహసీల్దార్ శ్రీనివాస్, జనసేన నేత బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణరావు, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్ ఎండీ ఇలియాజ్ బాషా, పిప్పళ్ల కాంతారావు హైనీ హైస్కూలు యాజమాన్య ప్రతినిధులు జాషువా ప్రసన్న కుమార్, లింగం మోజెస్, వైట్ గ్లోరీ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మొక్కలు నాటారు.


అలవెన్సులను పునరుద్ధరించాలని డిపోలలో గేట్ మీటింగ్

ఉద్యోగుల అలవెన్సులు పునరుద్ధరించాలి

బస్‌స్టేషన్, ఆగస్టు 30 : ప్రజా రవాణ సంస్థ ఉద్యోగులకు నిలిపివేసిన అన్ని రకాల అలవెన్సులను పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని డిపోలలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని డిపోల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా జీ.ఓ.నెం.114 మేరకు అలవెన్సులు అన్నీ జీతంతో కలిపి చెల్లించాలని కోరారు. ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. అన్ని డిపోల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. అలవెన్సుల అంశాలపై త్వరలోనే ప్రభుత్వ పెద్దలను, ఉన్నతాధికారులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందచేస్తామన్నారు. దీనిపై సెంట్రల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు.

కృష్ణా జలాలు ఇవ్వకపోతే చలో అమరావతి

- దోనేపూడి శంకర్

ధర్నాచౌక్, ఆగస్టు 30 : నెలరోజుల్లో కృష్ణాజలాలను సరఫరా చేయాలని, లేకుంటే బాధితులతో కలిసి చలో అమరావతి చేపడతామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కిడ్నీ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ, సీఎం చంద్రబాబును కలిసి వారి వ్యధలను తెలియజేస్తామన్నారు. స్థానిక దాసరిభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కిడ్నీ బాధితుల వ్యధలు పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. కూతవేటు దూరంలోనే కృష్ణాజలాలు ఉన్నా సరఫరా చేసే నాథుడే కరువయ్యారన్నారు. డయాలసిస్‌తో సంబంధం లేకుండా కిడ్నీ బాధితులకు నెలకు రూ. 10 వేల పింఛన్ ఇవ్వాలని, మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి బుడ్డి రమేష్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చుండూరు వెంకట సుబ్బారావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, డీహెచ్‌పీఎస్ నేత బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రాపురం సచివాలయంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఎ.కొండూరు : గ్రామాల్లో కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యులు, వి.స్వాతి, దివ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం శివారు కోమటికుంట్ల గ్రామంలో 32 మందికి కిడ్నీ వ్యాధి నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించినట్టు తెలిపారు. ఇప్పటికే గిరిజన తండాలో సర్వే జరిగిందని, మిగిలిన గ్రామాల్లో సెప్టెంబర్ 5 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాల మురళీకృష్ణ, ఆరోగ్య సిబ్బంది దీప, అరుణ, సువర్ణరాజు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కెమెరాల వెనుక కథ ఏంటి?

(5వ పేజీ తరువాయి)

వెళ్లేవారు. కొంతకాలానికి స్నేహితుడి చెల్లెలిని ప్రేమికుడు ప్రేమలోకి దించాడు. ఈ వ్యవహారం స్నేహితుడికి తెలిసి ఇద్దరి మధ్య మనస్పర్థలొచ్చాయి. మాటామాటా పెరిగి 'నీ ప్రియురాలికి నువ్వు చేసిన వీడియో కాల్స్ స్క్రీన్ షాట్స్ నా దగ్గర ఉన్నాయి. వాటిని బయటపెడతాను' అని స్నేహితుడు బెదిరించాడు. ఇందుకు నిందితుడు కూడా.. 'నీ చెల్లితో నేను చేసిన చాటింగ్ స్క్రీన్‌షాట్లు బయటపెడతాను.' అన్నాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరింది. కాగా, నిందితురాలిని మరో స్నేహితుడు వన్‌సైడ్ లవ్ చేస్తుండగా, అతని ద్వారా ఈ హిడెన్ కెమెరాల అంశాన్ని తెరపైకి తెచ్చారని తెలుస్తోంది. సదరు నిందితురాలు ఈ వీడియోలను బయటకు పంపుతోందనే ఆరోపణలతో విద్యార్థినులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి కళాశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏబీవీపీ, మహిళా మోర్చా నాయకులు కూడా కళాశాలకు చేరుకోవడంతో ఆందోళన మరింత ఉధృతమైంది.

సంఘటనాస్థలానికి కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు శుక్రవారం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లారు. వివరాలు సేకరించారు. కాగా, వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేశారనే విషయాన్ని వారం క్రితమే కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, విచారణ చేయాలంటే నెల సమయం పడుతుందన్నారని విద్యార్థినులు మండిపడ్డారు. పైగా ఫిర్యాదు చేసిన తమపైనే కేసు పెడతామని బెదిరించారని అధికారులు, మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఘటనపై విచారణ చేసి విద్యార్థినులకు న్యాయం చేస్తామని, వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాల ఆచూకీ కనుగొనేందుకు ఎస్ఎస్‌జేడీ పరికరంతో పరిశీలించడానికి ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. నిందితుడిని తమ ముందుకు తీసుకురావాలని విద్యార్థినులు డిమాండ్ చేయగా, అనుమానితులను ఇక్కడకు తీసుకొస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, పూర్తిస్థాయి విచారణచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎంతటి వారినైనా వదిలిపెట్టం : మంత్రి కొల్లు రవీంద్ర

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారని, ఈ సంఘటనకు పాల్పడినవారు ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని విద్యార్థినులకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ తన మేనకోడలు కూడా అక్కడే చదువుతోందని, తాను కూడా బాధిత కుటుంబానికి చెందినవాడినేనన్నారు. కాగా, ఆందోళన చేస్తున్న తమపై పరీక్షలు, మార్కుల పేరిట యాజమాన్యం వేధించే అవకాశం ఉందని విద్యార్థినులు ఆందోళన చెందగా, అలాంటిదేమీ ఉండదంటూ యాజమాన్యం ద్వారా అధికారులు లిఖితపూర్వకంగా హామీ ఇప్పించారు. ఘటనకు బాధ్యత వహిస్తూ వార్డెన్‌ను సస్పెండ్ చేస్తామని కళాశాల ప్రతినిధులు ప్రకటించారు.

ఆందోళన విరమణ

వీడియోలు బయటకు రానివ్వబోమని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. మంగళవారంలోగా విచారణను పూర్తిచేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. వసతి గృహంలో విద్యార్థినులకు రక్షణగా మహిళా పోలీసులతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆందోళన విరమించిన విద్యార్థినులు.. విచారణ పూర్తయ్యే వరకు తరగతులకు హాజరుకాబోమని చెప్పారు.

విచారణలో వాస్తవాలు తెలుస్తాయి : కళాశాల యాజమాన్యం

హాస్టల్‌లోని వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఉన్నాయని కళాశాల యాజమాన్యం నమ్మడం లేదు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెల్లడవుతాయి. తప్పుచేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుంది. విచారణ అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది నిర్ణయిస్తాం. వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఉన్నాయనే విషయం విద్యార్థినుల ఆందోళనతోనే మా దృష్టికి వచ్చింది.

- వల్లూరుపల్లి సత్యనారాయణరావు, కళాశాల సెక్రటరీ

రాత్రిపూట మళ్లీ కలకలం

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహం వద్ద శుక్రవారం రాత్రి మళ్లీ అలజడి నెలకొంది. హిడెన్ కెమెరాల ఏర్పాటుకు సహకరించి నట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిని బంధువులు శుక్రవారం రాత్రి వసతి గృహానికి వచ్చారు. ఆమెకు భోజనం పెట్టించేందుకు బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో మళ్లీ ఏదో జరగబోతోందని విద్యార్థినులంతా గుమిగూడారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు విద్యార్థినులకు సర్దిచెప్పారు. అరగంట తరువాత ఆ విద్యార్థినిని హాస్టల్‌కు తీసుకొచ్చారు.

కళాశాల వద్ద వైసీపీ నేతల హడావిడి

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలోకి వెళ్లేందుకు శుక్రవారం రాత్రి వైసీపీ నేతలు విఫలయత్నం చేశారు. విద్యార్థినులతో మాట్లాడాలని జెడ్పీటీసీ ఉప్పాల హారిక, పేర్నికిట్టు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణిలు కళాశాలకు వచ్చారు. అయితే విచారణ జరుగుతుందంటూ వారిని పోలీసులు లోనికి వెళ్లేందుకు నిరాకరించారు.

మాతా శిశు మరణాలు నివారించాలి

- సహేతుక కారణాలు లేని మరణాలకు వైద్యాధికారులదే బాధ్యత : కలెక్టర్ సృజన



కృష్ణలంక, ఆగస్టు 30 : సహేతుక కారణాలు లేని మాతా శిశు మరణాలకు వైద్యాధికారులే బాధ్యత వహించాల్సి వుంటుందని, మరణాలలో వైద్యుల లోపం గుర్తిస్తే చర్యలకు వెనుకాడబోమని, మాతా శిశు ఆరోగ్యం ప్రాణాపాయ పరిస్థితి వరకు తీసుకువచ్చి చివరి దశలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపడం సరికాదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ ఏడాది జూన్ నెలలో అనారోగ్య కారణాలతో సంభవించిన మాతా శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాతా శిశు మరణాలపై తూతూమంత్రంగా సమీక్షలు నిర్వహించడం నిష్ప్రయోజనమన్నారు. ప్రభుత్వపరంగా అన్నిచర్యలు తీసుకొంటున్నప్పటికీ మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. జూన్ మాసంలో ముగ్గురు తల్లులు, ఒక శిశువు మరణించడం జరిగిందన్నారు. వారిలో వాసంతికి సంబంధించి 4 నెలలు గడిచినప్పటికీ పోస్టుమార్టం నివేదిక ఇప్పటికీ ఇవ్వలేదని, ఈ కేసుపై సమీక్ష ఎలా నిర్వహించాలో చెప్పాలన్నారు. ఇక నుంచి ప్రతి కేసుపై పూర్తి సమాచారంతో సమీక్షకు హాజరుకావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో కలగరాదన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతో మరణాలు సంభవించినట్టు గుర్తిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొనేందుకు కూడా వెనుకాడేది లేదని కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జీజీహెచ్ వైద్యులు ఆర్.సౌజన్య, సబిత, మదీనా అహ్మద్, సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యురాలు ఎస్.సుమతి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ అమృతధ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.హిందుమతి, టీబీఎంవో పద్మావతి, ఫాగ్సి ప్రతినిధి ప్రభాదేవి, పీహెచ్‌సీ వైద్యులు అనిల్‌కుమార్, షేక్ ఖాజా ఇనయతుల్లా, పి.భార్గవి, ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి చేయూత

కృష్ణలంక : ఆరోగ్యకర జీవనానికి స్వచ్ఛమైన ఉత్పత్తులు అందించడంతో పాటు పర్యావరణానికి కొండంత మేలు చేసే ప్రకృతి సేద్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని కలెక్టర్ జి.సృజన అన్నారు. నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) దుకాణం ఏర్పాటు ద్వారా కషాయాలు, విత్తనాలు, లింగార్షక బుట్టలు వంటివాటిని ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందించేందుకు జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామానికి చెందిన కంభంపాటి రమాదేవికి డీఆర్‌డీఏ ఆర్థిక సహకారం అందించింది. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావుతో కలిసి అందజేశారు. ఇటీవల కలెక్టర్ సృజన జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామంలో పర్యటించి గ్రామపరిధిలోని రైతులు అనుసరిస్తున్న జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్ఎఫ్) విధానాలను పరిశీలించారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతానికి చెందిన రైతులు, కౌలు రైతులు ప్రకృతి సేద్యాన్ని ఆచరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా జీవామృతం, వివిధ కషాయాలను ఉపయోగించి చేసే సాగుతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. అయితే ఈ సేద్యానికి అవసరమయ్యే కషాయాలు వంటివి తయారుచేసుకోలేని వారికి వీలుగా డీఆర్‌డీఏ వంటి శాఖల ద్వారా ఔత్సాహిక రైతులతో దుకాణాల ద్వారా విక్రయానికి చొరవ చూపనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం స్వయం సహాయక సంఘ సభ్యురాలు కంభంపాటి రమాదేవికి సహాయం అందజేశారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- డీఆర్ఓ శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ శ్రీనివాసరావు

కృష్ణలంక, ఆగస్టు 30 : సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని డీఆర్వో వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెన్యూ సూపర్‌వైజర్లు, లైజన్ ఇన్స్పెక్టింగ్ అధికారులతో డీఆర్వో శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నేవల్ అకాడమీ (ఎన్ఏ), సీడీఎస్ (కంబైండ్ డిఫెన్స్ సర్వీస్) పరీక్షలను యూపీఎస్సీ నిర్వహించనుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1420 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకు 4 కేంద్రాలను సిద్ధం చేసినట్టు చెప్పారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నావెల్ అకాడమీ(ఎన్ఏ) పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వుంటుందన్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు రూటు అధికారులతో పాటు ఐదుగురు లైజన్ అధికారులను నియమించినట్టు చెప్పారు. ఇప్పటికే పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచడం జరిగిందని అన్నారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా రూటు అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీస్, తపాలా, వైద్యఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖలు వారికి అప్పగించిన విధులను తూచ తప్పకుండా పాటించాలని చెప్పారు. అభ్యర్థులకు అందుబాటులో తాగునీరు, విద్యుత్‌కు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్, లైజన్, పోలీస్, తపాలా, వైద్యఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'నీరు-చెట్టు' బకాయిలు చెల్లించండి

- మంత్రి పయ్యావులకు ఆళ్ల వినతి

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 30 : 'నీరు చెట్టు' పనుల కోర్టు కేసులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, చెన్నుపాటి శ్రీధర్, కవులూరు రాజా చంద్రమౌళి తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులు జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ 'నీరు-చెట్టు' పెండింగ్ బిల్లుల ఫిర్యాదుల విభాగం, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు తదితరులు పెండింగ్ బిల్లు చెల్లింపులకు సంబంధించి పూర్తి వివరాలతో మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలి : వెనిగండ్ల

గుడివాడ: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటన పట్ల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని, ఘటన వెనుక ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. విద్యార్థులు ఆందోళన చెందవద్దని, ఎమ్మెల్యే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయాలి : సీపీఎం

గుడ్లవల్లేరు కళాశాల ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువారం రాత్రి నుంచి విద్యార్థినులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని, వాస్తవాలను తల్లిదండ్రులకు చెప్పాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యంపై ఉందన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు

- కూపన్లు లేని, అధికలోడు వాహనాలను సీజ్ చేస్తాం
- కీసర, మోగులూరు ఇసుక డంపింగ్ యార్డుల్లో ఆర్డీవో తనిఖీలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


ఇసుక డంపింగ్ యార్డ్ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో రవీంద్ర

కంచికచర్ల రూరల్, ఆగస్టు 30 : స్టాక్ పాయింట్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక లోడింగ్ చేస్తే చర్యలు తప్పవని నందిగామ ఆర్డీవో రవీంద్ర అధికారులను హెచ్చరించారు. కంచికచర్ల మండలం మోగులూరు, కీసర ఇసుక స్టాక్ పాయింట్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై ఆర్డీవో అసహనం వ్యక్తం చేశారు. స్టాక్ పాయింట్ల వద్ద అందరూ సమన్వయంతో పనిచేసి నిబంధనల మేరకు ఇసుకను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కూపన్లు లేకుండా స్టాక్ పాయింట్లలోనికి వాహనాలు ప్రవేశిస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. వాహనాలను పోలీసులు, ఎస్ఈబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పరిమితి మించి లోడింగ్ చేసుకునే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. మోగులూరు పాయింట్ వద్ద 40-45 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ ఉందని అధికారులు చెబుతున్నారు. రెండు పాయింట్ల వద్ద సుమారు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక గల్లంతయి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం గోల్‌మాల్ ఎవరి కనుసన్నల్లో జరిగింది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. స్టాక్ పాయింట్‌ల వద్ద ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారుల పాత్ర ప్రశ్నార్థకంగా మారింది. తనిఖీల్లో తహసీల్దార్ జాహ్నవి, రూరల్ సవాన్, ఎస్ఈబీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

కృష్ణలంక : ఆర్‌బీఐ నిర్వహించే క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నిధి మీనా తదితరులతో కలిసి శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. క్విజ్ పోటీలకు ప్రతికళాశాల నుంచి ఎంతమందైనా టీంగా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ఒక బృందానికి కనీసం ఇద్దరుండాలి. సెప్టెంబరు 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఆర్‌బీఐ90క్విజ్.ఇన్/స్టూడెంట్స్/రిజిస్టర్) రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్, రాష్ట్రస్థాయి, జోనల్, తుదిరౌండ్‌లు ఉంటాయన్నారు. విజేతలకు వివిధ స్థాయిల్లో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు నగదు బహుమతులుంటాయని లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఎం.పురేంద్ర పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సైబర్ నేరాల పై అవగాహన



విద్యాధరపురం, ఆగస్టు 30: భవానీపురం పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులకు శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. వెస్ట్ డివిజన్ ఏసీపీ హరికృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ఉమామహేశ్వరరావు, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సీఐ గుణారాము సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా గుర్తించాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. గంజాయి అమ్మకాలు, అక్రమ రవాణా, దొంగతనాలు, తదితర అంశాలపై ప్రజలకు ఎలా తెలియజేయాలన్న విషయమై అవగాహన కల్పించారు.

కన్నబిడ్డల్లా మొక్కల్ని కాపాడుకోవాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, ఆగస్టు 30: కడుపున పుట్టిన బిడ్డల్ని ఎలా కాపాడుకుంటామో అలానే ప్రతి ఒక్కరూ వారు ఉండే ప్రాంతంలో మొక్కల్ని నాటి పెంచి పెద్ద చేసి వాటిని కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాల్గవ డివిజన్లోని ఫిల్మ్ కాలనీలో శుక్రవారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అశోకుడు మొక్కలు నాటించాడని చిన్న తనంలో ప్రతి ఒక్కరం పుస్తకాల్లో చదువుకునే వారమని, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి అదే తరహాలో మొక్కటు నాటే



ఫిల్మ్ కాలనీలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కార్యక్రమం చేపట్టడం గర్వించదగిన విషయం అన్నారు. మొక్కలు నాటడం వల్ల మనిషికి కావాల్సినంత ఆక్సిజన్ అందుతుందని, ఎండ తీవ్రత తగ్గి వాతావరణం చల్లగా ఉంటుందని తెలిపారు. వైసీపీ పాలనలో మొక్కలు నాటకపోగా జగన్మోహనరెడ్డి పర్యటనకు వెళ్లిన ప్రదేశంలో భద్రత పేరుతో చెట్లు నరికేశారని తెలిపారు. విషజ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. గత పాలకులు దోమల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యమని తద్వారా నేడు దోమల తీవ్రత ఎక్కువ యిందని చెప్పారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, సీఎంహెచ్‌వో పొన్నం రత్నావళి, టీడీపీ నాయకులు నందిపాటి దేవానంద్, ఫిల్మ్‌కాలనీ అధ్యక్షుడు ఎస్.వి.రెడ్డి, సత్యవతి, ఈమని సాయిరామ్, నర్రా శ్రీనివాస్, అక్కినేని రమేష్ పాల్గొన్నార

కృష్ణలంక: 20వ డివిజన్ నెహ్రూనగర్ డొంకరోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కనే వున్న సర్వీసు రోడ్డులో డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు



20వ డివిజన్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ అడపా శేషు

మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది, సురేష్ వర్మ పాల్గొన్నారు.

చిట్టినగర్: 49, 50 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, బోయి సత్యబాబులు విద్యార్థులు, ప్రజారోగ్య సిబ్బందితో కలసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలతోపాటు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాణిగారితోట: 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేములు దుర్గారావు తాటికొండ సుబ్బారావు పాఠశాలలో శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి, 84వ సచివాలయంలో టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు దుర్గా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● 17వ డివిజన్‌లో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవానీపురం : విద్యాధరపురం మువ్వల వారి వీధిలో వనం- మనం కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మేస్త్రీ ధన్‌రాజ్, టీడీపీ నాయకులు మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు. 41వ డివిజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటేశ్వరరావులు పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న కార్పొరేటర్ సత్యబాబు తదితరులు



తాడికొండ సుబ్బారావు స్కూల్‌లో మొక్క నాటుతున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు ప్రసాద్, పూజలో భక్తులు

చిట్టినగర్, ఆగస్టు 30: ప్రజలంతా సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా చిట్టినగర్‌లో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు అలయానికి తరలి వచ్చి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● కొత్తపేటలో ఉన్న గంగానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అలయ నిర్వాహకులు పర్యవేక్షించారు. ● పాల ఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ పక్కనే ఉన్న విజయదుర్గా రామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలోని విజయదుర్గా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నలందలో శ్రావణలక్ష్మీ పోటీలు

లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాలలో మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థినులకు శ్రావణలక్ష్మీ పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో పలు విభాగాల్లో ఉత్తమంగా ఎంపికైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వై.లక్ష్మీ పాల్గొన్నారు.



శ్రావణలక్ష్మీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

సుజనా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి



వైద్యశిబిరాన్ని సందర్శించిన పురంధేశ్వరి

వన్‌టౌన్, ఆగస్టు 30: పేద ప్రజల ఆరోగ్యం కోసం సుజనా ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి అన్నారు. శుక్రవారం భవానీపురం ఎన్డీఏ కార్యాలయం ఆవరణలో గత 15 రోజులుగా జరుగుతున్న మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. మహిళలకు జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సుజనా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్ మాట్లాడుతూ సెప్టెంబరు 15 వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్డూరి శ్రీరామ్, ప్రతిపాటి శ్రీధర్, బొమ్మకంటి వెంకట రమణ, చింతా బాబి, సృజన్, మంతెన తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

'దిశ'ను మహిళా పోలీస్ స్టేషన్లుగా మార్చటం అభినందనీయం

వన్‌టౌన్, ఆగస్టు 30: దిశ పోలీస్ స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మార్చటం అభినందనీయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు అన్నారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దిశ పోలీస్ స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మార్చినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో మహిళలు హత్యలకు, హత్యాచారాలకు గురయ్యారని, దిశ పోలీస్ స్టేషన్లు ఉండి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా కఠిన చర్యలు ఉంటాయని, మహిళలకు భద్రతా, భరోసా ఉంటుందని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



భవానీపురం, ఆగస్టు 30 : పవన్‌కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యాధరపురం ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని జనసేన సెంట్రల్ ఆంధ్రజోన్ కన్వీనర్ బాడిత శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వాసన్ ఐ కేర్ వైద్యులు ప్రసన్న, వినోద్‌లు పేదలను 78 మందిని పరీక్షించి 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. సితార సెంటర్‌లో క్లీన్ ఆంధ్రా-గ్రీన్ ఆంధ్రా కింద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బాడిత మాట్లాడుతూ పార్టీ శ్రేణులు అంతా కూటమికి అండగా ఉండాలన్నారు. జనసేన నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ పవన్ కల్యాణ్ నాయకత్వంలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మర్రి శివకృష్ణ, సిరిపురం జోషికిరణ్, మంగం రాంబాబు, పిడుగు రమణ, మంతా పురం రాజేష్, అనిల్‌కుమార్, పి జ.గదీష్, పి సతీష్, కోలాటం శ్రీనులు పాల్గొన్నారు.

పాలిమర్ అండ్ సైన్స్‌లో ఉపాధి మెండు

మొగల్రాజపురం, ఆగస్టు 30: పాలిమర్ అండ్ సైన్స్ రంగంలో కెమిస్ట్రీ విద్యార్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని సీఐపీటీ విజయవాడ టెక్నికల్ ఆఫీసర్, రిసోర్స్ పర్సన్ ఈఎన్ దుర్గాప్రసాద్ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం అధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం సీఐపీటీలో కెరీర్ గైడెన్స్ - ఉపాధి అవకాశాలపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా, పరిశోధనలో మంచి ఫ్యాకల్టీ ఉందని బోధన, పరిశోధనలో మార్గదర్శకత్వం లభిస్తుం దన్నారు. ప్లాస్టిక్ టెక్నాలజీ , మోల్డ్ టెక్నాలజీ ,ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్, టెస్టింగ్‌లో డిప్లొమో, పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమో కోర్సులతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్ర మాలు అందిస్తుందని దీని వల్ల సీఐపీటీలో ఉపాధి అవకాశాలకు సన్నద్ధం కావచ్చని చెప్పారు. పీహెచ్‌డీ, ఎంటెక్, డిగ్రీ ప్రోగ్రామ్‌లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ పీటీఎస్ఆర్‌కే ప్రసాదరావు, అధ్యాపకులు ఎం.డేవిడ్ రాజు, డాక్టర్ సత్యదేవ్, నాగార్జునబాబు, డాక్టర్ డి.శ్రీలక్ష్మి, డాక్టర్ ఏ. రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ ముందస్తు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బొర్రా గాంధీ,అనంతపురం జగన్

పటమట, ఆగస్టు 30: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీరంగ ప్రవేశం జరిగి దిగ్విజయంగా 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బాలకృష్ణ సన్నిహితులు బొర్రా గాంధీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సినీ స్వర్ణోత్సవ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడు అనంతపురం జగన్ హాజరై కేక్ కట్ చేశారు. బొర్రా గాంధీ మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్‌చేసి అభిమానులకు పంచినట్లు తెలిపారు. సెప్టెంబరు 1న హైదరబాద్‌లో కనివినీ ఎరుగని రీతిలో బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. త్వరలో విజయవాడలోనూ భారీ ఎత్తున బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. బొర్రా డిలీష్, యూత్ సభ్యులు తాతినేని సురేంద్ర, బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

● కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్

చిట్టినగర్, ఆగస్టు 30: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఫ్రైడే డ్రై డే పాటించాలని శుక్రవారం 49వ డివిజన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వారంలో ఒక రోజు ఫ్రై డే డ్రై డే పాటించి ఇంటి సరిపరాలతోపాటు ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● 50వ డివిజన్‌లో ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోయి సత్యబాబు, వీఎంసీ శానిటరీ, మలేరియా, ప్రజారోగ్యవిభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ పార్కుల ఎంట్రన్స్ ఫీజు రద్దు చేయాలి

● కార్పొరేటర్ బోయి సత్యబాబు

చిట్టినగర్, ఆగస్టు 30: వీఎంసీ పార్కులలో సందర్శకులకు ఎంట్రన్స్ ఫీజు రద్దు చేయాలని, ఇండోర్ స్టేడియంలలో క్రీడాకారులకు నెలవారీ సభ్యత్వ రుసుము రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం సీపీఎం లీడర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్కులు ప్రజలకు ఆహ్లాదం అందించే విధంగా ఉండాలన్నారు. దీనిపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

విష్ణు, లలితా సహస్రనామ పారాయణం



వేముల హజరత్తయ్యగుప్తాను సన్మానిస్తున్న ముత్యాలంపాడు ఆలయ కమిటీ సభ్యులు

సత్యనారాయణపురం, ఆగస్టు 30: ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరం ఆవరణలో జయహో విజయవాడ రెసిడెంట్స్ హెల్పింగ్ ఫౌండేషన్, బాబా మందిర కమిటీ, వేముల చారిటీస్, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం, పూర్ణానందపేట శ్రీదాసాంజనేయ కోదండ రామాలయ కమిటీ, నాయీ బ్రాహ్మణ వాద్యవృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విష్ణు, లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్యగుప్తా విష్ణు, లలిత సహస్రనామ ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం భక్తులు శ్రావ్యంగా విష్ణు, లలిత సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా గానం చేశారు. మారం రోజా, జె.వి.రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు. గౌతంరెడ్డి, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

భవానీపురం, ఆగస్టు 30 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన ఘటనలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాల వసతి గృహంలో రహస్యంగా హిడెన్ కెమెరాలతో అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన అత్యంత దుర్మార్గమని అన్నారు.

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nuz8UXzలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ



కోర్సులు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో
బీవీఎస్సీ & ఏహెచ్

ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి

మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురి కాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.



'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.

బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం



వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.



ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు

అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనీస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫియర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్ళీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా

తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క ఛాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.



- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిథి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ణి. ఆర్ట్ ఫిల్మ్స్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దిన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

డబుల్ ఫన్..థ్రిల్

విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.



ఇన్ ప్రోగ్రెస్

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు



పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయ రాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్‌రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'



ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.

శనివారం
31 ఆగస్టు 2024
ఆంధ్రజ్యోతి
నవ్య
9
కుటుంబ కదంబం



సగ్గుబియ్యం అంటే పాయసం గుర్తొస్తుంది. అయితే సగ్గుబియ్యంతో పరోటా, కిచిడీ, పునుకులు, హల్వానూ చేసుకోవచ్చు. వీకెండ్‌లో సులువుగా ఈ వంటలను చేసుకోండిలా...

సగ్గుబియ్యం రుచులు వారెవ్వా!

సగ్గుబియ్యం కిచిడి

కావాల్సిన పదార్థాలు:

సగ్గుబియ్యం- కప్పు, మీడియం సైజ్ బంగాళదుంప- 1, ఉల్లిపాయ-1 (మీడియం సైజ్), పల్లీలు- మూడు టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 3, జీలకర్ర- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- టేబుల్ స్పూన్, కరివేపాకు- పది ఆకులు, నూనె- టేబుల్ స్పూన్, నిమ్మరసం- అరటీస్పూన్

తయారీ విధానం:

ముందుగా బంగాళదుంప తొక్క తీసి ఉడకబెట్టాలి. చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. పల్లీలను వేయించి పక్కన ఉంచుకోవాలి. ఇక సగ్గుబియ్యాన్ని మంచి నీళ్లతో కడిగి ఆ తర్వాత సగ్గుబియ్యానికి సరిపడ నీళ్లు వేసి నాలుగు గంటల పాటు నానబెట్టుకోవాలి. నాలుగు గంటల తర్వాత ఒకవేళ సగ్గుబియ్యంలో నీళ్లుంటే తీసేయాలి.

చిన్న మిక్సీ జార్‌లో సగం పల్లీలను పలుకులుగా ఉండేట్లు మిక్సీ పట్టాలి. బౌల్‌లో సగ్గుబియ్యం తీసుకుని ఇందులో సగం పల్లీల మిశ్రమాన్ని వేసి మిక్స్ చేసి పక్కనబెట్టుకోవాలి. తర్వాత ప్యాన్‌లో నూనె వేసి.. ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర వేసి కలపాలి. ఉల్లిపాయలు వేగాక బంగాళదుంపల ముక్కలు, పచ్చిమిర్చి, కరివేపాకు, ఉప్పు వేసి కలపాలి. రెండు నిముషాల తర్వాత మిగిలిన పల్లీలు కలపాలి. చివరగా సగ్గుబియ్యం వేసి బాగా కలపాలి. లోఫ్లేమ్‌లో ఉంచి ప్యాన్‌పై మూత ఉంచి కుక్ చేయాలి. మూత తీసి గరిటెతో కలిపి నిముషం తర్వాత మరో రెండు నిముషాల పాటు మూత క్లోజ్ చేసి కుక్ చేయాలి. ఇందులో నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. నిముషం పాటు కలిపి దించేసుకోవాలి. సగ్గుబియ్యం కిచిడీ రెడీ.

సగ్గుబియ్యం పునుకులు



కావాల్సిన పదార్థాలు

లావు సగ్గుబియ్యం- కప్పు, పుల్లని పెరుగు- కప్పు, తరిగిన కొత్తిమీర- ఒకటిన్నర టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, పచ్చిమిర్చి- 2 (సన్నగా తరగాలి), జీలకర్ర- టీస్పూన్, మీడియం సైజ్ ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), బియ్యం పిండి- 2 టేబుల్ స్పూన్లు, అల్లం ముక్క- చిన్నది (సన్నగా తరగాలి), నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

ముందుగా సగ్గుబియ్యాన్ని శుభ్రం చేసుకోవాలి. బౌల్‌లో పెరుగు వేసి అందులో సగ్గుబియ్యంతో పాటు అరకప్పు నీళ్లు పోసి నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి.

సగ్గుబియ్యం నానిన తర్వాత ఈ మిశ్రమాన్ని పెద్ద బౌల్‌లోకి మార్చుకోవాలి. ఇందులో కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు, బియ్యం పిండి, తరిగిన అల్లం వేసి బాగా కలపాలి. అవసరం అనుకుంటే కొన్ని నీళ్లు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కలిపి పెట్టుకోవాలి. ఇక ప్యాన్‌లో నూనె వేయాలి. నూనె వేడయ్యాక కొంచెం కొంచెం మిశ్రమాన్ని ముద్దగా చేసి వేసుకోవాలి. మీడియం ఫ్లేమ్‌లో పునుకులను వేయించాలి. వేడి వేడి సగ్గుబియ్యం పునుకులను స్నాక్స్‌లా తినేయవచ్చు. అవసరం అనుకుంటే టమోటా కెచప్‌తో తినేయవచ్చు.

సగ్గుబియ్యం హల్వా



కావల్సిన పదార్థాలు: సగ్గుబియ్యం- కప్పు, బెల్లం- పావు కేజీ, యాలకుల పొడి- కొద్దిగా, బాదం-10, జీడిపప్పు- 10, పొద్దు తిరుగుడు విత్తనాలు- పావు టీస్పూన్, నెయ్యి- 2 టీస్పూన్లు

తయారీ విధానం: సగ్గుబియ్యాన్ని కడిగి ఆ తర్వాత కప్పు నీళ్లు పోసి నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి. ఆ తర్వాత సగ్గుబియ్యం తీసుకుని జార్‌లో వేసి మిక్సీ పట్టాలి. పావుకేజీ బెల్లాన్ని మెత్తగా పొడి చేసుకోవాలి. గుంత పాత్రలో బెల్లాన్ని వేసి.. ఇందులో చిన్న గ్లాసు నీళ్లు పోసి స్టవ్ మీద ఉంచి ఉడికించాలి. ఆ బెల్లం నీళ్లను ఫిల్టర్ చేసుకోవాలి. ఈ బెల్లం నీళ్లను ప్యాన్‌లో వేసి ఉడికించాలి. బెల్లం పొంగుతూ ఉడుకుతుంది. బెల్లం బాగా పాకం పట్టిన తర్వాత ముందుగా చేసుకున్న సగ్గుబియ్యం పిండిని కొంచెం కొంచెం పోసుకుంటూ కలపాలి. రెండు నిముషాలు బాగా కలిపాక.. ఆరెంజ్ ఫుడ్ కలర్ వేయాలి. ఆ తర్వాత గరిటెతో కదుపుతూ ఉండాలి. పొంగులా వస్తుంది. మూడు నిముషాల తర్వాత నెయ్యి పోసి కలపాలి. ఇందులో వేయించిన బాదం, జీడిపప్పు, పొద్దు తిరుగుడు విత్తనాలు వేసి కలపాలి. ఇలా కలుపుతూ ఉంటే గోళం నుంచి మిశ్రమం సపరేట్ అవుతున్నట్లు కనపడుతుంది. చతురస్రాకారం బాక్సులో అడుగుభాగంలో నూనె వేసి ఈ హల్వాను అందులో వేసి సమానంగా సర్దాలి. చల్లారిన తర్వాత ముక్కలుగా కట్ చేసుకుని తినాలి.

సగ్గుబియ్యం పరోటా

కావాల్సిన పదార్థాలు:

సగ్గుబియ్యం- 1 కప్పు, పల్లీలు- రెండు టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 4, వెల్లుల్లి రెబ్బలు- 3, బంగాళదుంపలు- 2 (మీడియం సైజ్), జీలకర్ర- అరటీస్పూన్, కొత్తిమీర- టేబుల్ స్పూన్, కారం- టీస్పూన్, ఉప్పు- రుచికి సరిపడ, నూనె- మూడు టేబుల్ స్పూన్లు

తయారీ విధానం:

కప్పులో సగ్గుబియ్యం వేసి నీళ్లు పోయాలి. చేత్తో శుభ్రంగా కడిగితే సగ్గుబియ్యం మీద ఉండే పిండి పోతుంది. శుభ్రంగా కడిగిన సగ్గుబియ్యాన్ని మరో బౌల్‌లో వేసి సరిగ్గా కప్పు నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే సగ్గుబియ్యాన్ని చేత్తో పట్టుకుని చూస్తే మెత్తగా అయి ఉంటాయి.

వెంటనే ప్యాన్ తీసుకుని అందులో పల్లీలు వేసి మీడియం ఫ్లేమ్‌లో వేయించాలి. మిక్సీ జార్‌లో పల్లీలతో పాటు పచ్చిమిర్చి, వెల్లుల్లి వేసి మరీ మెత్తగా కాకుండా మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని సగ్గుబియ్యం బౌల్‌లో వేయాలి. ఇందులోనే ఉడికించిన బంగాళదుంపలను మెత్తగా చూర్ణం చేసి వేయాలి. ఆ తర్వాత జీలకర్రతో పాటు తరిగిన కొత్తిమీర, కారం, ఉప్పు వేసి మెత్తగా కలపాలి.

చపాతీ పీట మీద పాలిథీన్ కవర్ వేసి కొద్దిగా నూనె వేసి.. దానిమీద సగ్గుబియ్యం మిశ్రమాన్ని తీసుకుని పరోటాలా ఒత్తుకోవాలి. స్టవ్ ఆన్ చేసి ప్యాన్‌లో నూనె కొద్దిగా వేసి మీడియం ఫ్లేమ్ మీద పరోటాలను రెండు వైపులా కాల్చుకోవాలి. ఈ సగ్గుబియ్యం పరోటాలు కాస్త పెరుగు చట్నీతో కలిపి తింటే రుచికరంగా ఉంటాయి.



ఆరోగ్యానికి అద్భుత సూపులు

తాం కండితాం దధివిమర్దిత ముద్గదాలిం
సంసాధితాం లవణగంధ సమాయుతాంచ
తే భుంజతే కుముదహాసకరార్ధమూర్ధా
యేషాం సదా హృదయచారుగృహం నిషణ్ణ

సూపు అనగానే అది ఇంగ్లీషు వారి విదేశీ వంటకం అనే భ్రమలో చాలా ఇష్టంగా ఆస్వాదిస్తూ ఉంటాం. కానీ 'సూపం' పేరుతో రకరకాల సూపుల్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో పేర్కొన్నాడు. క్షేమశర్మ కాలం నాటికి ఈ దేశానికి ఆంగ్లేయులు రాలేదు. సూపులు రెండు రకాలు. చిక్కగా ఉండేవి (థిక్ సూప్స్), పలుచగా ఉండేవి (క్లియర్ సూప్స్). నిజానికి మన పప్పుచారు, చారు ఇలాంటి సూపులే. వాటిని అన్నంలో కలుపుకునే విధంగా మనం చేసుకుంటున్నాం. పులుపు, కారాలు తగ్గిస్తే తాగేందుకు వీలుగా ఉంటాయి. కొన్నింటిని వేడివేడిగా తాగితేనే బావుంటాయి. కొన్ని ఫ్రిజ్జులో పెట్టుకుని చల్లగా తాగితే కమ్మగా ఉంటాయి.

'సూపం' పలుచగానే ఉంటుంది. అందులో చిక్కబరిచే ద్రవ్యాల్ని కలిపితే చిక్కగా అవుతుంది. సూపులో కలిపే ద్రవ్యాలపై ఇది ఆధారపడి ఉంటుంది. ఫ్రెంచివాళ్లు 'ప్యూరీస్' పేరుతో కూరగాయల సూపులు చేసుకుంటారు. ఏ కూరగాయనైనా మెత్తగా మిక్సీ పట్టి, ఆ రసంలో కావలసిన పరిమళ ద్రవ్యాల్ని కలిపి కాచినది 'ప్యూరీ సూపు'. మనం ములక్కాడ చారు, టమోటా చారు వగైరాల్ని ఇలా సూపులా తాగేందుకు అనుకూలంగా చేసుకుంటే ఎక్కువ ఆరోగ్యకరం. ఆరు అంగుళాల సొరకాయ ముక్కని మిక్సీ పట్టి, ఆ రసంతో సూపు కాచుకుంటే పెద్ద గ్లాసుడు సొరకాయ సూపు తయారవుతుంది. పోషకాలతో పాటు చాలినంత ఫైబరు, జీర్ణశక్తిని పెంచే మిరియాలపొడి, ధనియాలు జీలకర్ర, సోంపు ఇలాంటివి ఇందులో ఉంటాయి. ఒక గ్లాసు సూపు తాగితే అది సంపూర్ణ ఆహారమే. క్రీమ్ కలిపితే మరింత రుచిగా ఉంటుంది. చిక్కదనం కావాలంటే బార్లీ, సగ్గుబియ్యం, శనగ, మొక్కజొన్న, సోయాబీన్ లాంటి ద్రవ్యాల పిండిని కలుపుతారు. కీరా, క్యారెట్, గుమ్మడి... ఇలా ఏ రకమైన కూరగాయతోనైనా సూపు చేసుకోవచ్చు.

> **'సుఖేనపీయతె సూపః'... కమ్మగా తాగటానికి వీలైనది 'సూపం'. బ్రాత్, సూప్, సాస్... ఇవన్నీ 'సూపం' ప్రతిరూపాలే. సూపు అనేది ఫ్రెంచ్ 'సూపే' నుంచి వచ్చిందని భాషావేత్తలు చెబుతారు. కానీ ఋగ్వేద కాలం నుంచీ 'సూపం' మనకు తెలుసు. 'సూపమే' సూపుకి మూలం.**

పెసరపప్పు సూపు...

పెసరపప్పుతో సూపు లేదా సూపం తయారు చేసుకునే విధానాన్ని క్షేమశర్మ ఇలా వివరించాడు:

'కండితం' అంటే పొట్టు తీసిన పెసరపప్పుని పెరుగులోగానీ మజ్జిగలోగానీ నానబెట్టి, మెత్తగా రుబ్బి, కావలసినన్ని నీళ్లు, కలిపి అందులో మీకు ఇష్టమైన పరిమళ ద్రవ్యాలు, సైంధవ లవణం చేర్చి కాచినది 'ముద్గ సూపం'. మూంగ్‌దాల్ సూప్ అని ఇంగ్లీషులో అంటారు. 'ముద్గసూపో లఘు గ్రాహీ కఫపిత్తహరో హిమః'... పెసరపప్పుతో ఇలా సూపు కాచుకుని తాగితే విరేచనాల వ్యాధిలో నీటి శాతాన్ని తగ్గిస్తుంది. చలవ చేస్తుంది. ఒంట్లో వేడిని చల్లబరుస్తుంది. దానిమ్మ గింజలు, ఎండు ద్రాక్ష ఇతర డ్రైనట్స్ లాంటివి కలుపుకుని తాగితే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. కఫ పైత్యాల్ని తగ్గిస్తుంది. కంటికి మంచిది. పురుషులలో జీవకణాలను పెంచుతుంది.

పెసర, మినపప్పు సూపు...

ఇలాగే 'ముద్గ మాష కుల్మాష సూపం' అని మరొక సూపుని పేర్కొన్నాడు క్షేమశర్మ...

'అర్థ వికసితం స్విన్నాః కుల్మాషా వ ముద్గ వ మాషజా! సైంధవేన స బాహ్లీకాః స్వాన్నస్యా తు గుణావహాః'... ఈ సూపు తయారు చేసుకోవటానికి క్షేమశర్మ, 'అర్థవికసితం స్విన్నాః'... అంటే సగం ఉడికిన ధాన్యం ఉపయోగిస్తారన్నాడు. 'కుల్మాషా' అంటే బార్లీ, సగ్గుబియ్యం లేదా బియ్యాన్ని సగం ఉడికించినది అని. పొట్టు తీసిన పెసరపప్పు, మినపప్పు, బార్లీ లేదా సగ్గుబియ్యం... వీటిని సమానంగా తీసుకుని

> **క్షేమశర్మ ఇక్కడ చెప్పిన రెండు సూపులూ ఉదాహరణార్థం మాత్రమే. వాటిని మనకు అనుకూలంగా మార్చుకుని, కమ్మని సూపుల్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. పాలు పంచదార కలిపితే కీర్ అంటాం. ఉప్పు, కారం కలిపి వడగడితే సూపు అంటాం. పప్పు, కూరగాయలు లేదా ఆకుకూరలు అదనంగా కడుపులోకి చేరేందుకు ఇవి తోడ్పడతాయి.**



పైపైన ఉడికించండి. గంజి వార్చేసి మెత్తగా గుజ్జులా చేయండి. సూపు చిక్కగా లేదా పలుచగా ఉండేలా చాలినన్ని నీళ్లు కలిపి, పరిమళ ద్రవ్యాలు, ఉప్పు చేర్చి, చక్కగా ఉడికించి వడగట్టుకుంటే కమ్మని సూపు తయారవుతుంది. ఇంతకన్నా ప్రొటీన్ రిచ్ ఆహారం ఏముంటుంది! స్కూలు నుంచి రాగానే పిల్లలకు ఇస్తే తక్షణం శక్తి కలుగుతుంది. పుష్టిదాయకం. చిక్కిపోయేవాళ్లకి, ఆర్చుకుపోయేవాళ్లకి, తిన్నది వంటపట్టని వారికి ఇది మంచి ఆహారం.

కేవలం మినపప్పుతో కూడా ఇలానే సూపు కాచుకోవచ్చు. 'మాషసూపోతస్నిగ్ధోనిలాపః! ఉష్ణో సంతర్పణోబల్యః సుస్వాదూ రుచికారకః'... మినపప్పు సూపు శరీరానికి స్నిగ్ధత్వాన్నిస్తుంది. స్థూలత్వాన్ని కలిగిస్తుంది. పురుషత్వాన్ని పెంచుతుంది. వాత వ్యాధుల్లో చాలా మేలు చేస్తుంది. కీళ్లవాతం నడుము నొప్పి లాంటివి ఉన్నవారికి మినప సూపు మేలు చేస్తుంది. కొద్దిగా వేడినిస్తుంది. సమస్త పోషకాలూ ఇందులో ఉంటాయి. రుచికారకం. జీర్ణశక్తిని పెంచుతుంది.

• గంగరాజు అరుణాదేవి

సాహో రాధా...

కార్యదక్షత, సామాజిక బాధ్యత, నిరాడంబరత... రాధా వెంబు వీటన్నిటి కలయిక. "మన గురించి చెప్పాల్సింది మనం కాదు, మనం చేసే పని" అని గట్టిగా నమ్మే ఆమె ప్రచారానికి ఆమడదూరంలో ఉంటారు. 'స్వయంకృషితో ఎదిగిన అత్యంత సంపన్న భారతీయ మహిళ'గా మరోసారి 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్'లో చోటు దక్కించుకున్న రాధ వితరణ శీలిగానూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

సంపన్నులు, వ్యాపార సామ్రాజ్యాల అధిపతులు ఎంతో విలాసంగా ఉంటారనే ఊహలకు... రాధా వెంబు జీవనశైలి పూర్తి భిన్నంగా ఉంటుంది. సాధారణమైన చీర కట్టు, అక్కడక్కడ నెరిసిన జుట్టుతో సాధారణ గృహిణిగా కనిపించే యాభై రెండేళ్ల రాధ... ఒక పెద్ద టెక్ కంపెనీకి చోదకశక్తి. మధ్యతరగతి కుటుంబం నుంచి ప్రారంభమై, స్వయంకృషితో సంపన్నురాలైన భారతీయ మహిళగా నిలవడం వరకూ ఆమెది స్ఫూర్తిదాయకమైన ప్రయాణం.



అప్పుడు వాళ్ళే వెతుక్కుంటూ వస్తారు...

తమిళనాడులోని తంజావూరులో పుట్టిన రాధ చదువు చెన్నైలో సాగింది. ఆమె తండ్రి సాంబమూర్తి మద్రాసు హైకోర్టులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసేవారు. రాధ... మద్రాస్ ఐఐటిలో ఇండస్ట్రియల్ మేనేజిమెంట్ డిగ్రీ చేశారు. అప్పటికే ఆమె అన్న శ్రీధర్... 'అడ్వెనెట్' అనే టెక్ సంస్థను ఏర్పాటు చేశారు. తరువాత అదే 'జోహో కార్పొరేషన్'గా మారింది. జోహో... ఒక సాఫ్ట్ వేర్ అభివృద్ధి సంస్థ. ప్రస్తుతం ఇ-మెయిల్ సేవలు అందించే ప్రసిద్ధ సంస్థల్లో ఒకటి. దానికి రాధ సహ-వ్యవస్థాపకురాలు. కానీ మామూలు ఉద్యోగిగానే చేరారు. తరువాత ప్రాజెక్ట్ మేనేజర్ అయ్యారు. తన అన్న శ్రీధర్‌ను గురువుగా, మార్గదర్శిగా భావించే రాధ... ఆ సంస్థను ఉన్నత స్థానంలో నిలపడానికి అపారమైన కృషిచేశారు. తెన్‌కాశీలోని తమ గ్లోబల్ కార్యాలయంలో కంపెనీ వ్యవహారాలను శ్రీధర్ చూసుకుంటూ ఉంటే... చెన్నైతోపాటు దేశ విదేశాల్లోని తమ ఆఫీసుల నిర్వహణను రాధ చూసుకొనేవారు. క్రమంగా 'జోహో' విస్తరించింది. దానితోపాటే రాధ బాధ్యతలూ పెరిగాయి. ఉత్పత్తుల నిర్వహణ, ఉద్యోగ బృందాలతో సమన్వయం లాంటి పనులన్నీ ఆమె నిర్వహిస్తూ వచ్చారు. "మా అన్న, నేను ఎప్పుడూ టెక్ రంగం గురించే మాట్లాడుకొనేవాళ్ళం. నాణ్యతలో మన కంపెనీలు విదేశీ కంపెనీలతో పోటీ పడాలంటే ఏం చెయ్యాలని ఆలోచించేవాళ్ళం. ఒక కస్టమర్ మన దగ్గరకు వచ్చినప్పుడు... మనం అందించే ఉత్పత్తి అతనికి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాలి. అప్పుడే మనం విజయం సాధించగలం. దానికోసం కంపెనీలో సాంకేతికతలను ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ ఉండాలి. అప్పుడు కస్టమర్లే మనల్ని వెతుక్కుంటూ వస్తారు." అంటారు రాధ. చాలా టెక్ కంపెనీల ప్రధాన కార్యాలయాలు విదేశాల్లోని పెద్ద నగరాల్లో ఉంటే... 'జోహో' మాత్రం మన దేశంలోని చిన్న పట్టణాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

సంపదకోసం రాలేదు...

కొన్నేళ్ళుగా భారత దేశంలో సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్నుల జాబితాల్లో రాధ పేరు చోటు చేసుకుంటోంది. గత రెండేళ్ళుగా ఆ జాబితాలో ఆమె అగ్రస్థానంలో ఉన్నారు. ఆమె నికర విలువ రూ.47,500 కోట్లుగా 'హురున్' పేర్కొంది. కానీ ప్రచారానికి ఎప్పుడూ ఆమె దూరంగా ఉంటారు. కొత్త ఆవిష్కరణలను సాదరంగా ఆహ్వానిస్తారు. తన చర్యలు, విలువల ద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య ఆరోగ్యం తదితర కార్యక్రమాల కోసం నిధులు అందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ ఆమె ముందుంటారు. కిందటి ఏడాది 14 కోట్ల రూపాయలను సామాజిక సేవ కోసం ఆమె ఖర్చు చేశారు. 'జోహో కార్పొరేషన్'లో ప్రధాన బాధ్యతల నిర్వహణతో పాటు... జానకి హైటెక్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, హైలాండ్ వ్యాలీ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు ఆమె డైరెక్టర్. జోహోలో అత్యధిక వాటా ఆమెదే. రాధ భర్త రాజేంద్రన్ దండపాణి... అక్కడే డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా ఉన్నారు. ఆదిత్య రాజేంద్రన్ వారి ఏకైక సంతానం. తోటపనులంటే రాధకు ఎంతో ఆసక్తి. అలాగే సంప్రదాయాలకు ఎంతో విలువనిస్తారు. "సంపన్నురాలిని కావాలనే కోరికతో నేను ఈ రంగంలోకి రాలేదు. నేను కొన్ని నియమాలు, సూత్రాలు పెట్టుకున్నాను. వాటికి అనుగుణంగానే నా పనితీరు ఉంటుంది. పర్యావరణానికి ఎలాంటి హాని చెయ్యకూడదనేది వాటిలో ఒకటి. మా కార్యాలయాలన్నిటినీ పర్యావరణానుకూలంగా రూపుదిద్దాం" అని చెబుతారామె. "జోహో విజయాలన్నిటి వెనుకా ఆమె ఆలోచనలు, శ్రమ చాలా ఉన్నాయి. సాదాసీదాగా కనిపిస్తారు కానీ... పరిస్థితులకు అనుగుణంగా కచ్చితమైన నిర్ణయాలు తీసుకొనే సారథి. పక్షపాతాలకు అతీతంగా... అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తారు. ఇదే ఆమె విజయరహస్యం" అనేది జోహో ఉద్యోగులు, ఆమె సన్నిహితుల మాట.

'హిడెన్ కెమెరా'... షాపింగ్ మాల్స్, హోటల్ గదులు, లేడీస్ హాస్టళ్లు... నిత్యం ఎక్కడో అక్కడ మహిళలు వీటి బారిన పడుతూనే ఉన్నారు. తాజాగా గుడ్లవల్లేరు కాలేజీ హాస్టల్ బాత్‌రూమ్‌లో రహస్య కెమెరాలు బయటపడడంతో ఆందోళనలు వెల్లువెత్తాయి. ఇలాంటి దారుణాలను అరికట్టేదెలా? అందుకు కఠినమైన చట్టాల అమలు ఒక్కటే మార్గమంటున్నారు హైదరాబాద్‌కు చెందిన వరలక్ష్మి. ఆ దిశగా అలుపెరుగని కృషి చేస్తున్న ఆమె... తన 'హెవెన్ హోమ్స్ సొసైటీ' సంస్థ ద్వారా స్పై కెమెరాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఆ వివరాలను 'నవ్య'తో పంచుకున్నారు.



ఆ కెమెరా కళ్లను చట్టంతో పొడవాలి

"బలాత్కరించి, హత్య చేస్తే గగ్గోలు పెట్టేస్తాం. ఉద్యమాలు, నిరసన ప్రదర్శనలతో బాధితులకు న్యాయం జరిగే వరకూ నిరంతరంగా పోరాడతాం. నిజానికి స్పై కెమెరాలతో చిత్రించే రహస్య వీడియోలతో మహిళలకు జరిగే నష్టం ఇంతకంటే ఎక్కువ. స్పై కెమెరాలతో చిత్రించే వీడియోలు ప్రపంచమంతా ప్రయాణించి కోట్ల మంది చేతులు మారతాయి. దీన్నే వ్యాపారంగా మలుచుకుని, స్పై కెమెరాలతో చిత్రించే రహస్య వీడియోలను కుర్రకారుకు అమ్ముకునేవాళ్లున్నారు. ఇదొక భారీ మాఫియా. కానీ గుట్టుచప్పుడు కాకుండా, చాప కింద నీరులా విస్తరిస్తున్న ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేయడం కోసం నేను ఎంతోకాలంగా కృషి చేస్తున్నాను. 2016లో సెన్సార్ బోర్డు మెంబర్‌గా ఉన్నప్పుడే స్పై కెమెరా సమస్య నా ముందుకొచ్చింది. దాంతో ఈ సమస్య గురించి పరిశోధించి, నివేదికను రూపొందించి, హైకోర్టులో పిల్ వేశాను. అప్పటి నుంచి ఈ రోజు వరకూ స్పై కెమెరాలపై జాతీయ స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నాను. కాలేజీలు, పని ప్రదేశాలు, బడులు, హాస్టళ్లలో మహిళల భద్రత గురించి క్యాంపెయిన్లు నిర్వహించాను. స్పై కెమెరాలను ఎలా, ఎక్కడ ఏర్పాటు చేస్తారు? వాటినెలా గుర్తించాలి? గుర్తించిన తర్వాత ఏం చేయాలి? అనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నాను.



ఊహించని చోట, ఊహించని రూపాల్లో...

తెలియని కొత్త ప్రదేశాల్లో మనందరం స్పై కెమెరాల గురించి అప్రమత్తతతో వ్యవహరిస్తాం. కానీ వాటి పరిధి పెద్దది. మనం ఊహించని వస్తువుల్లో, ఊహించలేని ప్రదేశాల్లో, ఊహించని విధానంలో మన వీడియోలను సంవత్సరాల తరబడి రికార్డు చేయగలిగే సామర్థ్యం వాటికి ఉంటుంది. మనం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ నిర్మాణ సమయంలోనే ఈ ఏర్పాట్లన్నీ జరిగిపోతూ ఉండవచ్చు. సాన్నిహిత్యంగా గడిపిన దంపతుల వీడియోలు బజారు పాలవడానికి ఇలాంటి రహస్య కెమెరాలే కారణం. నిజానికి ఈ స్పై కెమెరాల పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ, భయంభయంగా బతకడం అందరికీ, అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. కుటుంబ పెద్దకు గుండెపోటు వస్తే సమర్థమైన చికిత్స మీదే దృష్టి పెడతాం తప్ప అదే ఆస్పత్రి బాత్‌రూమ్‌లో బిగించిన రహస్య కెమెరా మీదకు ఆలోచన వెళ్లదు కదా! ఒత్తిడితో, ఆందోళనతో కూడుకున్న జీవనశైలిలో అనుక్షణం ఏమరుపాటుగా వ్యవహరించడం ఎంతవరకూ సాధ్య పడుతుంది? కాబట్టే స్పై కెమెరాల అమ్మకాలను నియంత్రించడంతో పాటు, ఆ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు నిర్భయ చట్టం కింద బెయిలుకు వీలులేని శిక్షలు అమలు పరచవలసిందిగా నేను ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నాను. హైకోర్టులో పిల్ వేయడంతో ఆగిపోకుండా కేంద్ర ప్రభుత్వానికి కూడా నివేదిక సమర్పించాను. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో మహిళల ఫొటోలు తీసినా, షేర్ చేసినా కఠిన నేరంగా పరిగణించాలని హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నాను. స్పై కెమెరాలను ఎవరు, ఎందుకు కొంటున్నారు? కొన్నవాటిని ఏ అవసరాల కోసం ఎక్కడ ఉపయోగిస్తున్నారు? అనే ప్రామాణికాలను అనుసరించే చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

> **పసిగట్టలేకపోతున్నాయి...**
>
> **బల్బులు, లైట్లు, ఫ్యాన్లు, గిఫ్ట్ ఆర్టికల్స్, టెడ్డీ బేర్స్, బటన్స్, కీచైన్స్... దేన్లోనైనా అమర్చే వీలున్న స్పై కెమెరాలు ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. ఈ కెమెరాలను కనిపెట్టడం కష్టం. వీటిని ఎవరికివారు ఆన్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసుకుని వాడుకునే వీలుంది. ఈ కెమెరాలను కనిపెట్టే హిడెన్ కెమెరా యాప్స్, గ్యాడ్జెట్స్ కూడా అందుబాటులో ఉన్నప్పటికీ, అవి అనుకున్నంత సమర్థంగా పసిగట్టలేక పోతున్నాయి. రహస్య కెమెరాకు ఎంతో చేరువగా ఉంచినప్పుడు తప్ప ఆ యాప్స్, గ్యాడ్జెట్స్ వాటిని గుర్తించలేకపోతున్నాయి.**

ఇప్పుడు ప్రభుత్వం వంతు...

గత నెల జెఎన్‌టియులో జరిగిన ఓ అవగాహన కార్యక్రమంలో డ్రగ్స్, ట్రాఫిక్, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, స్పై కెమెరాలు... ఈ నాలుగు అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సమస్యలుగా గుర్తించింది. కానీ ఈ నాలుగు అంశాల్లో స్పై కెమెరాల అంశం ఒక్కటే గుర్తింపునకు నోచుకోకుండా ఉండిపోతోంది. రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. నా వంతుగా నేను 300 మంది షీటీమ్స్‌కు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాను. శిక్షణ తీసుకున్న ప్రతి ఇద్దరు పిల్లలు, వాళ్ల వాళ్ల కాలేజీల్లోని ఎన్‌ఎస్‌ఎస్ బృందాలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. షీటీమ్స్ కూడా వీళ్లకు సహకరించాలని కోరాం. కానీ ప్రభుత్వం మిగతా అంశాల పట్ల కనబరుస్తున్న శ్రద్ధను స్పై కెమెరాల విషయంలో కనబరచడంలేదు. నేను హైకోర్టులో వేసిన పిల్ ఇప్పుడు కౌంటర్‌కు వచ్చింది. అయినా ప్రభుత్వం ఇప్పటివరకూ అక్రమ స్పై కెమెరాల అడ్డుకట్టకు తీసుకున్న చర్యల గురించిన వివరాలను సమర్పించకపోవడం శోచనీయమే. కేవలం షాపింగ్ కాంప్లెక్స్‌లకు వెళ్లి అక్కడి దుకాణాలను వెతికి, అక్రమ స్పై కెమెరాలు లేవనే ఒక గుర్తింపు స్టిక్కర్‌ను అంటించడంతోనే సరిపెట్టుకుంటే, అది మొక్కుబాటు చర్య అవుతుంది.

పర్యవేక్షణ కీలకం...

గత మేలో నిజామాబాద్ స్కానింగ్ సెంటర్‌లో ఇలాంటి స్పై కెమెరా బయటపడినప్పుడు, జిల్లా కలెక్టర్ వేగంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ ఆ తర్వాత నిందితులను పట్టుకున్నదీ లేనిదీ ఎవరికీ తెలియదు. ఒకవేళ పట్టుకున్నా, మరుసటి రోజే బెయిల్ మీద బయటకు వచ్చేస్తున్న సందర్భాలున్నాయి. మహిళల మీద ఎన్నో రకాల అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఎంతోమంది మహిళలు కనిపించకుండా పోతున్నారు. ఈ నేరాలన్నిటిలో ఏదో ఒకచోట స్పై కెమెరాల ప్రమేయం ఉంటోంది. ప్రత్యేకించి మిస్సింగ్ కేసులకూ... స్పై కెమెరాలకు కచ్చితంగా సంబంధం ఉంటుంది. లీక్ అయిన అసభ్య వీడియోల గురించి ఎవరికీ చెప్పుకోలేక, ముఖం చూపించలేక, అవమానంతో, భయంతో ఆత్మహత్యలకు పాల్పడే అమ్మాయిలు కూడా ఉన్నారు. వేరొకరితో సన్నిహితంగా గడిపిన వీడియోలు లీక్ కావడంతో గొడవలు పడి విడిపోతున్న దంపతులూ ఉన్నారు. బ్లాక్‌మెయిల్‌ను తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఈ దారుణాలకు అడ్డుకట్ట పడాలంటే స్పై కెమెరాల విక్రయాల మీద పర్యవేక్షణ ఉండాలి. ఈ అక్రమ కెమెరాల కళ్లను చట్టంతో పొడవాలి."

- గోగుమళ్ల కవిత




అవనీ లేఖారా

అవని.. బంగారు గని


రెండో పారాలింపిక్ గోల్డ్‌తో చరిత్ర

షూటర్లు మనీశ్‌కు రజతం, మోనాకు కాంస్యం

100 మీటర్ల రేసులో ప్రీతి కంచు మోత

భారత్ ఖాతాలో ఒకేరోజు 4 పతకాలు

పారాలింపిక్స్‌లో భారత్ రెండో రోజు నుంచే పతకాల వేట ఆరంభించింది. టార్గెట్-25 మెడల్స్ ధ్యేయంతో బరిలోకి దిగిన మన అథ్లెట్లు అంచనాలకు మించి రాణిస్తూ ఒక్క రోజే నాలుగు పతకాలతో ఖుషీ చేశారు. మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో 'డబుల్' ఆనందాన్ని పంచారు. షూటర్ అవనీ లేఖారా వరుసగా రెండో పారాలింపిక్ గోల్డ్ మెడల్‌తో అద్భుత: అనిపించగా, మరో షూటర్ మోనా అగర్వాల్ కాంస్యం అందుకుంది. ఎయిర్ పిస్టల్‌లో మనీశ్ నర్వాల్ రజతంతో మురిపించగా, దేశ పారాగేమ్స్ చరిత్రలో తొలిసారిగా మహిళల 100 మీటర్ల రేసులో ప్రీతి పాల్ కాంస్యం సాధించడం మరో విశేషం.


మనీశ్ నర్వాల్

గురి తప్పని గన్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

స్టార్ షూటర్ అవనీ లేఖారా అంచనాలను అందుకుంది. టోక్యోలో సాధించిన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. 11 ఏళ్ల వయస్సులో కారు ప్రమాదానికిగురై..నడుము కింది భాగం వరకు చచ్చుపడిపోయిన స్థితి నుంచి వరుసగా రెండు పారా విశ్వక్రీడల్లో పసిడి పతకాలు కొల్లగొట్టే స్థాయికి చేరడం ఆమె అంతులేని ఆత్మవిశ్వాసానికి, ప్రతిభకు నిదర్శనం. లేఖారా అంతర్జాతీయ పారా షూటర్‌గా రూపుదిద్దుకోవడం వెనుక నవీ ముంబైలోని లక్ష్య షూటింగ్ క్లబ్ వ్యవస్థాపకురాలు సుమ షిరూర్ కృషి ఎంతో ఉంది. ఒలింపిక్స్ ఫైనలిస్ట్, వరల్డ్ రికార్డు హోల్డర్ సుమ వద్ద 2018 నుంచి లేఖారా శిక్షణ పొందుతోంది. సంవత్సరంలో నాలుగుసార్లు క్లబ్‌కు వచ్చి సుమ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తర్ఫీదు పొందుతోంది.. అలా టోక్యోలో మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం, 50 మీ. ఎయిర్ రైఫిల్ కాంస్య పతకాలను అవని దక్కించుకుంది. తద్వారా ఒకే పారాలింపిక్స్‌లో రెండు మెడల్స్ చేజిక్కించుకున్న భారత మహిళా పారా అథ్లెట్‌గా చరిత్ర పుటలకెక్కింది. టోక్యో క్రీడల తర్వాత పారా షూటింగ్ వరల్డ్ కప్‌లోనూ అవని పసిడి పతకం సొంతం చేసుకుంది. ఇక..జూనియర్, సీనియర్ స్థాయిల్లో ప్రపంచ రికార్డులు సృష్టించడం ద్వారా పారా షూటింగ్ భవిష్య అంతర్జాతీయ స్టార్‌గా మన్ననలు అందుకొంది. తన ప్రతిభకు వన్నెలద్దుతూ పద్మశ్రీ, ఖేల్‌రత్న, యంగ్ ఇండియన్ షూటర్, పారా అథ్లెట్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు లేఖారాను వరించాయి. అవని విజయాలను గుర్తించిన రాజస్థాన్ ప్రభుత్వం ఆమెను అటవీ శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా నియమించింది. అలాగే 'బేటీ బచావ్, బేటీ పడావో'కు లేఖారా బ్రాండ్ అంబాసిడర్ కావడం విశేషం.

> పారాలింపిక్స్‌లో స్వర్ణంతో మురిపించిన అవనీ లేఖారా, రజతం సాధించిన మనీశ్, కాంస్య పతకాలు నెగ్గిన మోనా అగర్వాల్, ప్రీతిల అంకితభావం, ప్రతిభను చూసి దేశం గర్వపడుతోంది. - ప్రధాని నరేంద్ర మోదీ

పారిస్: పారాలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ ఘనంగా జరిగింది. టోక్యో గేమ్స్‌లో 19 మెడల్స్‌తో మురిపించిన పారా అథ్లెట్లపై ఈసారి భారీ అంచనాలే నెలకొనగా.. దానికి తగ్గట్టుగానే అద్భుత ప్రదర్శన చూపుతున్నారు. గేమ్స్ ఆరంభమైన రెండో రోజు శుక్రవారం నాలుగు పతకాలతో మురిపించారు. దీంతో ప్రస్తుతం భారత్ ఖాతాలో ఓ స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలు చేరాయి.

డబుల్‌తో బోణీ: మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 ఫైనల్లో మొదట భారత్‌కు రెండు పతకాలు లభించాయి. ఇందులో 22 ఏళ్ల షూటర్ అవనీ లేఖారా 249.7 స్కోరుతో చాంపియన్‌గా నిలిచింది. ఆమెకిది రెండో పారాగేమ్స్ స్వర్ణం కావడం విశేషం. టోక్యో గేమ్స్‌లోనూ అవని విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో రెండు పారాలింపిక్స్ స్వర్ణాలు సాధించిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది. ఇక ఫైనల్ రౌండ్ ఉత్కంఠభరితంగానే సాగింది. తొలి రౌండ్ నుంచి కొరియా షూటర్ లీ యున్రీ ముందంజలో ఉండి గట్టి పోటీనిచ్చింది. అయితే అవని ఫైనల్ షాట్‌ను 10.5 పాయింట్లతో ముగించగా.. యున్రీ మాత్రం 6.8 పాయింట్లకే పరిమితమైంది. దీంతో 1.9 మార్జిన్‌తో అవని విజేతగా నిలువగా.. లీకి రజతం దక్కింది. ఈక్రమంలో .1 తేడాతో అవని తన బెస్ట్ పారాగేమ్స్ స్కోరును కూడా సాధించింది. ఇక ఇదే విభాగంలో మరో భారత షూటర్ మోనా అగర్వాల్ 228.7 స్కోరుతో కాంస్యం అందుకుంది. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో అవని రెండు, మోనా ఐదో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

అథ్లెటిక్స్‌లో 'ప్రీతి'కరం: తొలిసారిగా పారా అథ్లెటిక్స్‌లో భారత్ పతకం సాధించింది. మహిళల 100 మీ. పరుగు టీ35 ఫైనల్‌లో ప్రీతి పాల్ 14.21 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం సాధించింది. అలాగే ప్రీతికిది పర్సనల్ బెస్ట్ టైమ్. శుక్రవారం భారత్ సాధించిన మూడో పతకమిది. 23 ఏళ్ల ప్రీతి మేలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ కాంస్యంతో ఆకట్టుకుంది.

మనీశ్‌కు రజతం: షూటర్ మనీశ్ అగర్వాల్ రూపంలో భారత్‌కు నాలుగో పతకం అందింది. టోక్యో గేమ్స్‌లో మిక్స్‌డ్ టీమ్ 50మీ. పిస్టల్‌లో స్వర్ణం అందుకున్న తను పారిస్‌లోనూ సత్తా చాటాడు. ఈసారి మనీశ్ 10మీ. ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్ 1లో 234.9 పాయింట్లతో రజతం సాధించాడు. తొలుత స్వర్ణం ఖాయమనుకున్నా చివర్లో లయ తప్పాడు. ఆఖరిదైన 24వ షాట్‌లో మనీశ్ 8.9, 9.9 స్కోరు చేయగా, ప్రత్యర్థి జోంగ్డు (కొరియా) 10.8, 8.7తో గోల్డ్ మెడల్ అందుకున్నాడు. దీంతో మనీశ్ రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మరోవైపు మిక్స్‌డ్ 10మీ. ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్2లో శ్రీహర్ష 0.1 తేడాతో తొమ్మిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత కోల్పోయాడు.


మోనా అగర్వాల్

పోలియోను లెక్క చేయక..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పారా ఒలింపిక్స్‌లోనూ షూటర్లే భారత్‌కు పతక బోణీ చేశారు. మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ కేటగిరీలో అవనీ లేఖారా బంగారు పతకంతో మెరిస్తే ఇదే విభాగంలో 37 ఏళ్ల మోనా అగర్వాల్ కాంస్యంతో సత్తా చాటింది. అవని మాదిరే మోనా కూడా రాజస్థాన్ షూటరే. సికార్‌కు చెందిన మోనా తొమ్మిది నెలల వయస్సులో పోలియో బారిన పడింది. ఫలితంగా చక్రాల కుర్చీకే పరిమితమైన ఆమెను బాల్యంలో అంతా హేళన చేసేవారు. పైగా..తల్లిదండ్రులకు మోనా మూడో ఆడబిడ్డ. దాంతో బంధువులు, పెద్దల నుంచి అవహేళనలు మరింతగా ఉండేవి. కానీ మోనా అవేమీ పట్టించుకోలేదు. పైగా ఆమెలో పట్టుదల మెండు. అమ్మమ్మ గీతా దేవి..మోనాకు అండగా నిలిచింది. క్రీడల్లో రాణించాలని మోనా చిన్నతనం నుంచి కలలు కంటూ ఉండేది. సికార్‌లో హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తుండే తండ్రి..మోనాను క్రీడలవైపు ప్రోత్సహించాడు. పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో రాష్ట్రస్థాయి పోటీలలో ఆమె పాల్గొంది. 2017లో పారా బాస్కెట్‌బాల్ ఆటగాడు రవీంద్ర చౌదరితో మోనాకు వివాహమైంది. అనంతరం ఉదయ్‌పూర్‌కు మారిన అగర్వాల్ పారా వెయిట్‌లిఫ్టింగ్‌లో ప్రవేశించింది. 60 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి టైటిల్ కూడా దక్కించుకుంది. ఇక..ఇద్దరు పిల్లలకు తల్లయ్యాక 2021లో భర్త ప్రోత్సాహంతో మోనా పారా షూటింగ్‌లోకి అడుగుపెట్టింది. జైపూర్‌లోని ఏకలవ్య షూటింగ్ అకాడమీలో యోగేష్ షెకావత్ ఆధ్వర్యంలో శిక్షణ పొందింది. అదే ఏడాది జూలైలో క్రొయేషియాలో జరిగిన పారా వరల్డ్ కప్ షూటింగ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. గత ఏప్రిల్‌లో కొరియా ఆతిథ్యమిచ్చిన ప్రపంచ కప్‌లో మోనా స్వర్ణ పతకంతో భళా అనిపించింది. ఢిల్లీలో జరిగిన వరల్డ్ కప్‌లో పారిస్ క్రీడల బెర్త్ అందుకుంది.

టిల్లి.. ఐదో పసిడి



ట్యునీషియాకు చెందిన షాట్‌పుటర్ రవా టిల్లి అరుదైన రికార్డు సాధించింది. వరుసగా ఐదోసారి పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. 4 అడుగుల 4 అంగుళాలున్న 34 ఏళ్ల టిల్లి.. ఇనుపగుండును 10.40 మీటర్ల దూరం విసిరి ప్రథమస్థానంలో నిలిచింది. 2008, 2012 క్రీడల్లో షాట్‌పు ట్‌లో స్వర్ణాలు నెగ్గిన టిల్లి.. 2016, 2021 క్రీడల్లో డిస్కస్ త్రోలో పసిడి పతకాలు సాధించింది. ఇప్పుడు పారిస్‌లో షాట్‌పుట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచి, వరుసగా ఐదో క్రీడల్లో స్వర్ణం ఖాతాలో వేసుకుంది.


ప్రీతి పాల్

మనుగడే ప్రశ్నార్థకమై..!

పారా అథ్లెట్ ప్రీతీ పాల్ జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన ప్రీతి రైతు కుటుంబంలో పుట్టింది. మెదడు సమస్యతో చిన్నతనంలోనే పలు వ్యాధులు చుట్టుముట్టాయి. ఆమె మనుగడనే ప్రశ్నార్థకం చేశాయి. కాళ్లు బలహీనమయ్యాయి. అవి బలంగా మారేందుకు ఆమెకు ఎన్నో సంప్రదాయ చికిత్సలు చేయించారు. దివ్యాంగులు వాడే కాలిపర్స్‌ను ఐదేళ్లకే ధరించడం ప్రారంభించిన ఆమె ఎనిమిదేళ్ల వరకు వాటిని ఉపయోగించింది. 17 ఏళ్ల వయస్సులో సోషల్‌మీడియాలో పారాలింపిక్స్‌ను చూశాక జీవితం పట్ల ప్రీతి దృక్పథం మారిపోయింది. తానూ క్రీడాకారిణిగా మారాలని నిశ్చయించుకుంది. ఆ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పాల్ వెరవలేదు. ఇక..పారా అథ్లెట్ ఫాతిమా ఖాతూన్‌ను కలవడం ప్రీతి జీవితాన్ని మలుపు తిప్పింది. ఫాతిమా ప్రోత్సాహంతో 2018లో పారా అథ్లెటిక్స్‌లో కాలుమోపిన ప్రీతి..2022లో పారా ఆసియా క్రీడలకు క్వాలిఫై అయ్యింది. 100మీ., 200మీ., పరుగులో నాలుగో స్థానంలో నిలవడంతో ఆమెలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. తర్వాత ఢిల్లీ చేరి కోచ్ గజేందర్ సింగ్ శిక్షణలో రాటుదేలిన ప్రీతి 2024 వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో 100, 200మీ.లలో కాంస్య పతకాలు నెగ్గి అబ్బురపరిచింది. తద్వారా తొలిసారి పారాలింపిక్స్ బెర్త్‌ఖాయం చేసుకుంది.

ఆర్చరీ, రోయింగ్‌ల్లో..

పురుషుల ఆర్చరీ వ్యక్తిగత కాంపౌండ్ ఓపెన్‌లో రాకేశ్ కుమార్ ప్రీక్వార్టర్స్‌కు చేరాడు. ఎలిమినేషన్ రౌండ్‌లో తను సెనెగల్‌కు చెందిన అలియో డ్రేమ్‌ను 136-134 తేడాతో ఓడించాడు. మిక్స్‌డ్ పీఆర్3 డబుల్ స్కల్స్ హీట్1లో ఏపీకి చెందిన నారాయణ కొంగనపల్లె-అనిత జోడీ 8:06.84 టైమింగ్‌తో ఐదో స్థానంలో నిలిచారు. ఫైనల్లో చోటు కోసం నేడు రెపిచేజ్ 2లో తలపడనున్నారు.

వీరికి నిరాశే..


పురుషుల సైక్లింగ్ సీ2 3000 మీటర్ల వ్యక్తిగత విభాగంలో తెలుగు అథ్లెట్ షేక్ అర్షద్ అర్హత రౌండ్‌లోనే వెనుదిరిగాడు. 4 నిమిషాల 20.949 సెకన్ల టైమింగ్‌తో అర్షద్ ఆఖరైన తొమ్మిదో స్థానంలో నిలిచాడు. టాప్-4 మాత్రమే ఫైనల్‌కు వెళతారు. మహిళల డిస్కస్‌త్రో ఎఫ్55 ఫైనల్‌లో సాక్షి కసానా ఎనిమిది, కరమ్‌జ్యోతి తొమ్మిదో స్థానంలో నిలిచారు. అలాగే మహిళల టీటీ డబుల్స్ డబ్ల్యూడీ 10 క్వార్టర్స్‌లో సోనాల్‌బెన్-భవిన జోడీ కొరియా చేతిలో ఓడింది.

సెమీస్‌లో సుహాస్, నితేశ్

పారా బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 4లో సుహాస్, ఎస్ఎల్ 3లో నితేశ్ కుమార్ సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. సుహాస్ 26-24, 21-14 తేడాతో క్యుంగ్ వాన్ (కొరియా)పై, నితేశ్ 21-5, 21-11తేడాతో యాంగ్ (చైనా)పై గెలిచారు. అలాగే మహిళల సింగిల్స్ ఎస్‌యూ 5 గ్రూప్ ఎలో తులసీమతి 21-12, 21-8 తేడాతో మోంటీరో (పోర్చుగల్)పై గెలిచి సెమీస్ చేరింది. మరోవైపు సింగిల్స్ ఎస్ఎల్3లో మానసి జోషి వరుసగా రెండో ఓటమి పాలవగా..మనోజ్ సర్కార్ కూడా పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 3లో రెండో ఓటమితో నిష్క్రమించాడు.

అల్కారజ్‌కు షాక్

- ఒసాక ఇంటిబాట
- ప్రీక్వార్టర్స్‌కు గాఫ్
- యూఎస్ ఓపెన్



న్యూయార్క్: ప్రపంచ మాజీ నెంబర్‌వన్, టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కారజ్‌కు యూఎస్ ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలింది. ఈ స్పెయిన్ సంచలనానికి నెదర్లాండ్స్‌కు చెందిన 28 ఏళ్ల బొటిక్ వాన్ డి జాండ్‌షల్ప్ రెండోరౌండ్లో చెక్ పెట్టాడు. ప్రపంచ 74వ ర్యాంకరైన బొటిక్ 6-1, 7-5, 6-4తో వరుససెట్లలో మాజీ చాంపియన్ అల్కారజ్‌ను కంగుతినిపించి మూడోరౌండ్‌కు దూసుకెళ్లాడు. ఈ పరాజయంతో గ్రాండ్‌స్లామ్స్‌లో అల్కారజ్ వరుస 15 మ్యాచ్‌ల విజయానికి బ్రేక్ పడింది. అల్కారజ్ ఓటమితో డిఫెండింగ్ చాంప్ జొకోవిచ్ టైటిల్ నిలబెట్టుకునేందుకు మార్గం సుగమమైంది. ఐదోసీడ్ మెద్వెదేవ్ 6-3, 6-2, 7-6(7-5)తో ఫాబియానస్‌పై, పదోసీడ్ అలెక్స్ డి మినార్ 7-5, 6-1, 7-6(7-3)తో ఒట్టో విర్టానెన్‌పై, 25వ సీడ్ డ్రేపర్ 6-4, 6-2, 6-2తో డియాజ్‌పై గెలిచి మూడో రౌండ్ చేరారు.

గాఫ్ జోరు: చైనా మహిళల డిఫెండింగ్ చాంప్ కొకొ గాఫ్ తన జోరు కొనసాగిస్తూ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మూడో రౌండ్లో మూడోసీడ్ గాఫ్ 3-6, 6-3, 6-3తో స్విటోలినాను ఓడించింది. ఏడోసీడ్ క్విన్ జెంగ్ 6-2, 6-1తో సీమెర్‌ను చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. ఇక, మాజీ విజేత నవోమి ఒసాక రెండోరౌండ్లోనే వెనుదిరిగింది. చెక్ క్రీడాకారిణి కరోలినా ముచోవా 6-3, 7-6 (7-5)తో ఒసాకాకు ఝలకిచ్చింది. 4వ సీడ్ రిబకినా వాకోవర్ ఇవ్వడంతో ప్రత్యర్థి జెస్సికా మూడోరౌండ్‌లో అడుగుపెట్టింది. టాప్‌సీడ్ స్వియటెక్ 6-0, 6-1తో హిబహరపై, 6వ సీడ్ పెగులా 7-6 (7-4), 6-3తో కెనిన్‌పై, వోజ్నియాకి 6-3, 6-3తో రెనటాపై నెగ్గి మూడోరౌండ్లో ప్రవేశించారు.

ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఆర్తికి కాంస్యం

లిమా (పెరు): ప్రపంచ అథ్లెటిక్స్ అండర్-20 చాంపియన్‌షిప్‌లో భారత యువ రేసర్ ఆర్తి మహిళల 10,000 మీటర్ల రేస్ వాక్‌లో కాంస్య పతకం సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో 17 ఏళ్ల ఆర్తి 44 నిమిషాల 39.39 సెకన్లలో రేసును పూర్తిచేసి మూడోస్థానంలో నిలిచింది. హైజంప్‌లో పూజా సింగ్ ఫైనల్ చేరింది.

శ్రీలంక 196 ఆటౌట్

లార్డ్స్: శ్రీలంకతో రెండో టెస్ట్ రెండో రోజే ఇంగ్లండ్ పట్టుబిగించింది. పేసర్లు చెలరేగిన వేళ..పర్యాటక జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 196 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో ఆతిథ్య జట్టుకు 231 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అంతకుముందు ఓవర్‌నైట్ 358/7తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్..427 పరుగులకు ఆలౌటైంది. అట్కిన్సన్ శతకం (118) పూర్తి చేశాడు. భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకున్న ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆఖరికి 25/1 స్కోరు సాధించింది. ఓవరాల్‌గా 256 రన్స్ ఆధిక్యంలో కొనసాగుతోంది.

అఫ్రీది-మసూద్ బాహాబాహీ?

రావల్పిండి: పాకిస్థాన్ జట్టులో విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయని తెలుస్తోంది. తొలి టెస్టు ముగిశాక జరిగిన జట్టు సమావేశంలో పేసర్ షహీన్ అఫ్రీది భుజంపై కెప్టెన్ షాన్ మసూద్ చేయి వేసి మాట్లాడుతుండగా అతడు చేయిని వెనక్కి నెట్టేశాడు. అనంతరం డ్రెసింగ్ రూమ్‌కు చేరిన ఈ వివాదం అఫ్రీది, మసూద్ పరస్పరం భౌతికదాడి చేసుకునేంత వరకు వెళ్లిందని సమాచారం. వీరిద్దరు తీవ్రంగా కొట్టుకుంటుండగా, ఓపెనర్ రిజ్వాన్ మధ్యలో ఆపే ప్రయత్నం చేయగా, అతడిపై కూడా ఈ ఇరువురు దాడి చేసినట్టు తెలుస్తోంది.

శివాజీ మాకు దేవుడు!

ఆయన విగ్రహం కూలిపోవడంపై శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నా: ప్రధాని

మహారాష్ట్రలో వాధ్వాన్ పోర్టుకు శంకుస్థాపన


పాల్ఘర్‌లో ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో మోదీ

పాల్ఘర్, ఆగస్టు 30: మహారాష్ట్రలోని సింధ్‌దుర్గ్ జిల్లాలో శివాజీ విగ్రహం ఇటీవల కూలిపోవడంపై ప్రధాని మోదీ శుక్రవారం క్షమాపణ చెప్పారు. 'ఛత్రపతి శివాజీ మహారాజ్ అంటే ఒక పేరో.. ఒక రాజో కాదు. మాకు ఆయన దేవుడు. ఇవాళ ఆయన పాదాల ముందు నా శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నా' అని పేర్కొన్నారు. తొలిసారి తనను బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించినప్పుడు శివాజీ సామ్రాజ్య రాజధాని అయిన రాయగఢ్‌ను సందర్శించి.. ఆయన సమాధి వద్ద ధ్యానం చేశానని గుర్తు చేసుకున్నారు. శుక్రవారం మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వాధ్వాన్ పోర్టు ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని జువ్వలదిన్నె హార్బర్ సహా దేశవ్యాప్తంగా రూ.1,560 కోట్ల వ్యయంతో చేపట్టిన 218 ఫిషరీస్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సముద్ర రక్షణకు శివాజీ చేసిన కృషికి గుర్తింపుగా నిరుడు డిసెంబరులో నౌకాదళ వేడుకలను పురస్కరించుకుని సింధ్‌దుర్గ్ జిల్లా రాజ్‌కోట్ కోటలో ఆయన విగ్రహాన్ని మోదీ స్వయంగా ఆవిష్కరించారు. అయితే అది గత సోమవారం కూలిపోయింది. దీనిపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తుండడంతో ప్రధాని స్పందించారు. "కొందరు వ్యక్తులు వీరసావర్కర్‌ను దూషిస్తూ ఉంటారు. ఆయన్ను అవమానించినందుకు క్షమాపణ చెప్పరు. నేను ఇక్కడ దిగగానే.. శివాజీ మహరాజ్ విగ్రహం కూలిపోయినందుకు మొదట క్షమాపణ చెప్పాను. విగ్రహం కూలడంతో మనోభావాలు దెబ్బతిన్నవారికీ నా క్షమాపణలు" అని తెలిపారు. భారత్‌ను అభివృద్ధి పథంలో నడపాలన్న సంకల్పంలో మహారాష్ట్ర అభివృద్ధి కూడా భాగమని.. అందుకే గత పదేళ్లుగా రాష్ట్ర పురోభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. "వాధ్వాన్ పోర్టును రూ.76 వేల కోట్లతో నిర్మిస్తున్నాం. దేశంలోనే అతిపెద్ద కంటైనర్ పోర్టుగా ఇది రూపుదిద్దుకోనుంది" అని వెల్లడించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా చేపల ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెద్దఎత్తున పెంచుతున్నామన్నారు. 2014లో చేపల ఉత్పత్తి 80 లక్షల టన్నులు మాత్రమే ఉండేదని.. ఇప్పుడు 1.7 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. కాగా.. రూ.360 కోట్లతో ఏర్పాటుచేసిన 'నేషనల్ రోలవుట్ ఆఫ్ వెసెల్ కమ్యూనికేషన్ అండ్ సపోర్ట్ సిస్టమ్'ను కూడా ప్రధాని ప్రారంభించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులతో నేరుగా సంభాషించేందుకు, వారిని రక్షించేందుకు ఇది ఉపకరిస్తుంది.

బీజేపీలో చేరిన చంపయి సోరెన్

రాంచీ, ఆగస్టు 30: ఝార్ఖండ్ మాజీ సీఎం చంపయి సోరెన్ శుక్రవారం బీజేపీలో చేరారు. జేఎంఎం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అలాగే అక్కడ తనకు అవమానం జరిగిందని ఆ పార్టీకి రాజీనామా చేసిన రెండు రోజులకే ఆయన పార్టీ మారారు. రాంచీలో కేంద్రమంత్రి శివ్‌రాజ్ చౌహాన్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమక్షంలో భారీ సంఖ్యలో వచ్చిన మద్దతుదారులతో చంపయి బీజేపీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ.. జార్ఖండ్ ప్రభుత్వం ఢిల్లీ, కోల్‌కతాల్లో తనపై నిఘా పెట్టిన తర్వాత బీజేపీలో చేరాలన్న తన నిర్ణయం బలపడిందన్నారు. తాను చెమటోడ్చి, రక్తం చిందించి జేఎంఎం పార్టీని పెద్ద చేస్తే చిన్నచూపు, అవమానం మిగిలాయన్నారు.

శివసైనికులం..ఎన్సీపీ వ్యతిరేకులం

ముంబై, ఆగస్టు 30: మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మహారాష్ట్రలో రాజకీయం వేడెక్కుతోంది. బీజేపీ-శివసేన (శిందే)-ఎన్సీపీ(అజిత్ పవార్)ల మహాయుతి కూటమిలో విభేదాలు బయటపడుతున్నాయి. తాజాగా అజిత్ ఎన్సీపీని ఉద్దేశించి శిందే సేనకు చెందిన ఆరోగ్య మంత్రి తానాజీ సావంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము కరడుగట్టిన శివ సైనికులమని.. ఎన్సీపీ, కాంగ్రెస్‌తో తమకు పొసగదని అన్నారు. క్యాబినెట్ సమావేశాల సందర్భంగా ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చుంటే వాంతి వచ్చినట్లే ఉంటుందన్నారు. కాకపోతే ప్రభుత్వంలో ఉన్నందున తప్పడం లేదని వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్సీపీ కూడా గట్టిగానే స్పందించింది. ఇలాంటి ప్రకటనలను వినేకంటే ప్రభుత్వం నుంచి వెళ్లిపోవడమే ఉత్తమమని పేర్కొంది. లేదా తానాజీపై వేటు వేయాలంది.

గూండాల్లా బ్యాంకు రికవరీ ఏజెంట్లు

ఓ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 30: బ్యాంకు లోన్ల రికవరీ ఏజెంట్ సంస్థ గూండాల ముఠా మాదిరిగా వ్యవహరిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏక కాల పరిష్కారం(వన్ టైమ్ సెటిల్‌మెంట్) కింద రుణ గ్రహీత చెల్లింపులను పూర్తి చేసినా రికవరీ ఏజెంట్లు మాత్రం ఆయన దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న బస్సును తిరిగి అప్పగించకపోవడాన్ని తప్పుపట్టింది. ఆ రికవరీ సంస్థపై కేసు నమోదు చేసి రెండు నెలల్లో అభియోగ పత్రం దాఖలు చేయాలని పశ్చిమ బెంగాల్ పోలీసులను ఆదేశించింది. బాధితునికి పరిహారం చెల్లించాలని, ఆ మొత్తాన్ని రికవరీ సంస్థ నుంచి వసూలు చేయాలని రుణం మంజూరు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సూచించింది. ఈ మేరకు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. కోల్‌కతాలో నడిపేందుకోసం బస్సు కొనడానికి దేబాశీశ్‌రాయ్ అనే వ్యక్తి బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.15.15 లక్షల రుణం తీసుకున్నాడు. నెలకు రూ.26,502 వంతున 84 ఈఎంఐల్లో చెల్లించడానికి అంగీకారం కుదిరింది. 2014 డిసెంబరు నుంచి ఈఎంఐలు మొదలయ్యాయి. 2018 జనవరి నుంచి ఈఎంఐలు చెల్లించలేదు. దాంతో ఆ రుణాన్ని నిరర్థక ఆస్తిగా ప్రకటిస్తూ బ్యాంకు 2018 మే 31న ఆదేశాలు ఇచ్చింది. ఆ సమయానికి రాయ్‌చౌధరి ఇంకా రూ.10.23 లక్షలు చెల్లించాల్సి ఉంది. రుణం వసూలు చేసే బాధ్యతను నగరంలోని మెస్సర్స్ సిటీ ఇన్‌వెస్టిగేషన్ అండ్ డిటెక్టివ్ సంస్థకు బ్యాంకు అప్పగించింది. రికవరీ ఏజెంట్లు వచ్చి ప్రభుత్వ అధికారుల సాయంతో ఆ బస్సును స్వాధీనం చేసుకున్నారు. 2021 మార్చిలో రాయ్ చౌదరి బ్యాంకును సంప్రదించి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.1.8 లక్షలు చెల్లిస్తానని, మొత్తం చెల్లించినట్టుగా పరిగణించి రుణ ఖాతాను మూసివేయాలని కోరారు. ఇందుకు బ్యాంకు అంగీకరించింది. అయితే, సెటిల్‌మెంట్ జరిగినా స్వాధీనం చేసుకున్న బస్సును తిరిగి ఇవ్వకపోవడంతో ఆయన కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. తరువాత రికవరీ ఏజెంట్లు బస్సును వాపసు చేసినా అందులో కొన్ని పార్టులు కూడా కనిపించలేదు. దీంతో కేసు సుప్రీంకోర్టుకు వచ్చింది.

పెండింగ్ కేసులు 82,831

న్యూఢిల్లీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 82,831. ఇందులో ఈ ఏడాది కొత్తగా నమోదైనవే 38,996 కేసులు. సుప్రీంకోర్టు గడిచిన ఏడాది కాలంలో 37,158 కేసులను పరిష్కరించింది. మరోవైపు, 2023 నాటికి దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 61 లక్షలకు పెరిగింది. ట్రయల్ కోర్టుల్లో 4.5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

జస్టిస్ హిమా కోహ్లీ పదవీ విరమణ

మహిళల హక్కుల పరిరక్షకురాలు జస్టిస్ హిమా కోహ్లీ అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రశంసించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆమె శుక్రవారం పదవీ విరమణ చేశారు. చివరి రోజున ఆమె గౌరవ సూచికంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనంపై ఆశీనులయ్యారు. ఆమె మూడేళ్ల పాటు సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేశారు. అంతకుముందు 2021 జనవరి నుంచి ఆగస్టు 31 వరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు.


ముంబై నటి కేసులో ఎవరున్నా వదలొద్దు

కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయండి.. పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, ఐపీఎస్‌లు ఎవరు తప్పు చేసినా చట్టం ముందు నిలబెట్టండి.. గుడ్లవల్లేరు ఘటనపై పూర్తి విచారణ జరపాలి

'బేవరేజెస్' అవినీతిపై కఠినంగా వ్యవహరించండి.. పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

మదనపల్లె ఫైల్స్ దహనంపై సీఐడీ ఏడీజీతో ఆరా

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కేసును పూర్తి పారదర్శంగా దర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. ఒక రాష్ట్ర ప్రభుత్వమే మాఫియాగా మారి ఒక మహిళను, ఆమె కుటుంబాన్ని దారుణంగా వేధించిన ఈ కేసులో ఎంత పెద్దవారున్నా వదిలిపెట్టొద్దన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు, శాంతిభద్రతలపై సచివాలయంలో శుక్రవారం సీఎం సమీక్షించారు. ముంబై నటిని వేధించిన వైపీఎస్ మాఫియా, గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్‌లో సీక్రెట్ కెమెరా వివాదం, మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో పురోగతి, మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు తదితర అంశాలపై చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ పోలీసు లంటే జాతీయ స్థాయిలో మంచి పేరు, గౌరవం ఉండేవని, గత ఐదేళ్లలో మాఫియాలా వ్యవహరించిన కొందరు ఐపీఎస్‌ల వల్ల ఏపీ పోలీస్ ఇమేజ్ దెబ్బతిందని సీఎం వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయి శాంతిభద్రతల సమస్యలకు పరిష్కారం చూపించిన ఘనత ఏపీ ఐపీఎస్‌లకు ఒకప్పుడు ఉండేదని, ఇప్పుడు ఒక్కొక్కటి వింటుంటే అసహ్యం వేస్తోందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో ఏపీ పోలీసు ప్రతిష్ఠ పెరగాలంటే ముంబై నటి కేసు పూర్తి పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా పొరపాటు లేకుండా, ఎవరు తప్పు చేసినా వదలకుండా చట్టం ముందు నిలబెట్టాలన్నారు. పారిశ్రామికవేత్తలా.. రాజకీయ నాయకులా.. ఐపీఎస్ అధికారులా.. అనేది చూడకుండా తప్పు చేసిన వారిపై చర్య తీసుకోవాలని నిర్దేశించారు. గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కళాశాల మహిళా హాస్టల్‌లో రహస్య కెమెరా వివాదంపైనా సీఎం ఆరా తీశారు. ఆ ఘటన వెనకున్న వ్యక్తుల్ని శిక్షించాలని, కుట్రకోణాన్ని పరిశీలించి, ఉంటే వదిలి పెట్టొద్దన్నారు. విద్యార్థినులకు పూర్తి భరోసా కల్పించి, వారిని రెచ్చగొడుతున్న వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో ఆడపిల్లల జోలికి ఎవరొచ్చినా ఊరుకోవద్దని, వారి భద్రతే ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు. మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో పురోగతి, గత ప్రభుత్వంలో భూ అక్రమాలపైనా సీఎం ఆరా తీశారు. వైసీపీ బాధితులు వేలల్లో ఉన్నారని, అందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉందన్నారు. ఏపీ ఫైబర్ నెట్ కేసులో పురోగతి గురించి తెలుసుకున్నారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో అవినీతిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మద్యపాన నిషేధం పేరుతో ప్రజల్ని వంచించి మరోవైపు పేదల రక్తాన్ని నాసిరకం మద్యంతో పీల్చేసిన వ్యక్తుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అన్నారు. కీలకమైన కేసుల్లో పకడ్బందీ సాక్ష్యాలు సేకరించి బాధ్యులను జైలుకు పంపాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హా పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రతిష్ఠ మంటగలిసింది

ముంబై నటి వ్యవహారంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీసులు వ్యవహరించిన తీరు రాష్ట్రం ప్రతిష్ఠను మంటగలిపిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు మాట్లాడారు. తప్పు చేసిన పోలీసులు ఏ స్థాయిలో ఉన్నా క్షమించేది లేదని, మహిళలు, ఆడబిడ్డల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల్లో నెలకొన్న ఆందోళన విషయంలో తాము సకాలంలో స్పందించి తగు చర్యలు తీసుకొన్నామన్నారు. 'ఆ కళాశాల విషయంలో జరిగిన ప్రచారంతో అంతా భయాందోళనకు గురయ్యారు. మేం సకాలంలో స్పందించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. విద్యార్థినులు, తల్లిదండ్రులు సహా అందరి సమక్షంలోనే హాస్టల్ మొత్తం తనిఖీలు చేయించాం. రహస్య కెమెరాలు వంటి పరికరాలు ఏవీ లభ్యం కాలేదు. అయినా సమగ్ర విచారణ కొనసాగిస్తాం. కొన్ని ప్రచారాల పట్ల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా, ధైర్యంగా ఉండాలి. తప్పు చేసిన ఎవరినీ మా ప్రభుత్వం ఉపేక్షించదు' అని ఆయన అన్నారు. వైసీపీలో ఇమడలేక చాలా మంది టీడీపీలోకి వస్తామంటున్నారని, కానీ అందరినీ కాకుండా మంచి వ్యక్తిత్వం ఉన్న వారినే చూసి తీసుకొంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీకి, నేతలకు, కార్యకర్తలకు ఇబ్బంది లేకుండానే చేరికలు ఉంటాయన్నారు.



విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబును కలిసిన సినీనటి కాదంబరి జెత్వాని

పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ...
ఈ ముగ్గురు ఐపీఎస్‌లే వేధించారు

- మరో ఇద్దరు పోలీసు అధికారులూ ఉన్నారు
- పోలీసులకు వెల్లడించిన కాదంబరి జెత్వానీ

విజయవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ నాపై పెట్టిన దొంగకేసును విచారించే సమయంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులు... పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ నన్ను తీవ్రంగా వేధించారు. మరో ఇద్దరు పోలీసు అధికారులు సైతం వేధించిన వారిలో ఉన్నారు. వారి పేర్లు నాకు తెలియదు. మానసికంగా, శారీరకంగా టార్చర్‌కు గురిచేశారు. కొందరు పోలీసులు నన్ను అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు' అని ముంబై సినీనటి కాదంబరి జెత్వానీ పోలీసుల విచారణలో వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున 5.30కి కాదంబరి జెత్వానీ, ఆమె తల్లిదండ్రులు విజయవాడ చేరుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బస చేసిన ఆమెను శుక్రవారం మధ్యాహ్నం విచారణాధికారి స్రవంతి రాయ్ వెళ్లి కలిశారు. ఆమెపై పెట్టిన కేసు పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం జెత్వానీ తన న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, స్రవంతి రాయ్‌తో పాటు సాయంత్రం 6గంటల సమయంలో సీపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీపీ రాజశేఖర్ బాబు, స్రవంతి రాయ్ ఎదుట జెత్వానీ, ఆమె తల్లి ఆశా జెత్వానీ స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. సుమారు 4గంటలకు పైగా ఆమె సీపీ కార్యాలయంలోనే ఉన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసుల వద్ద జెత్వానీ సంచలన విషయాలను వెల్లడించారు. తమను ఫిబ్రవరి 3న అరెస్టు చేశారని, 4న విజయవాడకు తీసుకొచ్చి ఇబ్రహీంపట్నంలోని అతిథి గృహంలో ఉంచారని, అక్కడ తనను, తన తల్లిదండ్రులను నిర్బంధించి మానసికంగా.. శారీరకంగా వేధించారని వివరించారు. ఆ సమయంలో కొందరు పోలీసులు తనను అసభ్యకరమైన రీతిలో ఫొటోలు, వీడియోలు తీశారని వాపోయారు. సజ్జన్ జిందాల్ కేసును రాజీ చేసుకోవాలని తీవ్రస్థాయిలో బెదిరించారని చెప్పారు. ముంబైలో తమను అరెస్టు చేసిన సమయంలో ఒంటి మీద దుస్తులు మినహా మరో జత తీసుకొచ్చేందుకూ అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. తమను ఫిబ్రవరి 6వ తేదీన కోర్టుకు హాజరుపర్చి, జైలుకు పంపారని తెలిపారు. కోర్టుకు వెళ్లే సమయంలో తమ కాళ్లకు చెప్పులు కూడా లేవన్నారు. అతిథిగృహంలో ఉంచిన సమయంలో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీ అక్కడికి వచ్చి తనను, తన తల్లిదండ్రులను వేధింపులకు గురిచేశారని వెల్లడించారు. పోలీసులు తమ కుటుంబం నుంచి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సీజ్ చేశారని, వాటిని కోర్టు ద్వారా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాల్సి ఉన్నా అది జరగలేదని జెత్వానీ పేర్కొన్నారు. ఈ కేసులో భాగస్వాములైన చాలామంది పోలీసుల పేర్లు తనకు తెలియవని, కొందరిని గుర్తుపట్టగలనని జెత్వానీ పేర్కొన్నారు. జగ్గయ్యపేట అనే ఊరు ఉందని తనకు తెలియదని, అలాగే డాక్యుమెంటు గురించి కూడా ఏమీ తెలియదని ఆమె స్పష్టం చేశారు. కుక్కల విద్యాసాగర్ వేధింపులతోనే ఇదంతా జరిగిందని, తనకు న్యాయం చేయాలని కోరారు.

కేసులో 20 మంది పోలీసు అధికారులు!

కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఫిబ్రవరి 2న ఉదయం 6.30కు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అక్కడి నుంచి పోలీసులు ఈ కేసును పరుగులెత్తించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను ఏర్పాటు చేశారు. విచారణాధికారి అప్పటి ఇబ్రహీంపట్నం సీఐ ముత్యాల సత్యనారాయణతోపాటు కె.శ్రీధర్ (సీఐ), దుర్గాభవాని, మౌనిక, వై.రమేశ్‌బాబు, షేక్ అబ్దుల్ రెహమ్మాన్, ఎం.భానుకిరణ్, యు.గోపి, షేక్ షబ్నా పర్వీన్, ఎం.గీతాంజలి, ఎస్.రమ్య ఉన్నారు. ముంబై నుంచి జత్వానీని ఇబ్రహీంపట్నం తీసుకొచ్చిన తర్వాత మరో 10మంది వరకు పోలీసులు ఈ కేసు విచారణలో భాగస్వాములయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 6 వరకు ఈ కేసులో భాగస్వాములైన అధికారులందరి టవర్ లొకేషన్.. గూగుల్ టేకౌట్ తీస్తే దీనివెనుక ఉన్న పెద్ద తలకాయలు ఎవరో తెలుస్తుందని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ ముప్పాళ్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. కాగా, జెత్వానీ కేసులో భాగస్వాములైన పలువురు దిగువస్థాయి పోలీసు అధికారులు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు. పీఎస్సార్, కాంతి రాణా, విశాల్ గున్నీ మాటలు విని తాము ఈ కేసు విషయంలో ముందుకెళ్లామని, అంతకుమించి తమకేమీ తెలియదని ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు.

జెత్వానీ కేసులో పాత్రధారులు, సూత్రధారులను ప్రాసిక్యూట్ చేయాలి: బుద్దా

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 30: చంద్రబాబు పాలనకు, గత ఐదేళ్ల కాలంలో జరిగిన జగన్ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న కోరారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ముంబై నటి జెత్వానీ ఉదంతం ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. జెత్వానీ కేసులో పాత్రధారులు, సూత్రధారులను ప్రాసిక్యూట్ చేయాలన్నారు. ఇంతకుముందు విజయసాయిరెడ్డి, ఎండోమెంట్ అధికారిణి శాంతి వ్యవహారాలను చూశామని, సంఘటనలపై గంట, అరగంట మంత్రులు ఏమన్నారో చూశామని, సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన దారుణాన్ని ఇప్పుడు చూస్తున్నామని పేర్కొన్నారు. జెత్వానీ కేసులో ఐపీఎస్ అధికారుల పాత్ర ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. సజ్జల కనుసన్నల్లోనే జెత్వానీ వ్యవహారం మొత్తం నడిచిందన్నారు. నాటి డీజీపీ కూడా ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. విద్యాసాగర్, సజ్జల, రాజేంద్రనాథ్ రెడ్డి, కాంతిరాణా టాటాలను అదుపులోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బెయిల్ దొరక్కుండా చేసిన బడా నాయకులు

జెత్వానీని అరెస్టు చేయడానికి ముందే ఏపీ పోలీసు ఇంటెలిజెన్స్ అధికారులు ముంబై వెళ్లి ఆమెను ఈ కేసులో ఎలా ఇరికించాలో, ఎవరితో ఫిర్యాదు చేయించాలి అనే అంశాలను ప్లాన్ చేశారు. ఈ కేసులో ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, విశాల్ గున్నీ ప్రమేయం ఉందని జెత్వానీ చెప్పారు. ఈ కేసులో సూత్రధారి కుక్కల విద్యాసాగర్, ఆయన సన్నిహితులు.. చిందా వీర వెంకట నాగేశ్వరరావు, బోరుకాటి భరత్‌కుమార్‌ను విచారిస్తే అసలు నిజాలు నిగ్గు తేలుతాయని ఆమె చెబుతున్నారు. ఆమెకు వకాలత్ ఇచ్చినా బెయిల్ దొరక్కుండా చేయడం వెనుక బడా నాయకులు ఉన్నారని జెత్వానీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిన తన సోదరుడిని కూడా ఈ కేసులో ఇరికించారని అంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కొందరు పోస్టులు పెడుతున్నారని, వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని జెత్వానీ చెబుతున్నారు.

\- నర్రా శ్రీనివాసరావు, జెత్వానీ న్యాయవాది

పక్కా స్కెచ్‌తోనే..

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు దారుణం వ్యవహరించిన తీరు వెలుగులోకి వచ్చింది. సాధారణంగా పదేళ్లలోపు శిక్ష పడే కేసు, సివిల్ కేసులో మహిళను విచారించేందుకు నోటీసు ఇవ్వాలి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారించాలి. ఆ నిబంధనలన్నీ తుంగలోకి తొక్కారు. ఈ కథ మొత్తం తాడేపల్లి డైరెక్షన్‌లో సాగింది. పోలీసులు ఆగమేఘాలపై వారెంట్ తీసుకుని ముంబై వెళ్లారు. ఎస్ఐ స్థాయి అధికారి వెళ్లాల్సిన ఈ కేసులో ఎస్పీ స్థాయి అధికారి వెళ్లారు. కాదంబరి జత్వానీతో పాటు ఆమె తల్లిదండ్రులను విజయవాడకు తీసుకొచ్చి ఎన్నో విధాలుగా వేధించారు.

ఇదీ అసలు విషయం

మిత్రుడు సజ్జన్ జిందాల్‌కు సహాయ పడేందుకు నాటి జగన్ సర్కారు ఆడించిన డ్రామాలో అసలు విషయం బట్టబయలైంది. ఎక్కడో ముంబైలో వైద్యురాలు, సినిమాల్లో నటించే జత్వానీ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ భూముల్ని దౌర్జన్యంగా తన పేరిట రాయించుకున్నారని అల్లిన కథ పూర్తి కట్టుకథగా తేలింది. నాడు వైసీపీ పెద్దలు వేసిన స్కెచ్‌ను నిజమని నిరూపించేందుకు పోలీసుఅధికారులు అత్యుత్సాహం చూపారు. అంతర్జాతీయ స్థాయి నేరస్థురాలు అయినట్టు ఎస్పీ స్థాయి అధికారి ముంబై వెళ్లి ఓ మహిళపై ప్రతాపం చూపారు. సజ్జన్ జిందాల్‌ను రేప్ కేసు నుంచి రక్షించడం కోసం జత్వానీ కుటుంబాన్ని వేధింపులకు గురిచేశారు. పోలీసు అధికారులు తాము అనుకున్నది చేశాక బాధితులను బెదిరించి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని విడిచిపెట్టారు.

పోలీసులు వ్యవహరించేది ఇలాగేనా?

ముంబై నటి వ్యక్తిత్వం, ఆమెకున్న సంబంధాలు.. అవన్నీ అంతర్గత విషయాలు. ఆమె బ్లాక్‌మెయిల్ చేస్తే తప్పు చేయనివారు పోలీసు స్టేషన్లు, కోర్టుల్ని ఆశ్రయించవచ్చు. అలాకాకుండా ఒక రాష్ట్ర ప్రభుత్వం మహిళతో వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అనే ప్రశ్నకు నాటి వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు సమాధానంచెప్పాలి. విద్యాసాగర్‌తో జత్వానీపై ఫిర్యాదు ఇప్పించారు. అదే విద్యాసాగర్ నగ్నచిత్రాల్ని మహిళ మొబైల్‌కు పంపించడం తప్పుకాదా? పెళ్లైన 14నెలలకే భార్యను వదిలేసిన విద్యాసాగర్ ఫిర్యాదులో జత్వానీతో తనకున్న సంబంధాలు ఏమిటో వెల్లడించలేదు. తన భూమి కొట్టేసేందుకు ప్రయత్నించిందని పోలీసులకు ఇచ్చిన ఆధారాలు పూర్తిగా ఫ్యాబ్రికేట్. ఈ విషయం ఇలా ఉంచితే పోలీసులు ఒక మహిళను నిర్బంధించడాన్ని అందరూ వేలెత్తి చూపిస్తున్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకొస్తే వెంటనే కోర్టులో ప్రవేశపెట్టి అవసరమైతే కస్టడీలోకి తీసుకోవాలి. ఇలాంటి వాస్తవాలు పక్కన పెట్టి అరాచకాలకు సహకరించిన పోలీసులకు వత్తాసు పలకడం బాధ్యత గల జర్నలిజం అవుతుందా? పారిశ్రామికవేత్తల్ని ప్రభుత్వం బెదిరిస్తోందంటూ పొంతనలేని కథనం రాసే ముందు జగన్ హయాంలో అనేక కంపెనీలు పారిపోయిన విషయాన్ని ప్రస్తావించలేదు. అమర్‌రాజా నుంచి జాకీ వరకూ, రిలయన్స్ నుంచి లులూ వరకూ ఎన్నో వెళ్లిపోయాయి. జగన్ స్నేహితుడి కోసం వైపీఎస్ అధికారులు చేసిన నీచాన్ని సమర్థించడమే దారుణం. మహిళలకు జరిగిన అన్యాయాన్ని బాధ్యత గల మీడియా ప్రజల్లోకి తీసుకెళితే ఎల్లో రాతలంటూ గగ్గోలు పెడుతూ పైశాచికానందం పొందడం విడ్డూరంగా ఉంది.

ఇది కాదా అత్యుత్సాహం..!

ముంబై నటి కేసులో జగన్ రోతపత్రిక వ్యవహరించిన తీరు అత్యుత్సాహం కాదా? ఇక్కడ జరిగింది అంతర్జాతీయ కుట్ర కాదు. పెద్ద గ్యాంగ్‌వార్, వేల కోట్ల కుంభకోణమూ కాదు. కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం. ఒకవ్యక్తి భూమిని కాజేసేందుకు ఓ మహిళ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి బ్లాక్‌మెయిల్ చేస్తోందనేది ఫిర్యాదు మాత్రమే. పూర్తిగా సివిల్ వివాదమైన ఇలాంటి ఫిర్యాదు సామాన్యుల నుంచి వస్తే పోలీసులు కోర్టుకు వెళ్లమని సలహా ఇస్తారు. ఒకవేళ తీసుకున్నా నోటీసు ఇచ్చి అవతలి వ్యక్తిని విచారణకు పిలుస్తారు. అలా రాకపోతే వారెంట్ ఇచ్చి పోలీసుల్ని పంపుతారు. ఇలాంటి కేసుల్లో ఎస్ఐ అంతకన్నా ఎక్కువైతే సీఐ బృందం వెళుతుంది. ఐపీఎస్‌లు వెళ్లరు. కానీ ముంబైలో డాన్ కోసం వెళ్లినట్లు ఒక నటి కోసం ఐపీఎస్ అధికారి నేతృత్వంలో పోలీసు బృందం వెళ్లడం అవసరమా? అనేప్రశ్నకు రోతమీడియా వద్ద సమాధానం లేదు.

ముంబైలో ఎవరో వ్యాపారవేత్తపై ఒక నటి రేప్ కేసు పెడితే అక్కడి పోలీసుల్ని ఆయన మేనేజ్ చేశారు. ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు ఏపీ సర్కారు సాయం కోరితే నాటి ప్రభుత్వ పెద్దలు వైపీఎస్ అధికారులను రంగంలోకి దించారు. ఓ మహిళను, ఆమె కుటుంబాన్ని బలవంతంగా తీసుకొచ్చి, బెదిరించి ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించుకోవడం కుట్ర కాదా.

జెత్వానీ, సజ్జన్ మధ్యలో జగన్

ముంబైలో బాంద్రా కుర్లా కాంప్లెక్స్ స్టేషన్‌లో 2023 డిసెంబరు 17న సజ్జన్ జిందాల్‌పై కేసు నమోదయింది. ఆ తరువాత 12 రోజులకు అంటే 2023 డిసెంబరు 29న సజ్జన్ జిందాల్ తాడేపల్లిలో జగన్‌ను కలిశారు. 2024 ఫిబ్రవరి 2న కుక్కల విద్యాసాగర్ ఇబ్రహీంపట్నం పోలీసులకు జత్వానీపై ఫిర్యాదు చేశారు. 3వ తేదీన పోలీసులు ముంబై నుంచి జెత్వానీని తీసుకొచ్చారు. పోలీసులు చెప్పిన వాటికన్నింటికీ జెత్వానీ తల్లిదండ్రులు పూర్తిగా అంగీకరించిన తరువాతే ఆమెకు ఫిబ్రవరి 14న బెయిల్ వచ్చింది. ఆ మరుసటి రోజు.. ఫిబ్రవరి 15న కడపలో జరిగిన స్టీల్ ప్లాంట్ భూమి పూజా కార్యక్రమంలో సజ్జన్ జిందాల్ పాల్గొన్నారు. పోలీసులు చెప్పినట్టుగా... ముంబైలో సజ్జన్‌పై పెట్టిన కేసు విచారణకు జెత్వానీ హాజరు కాలేదు. దీంతో ముంబై పోలీసులు మార్చి 15న కేసు క్లోజ్ చేశారు.

డ్రామా మిస్ ఫైర్

జాతీయస్థాయిలో చర్చనీయాంశమైన ఈ కుట్రకోణంలో బయటికి వస్తున్న వాస్తవాలు వింటుంటే మాఫియా డాన్‌లను మించిన స్కెచ్‌లు వేశారు. నాడు వైపీఎస్ అధికారులు ఆడిన డ్రామా మిస్ ఫైర్ అయింది. జగన్ స్నేహితుడైన సజ్జన్ జిందాల్‌ను రేప్ కేసు నుంచి రక్షించడం కోసం ఆయన పార్టీకి చెందిన కుక్కల విద్యాసాగర్‌తో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ముంబై నటికి విజయవాడ సమీపంలో భూమి కొనాల్సిన అవసరం ఏముందనే విషయాన్ని పక్కన బెట్టేశారు. ఆమెతో పాటు తల్లిదండ్రులను అరెస్ట్ చేసి తీసుకొచ్చారు. పోలీసుల దర్యాప్తులో ఇవన్నీ బయటికి వస్తుండటంతో వైసీపీ నేతలతో పాటు జగన్ మీడియా రంగంలోకి దిగి ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తే పారిశ్రామికవేత్తలు పారిపోతారంటూ వార్తలు వండటం మొదలు పెట్టింది.

విద్యాసాగర్ పెళ్లి చేసుకుంటానన్నాడు

- కాదన్నాననే నన్ను వేధిస్తున్నాడు: నటి కాదంబరి జెత్వానీ

విజయవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తనను పెళ్లిచేసుకుంటానన్నాడని.. తాను నిరాకరించినందునే తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ముంబై నటి కాదంబరి జెత్వానీ చెప్పారు. ముంబైలో సుమారు 15 మంది ఏపీ పోలీసు అధికారులు తనను కిడ్నాప్ చేశారని వెల్లడించారు. తన అరెస్టుకు కారణమైన డాక్యుమెంట్ ఫోర్జరీదని.. దానిని విద్యాసాగరే సృష్టించాడని తెలిపారు. శుక్రవారమిక్కడ విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'విద్యాసాగర్ నాకు 2015లో పెళ్లి ప్రతిపాదన చేశాడు. ఆయన వివాహేతర సంబంధాల కారణంగా తిరస్కరించాను. అప్పటి నుంచి నన్ను చెప్పుకోలేని రీతిలో వేధింపులకు గురి చేస్తున్నాడు. నన్ను ముంబైలో అరెస్టు చేసే సమయంలో ఏపీ పోలీసులు ఎలాంటి నిబంధనలూ పాటించలేదు. అక్కడ కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకొచ్చారు. నాటి విజయవాడ సీపీ కాంతిరాణా తాతా అక్రమంగా కేసులో ఇరికించారు' అని వాపోయారు. పోలీసులు తీవ్రంగా వేధింపులకు గురి చేశారని.. సుమారు 45 రోజులపాటు తన జీవితాన్ని దుర్భరం చేశారని అన్నారు. ఈ కేసులో రాజకీయ నాయకులకు సంబంధం ఉందో లేదో విచారణలో తేలాల్సి ఉందని చెప్పారు. పోలీసుల వేధింపుల కారణంగా తన తల్లిదండ్రుల ఆరోగ్యం దెబ్బతిందన్నారు. జైలులో తన తండ్రి బంగారు ఉంగరం కూడా పోయిందని చెప్పారు. 'కేవలం డబ్బుల కోసం ఓ మహిళపై ఇలాంటి అక్రమ కేసు పెట్టి వేధిస్తారా? నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని నిరూపించే అన్ని ఆధారాలూ పోలీసులకు ఇచ్చాను. ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించింది విద్యాసాగరే.. నా ఆధార్ కార్డును కూడా ఫోర్జరీ చేశారు. ఆ డాక్యుమెంట్‌లో పేర్కొన్న ఆస్తి కూడా అప్పటికే బ్యాంకు తనఖాలో ఉంది. అలాంటి ఆస్తిని నేను వేరే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నించానని ఎలా చెబుతారు? నేను పలువురు పారిశ్రామికవేత్తలను బ్లాక్‌మెయిల్ చేశానని ప్రచారం చేస్తున్నారు. అలా చేస్తే వారు నాపై కేసులు పెట్టేవారుగా' అని జెత్వానీ ప్రశ్నించారు.

దంచికొట్టిన వాన

(మొదటి పేజీ తరువాయి)

అంతరాయం కలిగింది. స్కూళ్లు కాలేజీలకు వెళ్లేవారు నానా ఇబ్బందులు పడ్డారు. వీధులు, రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు అల్లూరి జిల్లా కుంతలంలో 45.5, కడప జిల్లా పెద్దపసుపళ్లలో 37, అనకాపల్లి జిల్లా పరవాడలో 35.29, ప్రకాశం జిల్లా ఈదరలో 34.5, నంద్యాల జిల్లా పెద్దదేవళాపురంలో 34, కాకినాడ జిల్లా చొల్లంగిపేటలో 30మిల్లీమీటర్ల గరిష్ఠ వర్షపాతం నమోదైంది. 124 చోట్ల 10మిల్లీమీటర్లపైన వాన పడింది. గత పక్షం రోజులుగా వాన కురవని ప్రాంతాల్లో వరి, పత్తి, మిర్చి, వేరుశనగ వంటి పంటలకు ఈ వర్షం జీవం పోస్తుందంటున్నారు. మాగాణి, మెట్ట పైర్లకు కొంత మేలు చేసినా.. తొలకరిలో వేసిన మినుము, పెసర వంటి పంటలకు కాస్త ఇబ్బంది కలుగుతుందని రైతులు చెప్తున్నారు. కోతకొచ్చిన అపరాల గింజలు తడిసే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కాగా, ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో గురువారం ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనిస్తూ ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరానికి ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించింది. ఇదే దిశలో పయనించే క్రమంలో బలపడి రానున్న 36గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో శని, ఆది వారాల్లో కూడాఅక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించింది.

ప్లీజ్.. నన్ను విడిచి వెళ్లొద్దు!

- ఎంపీలకు జగన్ వేడుకోలు
- మీడియా ముందుకు అయోధ్య, బోస్
- జీవితాంతం జగన్ వెంటే ఉంటామని వెల్లడి
- మేడా, బాబూరావూ వెళ్లరని వ్యాఖ్య

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. రాజ్యసభకు ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు రాజీనామా చేయడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. తనకు సన్నిహితులుగా ఉన్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, గొల్ల బాబూరావుతో పాటు మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య కూడా రాజీనామాలు చేయబోతున్నారని భారీఎత్తున ప్రచారం సాగుతుండడంతో కలత చెందిన మాజీ సీఎం.. బుజ్జగింపు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్టీని, తనను వదిలిపోవద్దని అభ్యర్థించారు. రాజ్యసభలో వైసీపీకి ఉన్న బలం వల్లే ఢిల్లీలో తనను గౌరవిస్తున్నారని.. మీరు రాజీనామా చేస్తే.. ఉప ఎన్నికల్లో ఆ పదవులన్నీ టీడీపీకి వెళ్లిపోతాయని చెప్పారు. రాజీనామా చేయడం తనకు వెన్నుపోటు పొడవడమేనని నిష్ఠూరం ఆడినట్లు సమాచారం. ఈ బుజ్జగింపుల ప్రభావమో ఏమో.. అయోధ్యరామిరెడ్డి, బోస్ శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్ ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ముందుకొచ్చి మాట్లాడారు. తాము జీవితాంతం జగన్ వెంటే ఉంటామన్నారు. తనకు వ్యక్తిగతంగా నష్టాలు, కష్టాలూ ఉన్నా వైసీపీని వీడడం లేదని.. రాజ్యసభకు రాజీనామా చేయడం లేదని అయోధ్యరామిరెడ్డి చెప్పారు. గొల్ల బాబూరావు, రఘునాథరెడ్డి కూడా పార్టీని వదిలివెళ్లరని అన్నారు. మీడియాకు ఈ విషయం చెప్పాలని జగన్ సూచించారని బోస్ వెల్లడించారు. తాము రాజ్యసభకు రాజీనామా చేస్తే ఆ పదవులు టీడీపీకి వెళ్లిపోతాయని.. అది ఒక విధంగా జగన్‌కు వెన్నుపోటు పొడవడంతో సమానమని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జగన్‌కు మరో షాక్ తగిలింది. కాకినాడ జిల్లాకు చెందిన కర్రి పద్మశ్రీ (గవర్నర్ కోటా), ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన బల్లి కల్యాణచక్రవర్తి (ఎమ్మెల్యే కోటా) శుక్రవారం మండలికి, పార్టీకి రాజీనామా చేశారు. ఇప్పటికే పోతుల సునీత (ఎమ్మెల్యే కోటా) కూడా ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మోపిదేవి, మస్తాన్‌రావుల రాజీనామాలను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గురువారమే ఆమోదించగా.. సునీత, పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తిల రాజీనామాలను ఆమోదించకుండా మండలి చైర్మన్ మోషేన్‌రాజు పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. ఆమోదిస్తే ఇవి టీడీపీ కూటమి ఖాతాలోకి వెళ్లిపోతాయి. కాగా.. కొందరు వైసీపీ ముఖ్య నేతల వ్యవహార శైలినీ జగన్ శంకిస్తున్నట్లు తెలుస్తోంది.



నేడు పులివెందులకు జగన్

పులివెందుల, ఆగస్టు 30: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం బెంగళూరు నుంచి పులివెందుల రానున్నారు. మూడు రోజులు ఇక్కడే పర్యటించనున్నారు. శనివారం ఉదయం ఆయన బెంగళూరు నుంచి కడప విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన పెండ్లిమర్రి మండలం మాచునూరు, గొంది పల్లె గ్రామాలకు వెళ్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి పులివెందుల ఇంటికి చేరుకుంటారు. సోమవారం (సెప్టెంబరు 2న) తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయ ఘాట్‌లో నివాళులు అర్పిస్తారు.


అవి నాకు ఆపాదించిన వ్యాఖ్యలు

- న్యాయ వ్యవస్థ పట్ల నాకు పూర్తి విశ్వాసం ఉంది: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భారత న్యాయ వ్యవస్థ పట్ల తనకు అత్యంత గౌరవం, పూర్తి విశ్వాసం ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొన్ని పత్రికల్లో గురువారం తాను అన్నట్లుగా ప్రచురితమైన వ్యాఖ్యలు తనకు ఆపాదించబడినవేనని వివరణ ఇచ్చారు. కవిత బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల సుప్రీం ధర్మాసనం సీరియస్ అయిన నేపథ్యంలో ఎక్స్ వేదికగా శుక్రవారం ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. న్యాయ ప్రక్రియ పట్ల తనకు ప్రగాఢ విశ్వాసం ఉందన్నారు. పత్రికా నివేదికల్లో ప్రచురితమైన ఆ వ్యాఖ్యలపట్ల తాను బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల తనకు అపారమైన గౌరవం ఉందన్నారు. భారత రాజ్యాంగం, దాని నైతికతపైన దృఢ విశ్వాసం ఉన్న తాను.. న్యాయవ్యవస్థపైన తనకు ఉన్న అత్యున్నత గౌరవాన్ని కొనసాగిస్తానన్నారు.

విద్యార్థినిని వేధిస్తున్న ప్రొఫెసర్ అరెస్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిని వేధించిన అసోసియేట్ ప్రొఫెసర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్టు అనకాపల్లి పట్టణ సీఐ టి.వి. విజయ్‌కుమార్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలానికి చెందిన విద్యార్థిని అనకాపల్లి ప్రాంతంలోని ఒక కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె పట్ల అసోసియేట్ ప్రొఫెసర్ ఒకరు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. తనతో రోజూ ఫోన్‌లో మాట్లాడాలని, ల్యాబ్‌కు పిలిచినప్పుడు రావాలని వేధించేవారు. ఈనెల 28వ తేదీన ఆమె తరగతి గదిలో ఉండగా ల్యాబ్‌కు పిలిచి, అందరి ముందు అవమానపరచారు. అది తట్టుకోలేక ఆమె ఆరోజు రాత్రి ఆత్మహత్యకు యత్నించింది. కారణమేమిటో తెలుసుకుని విద్యార్థినితో సహా వచ్చి గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి అసోసియేట్ ప్రొఫెసర్‌ను అరెస్టు చేశామని సీఐ తెలిపారు. కళాశాల యాజమాన్యం అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది.


శ్రీశైలం డ్యాం నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

శ్రీశైలానికి భారీ వరద

- మరో 4-5 రోజులు కొనసాగే అవకాశం
- 2009నాటి పెను వరదను గుర్తుచేస్తున్న నిపుణులు
- దాని ధాటికే శ్రీశైలం స్పిల్ చానల్ వద్ద భారీ గుంతలు
- ఇప్పటికీ వాటిని పూడ్చని వైనం
- మళ్లీ అంత ప్రవాహం వస్తే డ్యాంకే ముప్పు
- ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి కృష్ణా జలాలు


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాలన్నీ భారీ వరదలతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా ఎగువన ఆలమట్టి నుంచి శ్రీశైలం జలాశయానికి భారీ ప్రవాహం వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు కూడా గరిష్ఠ మట్టానికి చేరుకున్నాయి. ఈ వరదను ప్రకాశం బ్యారేజీ గుండా వృథాగా సముద్రంలోకి వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. పులిచింతల-ప్రకాశం బ్యారేజీ నడుమ గానీ, బ్యారేజీ దిగువన గానీ నీటి నిల్వకు ఎలాంటి జలాశయాలూ లేకపోవడమే దీనికి కారణం. ఆలమట్టి డ్యాం గరిష్ఠ నీటిమట్టం 129.72 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం 122.1 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 1,66,760 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంటే.. 1,76,540 క్యూసెక్కులను కిందకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి మరో నాలుగైదు రోజుల పాటు భారీ వరద రానుందని కేంద్ర జలసంఘం హెచ్చరించింది. మరోవైపు వరద ఉధృతిని వాస్తవికంగా అంచనా వేయకపోతే.. 2009 సెప్టెంబరు రెండో తేదీ నాటి చరిత్ర పునరావృతమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. నాటి పెను వరదకు శ్రీశైలం జలాశయం స్పిల్ చానల్ ముందు.. ఫూల్ ప్లంజ్ పరిధిలో భారీ గుంతలు పడ్డాయి. వాటిని ఇప్పటికీ పూడ్చలేదు. గురువారం సాయంత్రానికి శ్రీశైలంలోకి 3,29,203 క్యూసెక్కుల వరద వస్తోంది. పది క్రస్టు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 2,79,370 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,772 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు.. మొత్తం 3,48,024 క్యూసెక్కులను దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. భారీగా వస్తున్న వరదను పులిచింతలకు.. అక్కడి నుంచి ప్రకాశం బ్యారేజీకి వదలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి తీవ్రస్థాయికి చేరుకుంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహ వేగాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సముద్రంలోకి వదిలేలా చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

కృష్ణా పరివాహక జలాశయాల్లో పరిస్థితి ఇదీ..

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ఆలమట్టి	129.72	122.10	1,75,000	1,75,000
నారాయణపూర్	37.64	31.97	1,85,000	1,78,500
జూరాల	9.657	8.3	3,21,000	3,31,047
తుంగభద్ర	105.79	92.94	31,061	10,444
శ్రీశైలం	215.807	213.882	3,29,203	3,82,112
నాగార్జున సాగర్	312.05	309.057	3,48,024	3,12,097
పులిచింతల	45.77	38.646	2,65,287	3,11,648
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	3,36,169	3,22,606

(గమనిక: నిల్వ టీఎంసీల్లో.. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో)



30 ఇయర్స్ బాబు!

- తొలిసారి సీఎం అయి రేపటితో 30 ఏళ్లు
- ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో గొప్ప మలుపు
- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సంబరాలు
- వైసీపీలో మిగిలేది ఆ ముగ్గురే: వసంత

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మొదటిసారి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఆదివారాని(సెప్టెంబరు1)కి 30 ఏళ్లవుతున్నాయని టీడీపీ నేతలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల మంత్రి టీజీ భరత్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు శుక్రవారం మాట్లాడారు. '1995 సెప్టెంబరు 1న చంద్రబాబు తొలిసారి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీఎం కావడం రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు. ఆయన సీఎంగా గాక సీఈవోగా దేశమంతటా గుర్తింపు పొందారు. నాడు ఆయన అనుసరించిన విధానాలను ఆ తర్వాత దేశమంతా అనుసరించింది. అదే మాదిరిగా విభజిత ఏపీని కూడా పరుగులు పెట్టించడానికి చంద్రబాబు తపన పడుతున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలిచి ఉంటే నవ్యాంధ్ర ఎక్కడికో వెళ్లేది. గత ఐదేళ్లలో ఆర్థికంగా దివాలా తీసిన రాష్ట్రాన్ని నిలబెట్టడానికి చంద్రబాబు ఇప్పుడు గొడ్డు చాకిరీ చేస్తున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చి పెట్టుబడులు సాధించడానికి ప్రయత్నిస్తున్నారు' అని భరత్ అన్నారు. మన తరంలో చంద్రబాబు దార్శనికుడని కృష్ణప్రసాద్ కొనియాడారు. 'తెలుగువారు అనేక మంది దేశ విదేశాల్లో ముందు వరసలో ఉన్నారంటే అది ఆయన కృషితోనే సాధ్యమైంది. జగన్ రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. రాజధాని లేకుండా చేశారు. జగన్ హయాంలో నిలిచిపోయిన పోలవరాన్ని రెండు మూడేళ్లలో మా ప్రభుత్వం పూర్తి చేయబోతోంది. జగన్ నైజం ఆయన పార్టీ వారికి కూడా అర్థమైంది. అందుకే రాజీనామాల పర్వం నడుస్తోంది. రాబోయే రోజుల్లో వైసీపీకి జగన్, విజయసాయిరెడ్డి, సజ్జల తప్ప మరెవరూ మిగలరు. పార్టీని నిలుపుకోవడానికి రాబోయే రోజుల్లో జగన్ దుష్ప్రచారాలకు తెరదీస్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని పిలుపిచ్చారు. మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు చంద్రబాబు వేసిన పునాది ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాదిని ఏర్పరచిందని అశోక్‌బాబు చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ బృందం మాత్రమే బాగుపడిందని, సర్వ వ్యవస్థలూ నాశనమయ్యాయని విమర్శించారు. చంద్రబాబు విజన్-2020 ప్రణాళికను ఎగతాళి చేశారని, కానీ ఇప్పుడదే నిజమై కళ్ల ముందు కనిపిస్తోందని గోనుగుంట్ల వ్యాఖ్యానించారు.

రాష్ట్రానికి పచ్చ తోరణం

(మొదటి పేజీ తరువాయి)

చిరునామాగా తీర్చిదిద్దుతామన్నారు. 13 వన్య సంరక్షణా కేంద్రాలు, మూడు జాతీయ పార్కులు, రెండు జూ పార్కులు, ఒక టైగర్ పార్కు, ఒక ఏనుగుల సంరక్షణ కేంద్రం రాష్ట్రానికి రాబోతున్నాయని చెప్పారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల వద్ద 5,300 ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద పులుల అభయారణ్యం వస్తుందన్నారు. పులులను చూసేందుకు వీలుగా సఫారీని కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు.

ఈ బాధ్యత పవన్ కల్యాణ్‌దే..

భవిష్యత్తులో రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించే బాధ్యతను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మీద పెట్టామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండేసి మొక్కలను నాటితే ఒక్క సంవత్సరంలోనే పది కోట్ల చెట్లు వచ్చేస్తాయన్నారు. 'ఈ ఏడాది రాష్ట్రంలో కోటి మొక్కలను నాటుతున్నాం. ఈ మొక్కల పెంపకం వలన 0.33 శాతం పచ్చదనం పెరుగుతుంది. ఇదొక ఉద్యమంగా తీసుకుపోతే మనం అనుకున్న లక్ష్యాన్ని తేలికగా చేరుకోవచ్చు' అని చెప్పారు.

ఎకో పార్కును చూస్తే ఇక్కడే ఉండాలనిపిస్తోంది

మంగళగిరి ఎకో పార్కును చూస్తే చాలా సంతోషంగా ఉందని చంద్రబాబు అన్నారు. 'ఎకో పార్కుతోపాటు ఓ పక్క ఎయిమ్స్, మరో పక్క ఏపీయస్పీ ఆరవ బెటాలియన్... రాజధాని అమరావతి నడిబొడ్డులో ఇంత బ్రహ్మాండమైన ఎకో పార్కు ఉందంటే చాలా సంతోషం కలుగుతోంది. ఇక్కడికి వస్తే మరో ప్రపంచానికి వచ్చిన ఫీలింగ్ కలుగుతోంది. ఇక్కడే ఇల్లు కట్టుకుని ఉండిపోవాలని అనిపిస్తుంది' అని చెప్పారు. ప్రస్తుతం ఈ ఎకోపార్కుకు రోజుకు మూడొందల మంది వాకింగ్ వస్తున్నారని, త్వరలోనే ఈ సంఖ్య మూడు వేలు కావాలని ఆకాంక్షించారు.


వనమహోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని, అధికారులు

రాజధానిలో 52 శాతం పచ్చదనం..

గ్లోబల్ వార్మింగ్ కారణంగా కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. 'పర్యావరణంలో పెనుమార్పులు వస్తున్నాయి. దీనివలన తుపానులు, క్లౌడ్ బరెస్టులు జరుగుతున్నాయి. కేరళలో ఇదే జరిగింది. వీటి నివారణకు ఏకైక మార్గం చెట్ల పెంపకం ఒక్కటే. అందుకే పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు చెట్ల పెంపకంపై దృష్టి పెట్టాలి. అమరావతి రాజధానిని బ్లూ అండ్ గ్రీన్ కాన్సెప్ట్‌తో నిర్మిస్తున్నాం. ఇందులో 52 శాతం పచ్చదనం ఉంటుంది. గత అయిదేళ్ల అధికారంలో ఉన్న ప్రభుత్వం గతంలో తాము అడవుల్లో పెంచిన ఎర్రచందనాన్ని పెద్దఎత్తున స్మగ్లింగ్ చేయించింది. రుషికొండను నాశనం చేసి జగన్ ప్యాలెస్ కట్టుకున్నారు. ఇక్కడ ఎకో పార్కు సుందరంగా ఉందని పవన్‌కల్యాణ్ కూడా ఓ ప్యాలెస్ కట్టుకుంటే మీరు ఊరుకుంటారా..? కానీ, పవన్ అలా చేయరు. వేరేవారు కట్టినా తాట తీస్తారు. అదీ ఆయన మనస్తత్వం. మేం చెట్లు పెంచుతాం కానీ... ఎక్కడా ఒక్క చెట్టు కూడా కొట్టనివ్వం అని ప్రజలకు హామీ ఇస్తున్నాం' అని చెప్పారు. సమాజంలో జీవ వైవిధ్యం తప్పనిసరని, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. అప్పుడే భవిష్యత్తు ఉంటుందన్నారు. జీవ వైవిధ్యానికి రాష్ట్రం ఓ చిరునామాగా మారాలని ఆకాంక్షించారు.

పవన్ ఆధ్వర్యంలో ఎకో టూరిజం ప్రాజెక్టులు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో 32 కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 నగర వనాలను పెంచుతామన్నారు. 2047 నాటికి ఏపీ నంబర్‌వన్ రాష్ట్రంగా మారాలని ఆకాంక్షించారు. రాష్ట్రానికి కచ్చితంగా మరిన్ని పెట్టుబడులు తెస్తామని, యువతకు ఉపాధి కల్పిస్తామని, పేదరికం లేని సమాజాన్ని సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ ఏసురత్నం, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరామ్, అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం పచ్చదనంతో కళకళలాడాలి

- గ్రీనరీ 29 నుంచి 50 శాతానికి పెరగాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గత ప్రభుత్వ హయాంలో చెట్లను ఇష్టానుసారం నరికివేసి పర్యావరణాన్ని పూర్తిగా విధ్వంసం చేస్తే తాము పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వన మహోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది సమిష్టి బాధ్యత అన్నారు. ఇపుడు మనం నాటే చెట్లు మన భావితరాల వారి భవిష్యత్తు కోసమన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. వాతావరణాన్ని పర్యరక్షించుకుంటే తప్ప మానవజాతికి మనుగడ లేదన్నారు.

దేశీయ మొక్కలే పర్యావరణానికి నేస్తాలు

మొక్కల పెంపకాన్ని, వృక్షసంపద, పచ్చదనం పరిరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకుని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వనమహోత్సవంలో పాల్గొనాలని పవన్ పిలుపునిచ్చారు. వన మహోత్సవ ప్రారంభం సందర్భంగా ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'రాష్ట్రంలో 29శాతమే పచ్చదనం ఉంది. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలి. పచ్చదనంతో రాష్ట్రమంతా కళకళలాడాలి. ఇదే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుంది. మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం ద్వారా 50 శాతం పచ్చదనంతో నిండాలి. దేశీయ జాతి మొక్కలను ఎంపిక చేసుకోవాలి. తద్వారా జీవ వైవిద్యాన్ని, నేల ఆరోగ్యాన్ని సంపూర్ణంగా కాపాడవచ్చు. కార్తీక మాసం వనసమారాధన వరకు జరిగే ఈ వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటాలి. వేప, రావి, ఉసిరి, చింత, కానుగ, శ్రీగంధం, మర్రి, అశోక, రేలా, దిరిసెంమారేడు, కదంబం, జమ్మి, సీతా అశోక, వెలగ, సీతాఫలం వంటి ఎన్నో రకాలు అందరికీ ఉపయోగపడతాయి. వేగంగా పెరుగుతాయని.. కోనో కార్పస్, ఏడు ఆకుల పాల, మడగాస్కర్ ఆల్మన్, ఆస్ట్రేలియా తుమ్మ వంటి అన్యజాతుల మొక్కలు నాటితే వాటివల్ల పర్యావరణానికి మేలు కంటే కీడు అధికంగా ఉంటుంది. అందువల్ల కోనోకార్పస్ మొక్కల్ని నాటడం మానేయాలి' అని పవన్ సూచించారు.

పొలంలో అడుగు పెడితే చంపేస్తారట!

- మా రెండు సెంట్ల స్థలాన్నీ ఆక్రమించారు
- బాబుకు వైసీపీ బాధితుల ఏకరువు
- టీడీపీ ఆఫీసులో వినతులు స్వీకరించిన సీఎం

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల కబ్జాలు, బెదిరింపులపై కొందరు బాధితులు సీఎం చంద్రబాబు వద్ద ఏకరవు పెట్టుకున్నారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించిన సీఎం.. ఆయా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పలువురు అభాగ్యులకు అభయమిచ్చి, ఆర్థిక సాయం కూడా అందించారు. గత ప్రభుత్వ బాధితులు తమ సమస్యలపై సీఎంకు మొరపెట్టుకున్నారు. తమ పొలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారని, పొలంలోకి అడుగు పెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారని కడప జిల్లా కొట్టాల గ్రామానికి చెందిన బత్తుల కృష్ణయ్య ఫిర్యాదు చేశారు. తన పొలం తనకు తిరిగి వచ్చేలా చేయాలని కోరారు. తనకున్న 2 సెంట్ల స్థలాన్ని వైసీపీ అండతో కొంతమంది ఆక్రమించుకున్నారని కాకినాడ రూరల్ కరపకు చెందిన దారపు మణికుమారి సీఎంకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా 10,500, పరోక్షంగా 5వేల కుటుంబాలకు ఉపాధి కల్పించే మీసేవా కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, వాటికి పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మీసేవా కేంద్రాల నిర్వాహకుల సంక్షేమ సంఘ సభ్యులు కోరారు. గొల్లపూడికి చెందిన కొల్లా వెంకట్ అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.


టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న చంద్రబాబు

నేడే పింఛన్ల పండగ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. ఉద్యోగుల సెలవుకు భంగం కలగకుండా, పెన్షన్‌దారులకు నగదు అందడం ఒకరోజు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నారు. శనివారం ఉద్యోగులు విధుల్లో ఉంటున్నందున ఆ రోజే పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పెన్షన్‌దారులకు ఒకరోజు ముందుగానే పింఛను లభించనుంది. గ్రామాల్లో అందుబాటులేకపోవడం తదితర కారణాలతో 31న పింఛన్ అందుకోలేని వారికి సెప్టెంబరు 2న (సోమవారం) నగదు అందించడానికి ఏర్పాట్లు చేశారు. గతంలో వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేసినప్పుడు ఒకటో తేదీ ఏ వారం వచ్చినా వారే ఇళ్లకు వెళ్లి ఇచ్చేవారు. కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బందితో సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టింది. గత రెండు నెలలుగా వీరు ఒకటో తేదీ ఉదయమే ఇంటింటికీ వచ్చి అవ్వా తాతలకు నగదు అందజేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65లక్షల మందికి రూ.2,730 కోట్ల మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి అందించనున్నారు. ఒకటో తేదీ రాకముందే పింఛనుదారుల మోములో చిరునవ్వు చిందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాగా, పెన్షన్ల పంపిణీ ప్రక్రియ నేపథ్యంలో ఉద్యోగుల బదిలీల గడువును మరో 15 రోజుల పాటు పొడిగించారు.

నేడు ఓర్వకల్లుకు సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం కర్నూలు జిల్లా మండల కేంద్రం ఓర్వకల్లుకు రానున్నారు. ఓర్వకల్లులో ఆయన లబ్ధిదారులకు నేరుగా పింఛన్లను అందజేయనున్నారు. గ్రామం నడిబొడ్డున ఉన్న రచ్చకట్ట వేదికగా గ్రామ సభ నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి తదితరులు సీఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం రాత్రి 10 గంటలకు పరిశీలించారు. ఓవైపు వర్షం కురుస్తున్నప్పటికీ ఏర్పాట్లు, బందోబస్తుపై సమీక్షించారు. షెడ్యూల్ ప్రకారం పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమడ గ్రామంలో సీఎం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. అయితే శనివారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటం, ఎడతెరిపి లేని వర్షం పడింది. దీంతో ఓర్వకల్లు నుంచి పత్తికొండకు హెలికాప్టర్‌లో వెళ్లేందుకు సీఎం భద్రతా అధికారులు, ఏవియేషన్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో కర్నూలు(ఓర్వకల్లు) విమానాశ్రయం పక్కనే ఉన్న మండల కేంద్రమైన ఓర్వకల్లును ఎంపిక చేశారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో పింఛన్ల పంపిణీ గ్రామ సభా వేదిక వద్దకు చేరుకుంటారు. అక్కడే లబ్ధిదారులకు ఆయన పింఛన్లను పంపిణీ చేస్తారు. అనంతరం గ్రామ సభలో ప్రసంగిస్తారు.

నేడు ఆరుగురు ఐఏఎస్‌ల రిటైర్మెంట్

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ నీరబ్ కుమార్

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకేసారి ఆరుగురు ఐఏఎస్ అధికారులు శనివారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు సంబంధిత జీవోను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఈ జాబితాలో వైసీపీ హయాంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్ భార్గవ ఉన్నారు. అయితే.. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఈయనను కూటమి ప్రభుత్వం జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా, రిటైర్మెంట్ ముందు రోజు ఆయనకు ఊరటకల్పిస్తూ.. శుక్రవారం ఆయనను సాధారణ పరిపాలన శాఖ పరిధిలోని జీపీఎం అండ్ ఏఆర్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. శనివారం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పోస్టులోనే రిటైర్ కానున్నారు.

1 ప్రస్తుతం చీఫ్ కమిషనర్ ఆఫ్ ట్యాక్సెస్‌గా ఉన్న ఎం. గిరిజా శంకర్ కూడా శనివారం రిటైర్ కాబోతున్నారు. దీంతో ఎక్సైజ్, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ముఖేశ్ కుమార్ మీనాకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ట్యాక్సెస్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

1 పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ బి. శ్రీధర్, అదనపు ఎన్నికల అధికారి పి. కోటేశ్వరరావు, బాపట్ల జాయింట్ కలెక్టర్ పి. సుబ్బారావు కూడా శనివారం పదవీ విరమణ చేయనున్నారు.

నంద కిశోర్ రిలీవ్

స్టేట్ డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చిన ఐఐఎస్ అధికారి నంద కిశోర్‌ను ప్రభుత్వం మాతృ సంస్థకు పంపించింది. ఆయన డిప్యుటేషన్ గడువు ఐదేళ్లు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రిలీవ్ చేసింది. ఆయన 2019 ఆగస్టులో ఇంటర్ స్టేట్ డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చారు.

ఫిషింగ్ హార్బర్

పూడిమడకలో 387 కోట్లతో

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించిన పీఎం
- నెల్లూరు కలెక్టరేట్‌లో శిలాఫలకం ఆవిష్కరణ


నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే తదితరులు

అనకాపల్లి(ఆంధ్రజ్యోతి), నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 30: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా నుంచి ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో ఓ హార్బర్ నిర్మాణానికి వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. మరో ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో రూ.387 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శుక్రవారం ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరైన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఒకటిన్నరేళ్లలో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ టి.డోలా శంకర్, వివిధ మత్స్యకార సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో...

మత్స్యకారుల చిరకాల కోరికను నెరవేరుస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కావలి ఎమ్మెల్యే డీవీ.కృష్ణారెడ్డి ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.288.8 కోట్లతో 76.89 ఎకరాల్లో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని జాతికి అంకితమిచ్చారని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

హాస్టల్ బాత్రూంలో కెమెరా కళ్లు!


ఆందోళన చేస్తున్న గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు

(మొదటి పేజీ తరువాయి)

తీశారనే అంశంపై గత రెండురోజులక్రితం విద్యార్థినులు కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. అయితే, దీనిపై తక్షణమే స్పందించాల్సిన యాజమాన్యం.. విచారణ చేస్తున్నామని, చర్యలు తీసుకుంటామని చెబుతూ కాలయాపన చేసిందని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా వసతిగృహం నుంచి బయటకు వచ్చి వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. వసతిగృహంలోని వాష్‌రూమ్‌కు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఈ అంశం సోషల్ మీడియా ద్వారా వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం రోజు రోజంతా విద్యార్థినులు ఆందోళన చేశారు.

విభేదాలే కారణమా?

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో కొందరు విద్యార్థినీ, విద్యార్థుల మధ్య నెలకొన్న విభేదాలు బాలికల వసతిగృహంలోని వాష్‌రూమ్‌లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేసేవరకు వెళ్లినట్లు సమాచారం. విద్యార్థినులు వాష్‌రూమ్‌లోకి వెళ్లిన సమయంలో హిడెన్ కెమెరాల ద్వారా తీసిన వీడియోలు అదే కళాశాలకు చెందిన బాలుర వసతిగృహంలోని కొందరికి అందినట్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు 300 వరకు వీడియోలు తీశారని పేర్కొన్నారు. విద్యార్థినులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు బాలికల వసతి గృహానికి వెళ్లి వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. హిడెన్ కెమారాలు ఏర్పాటు చేశారనే అంశంలో అనుమానితుడి లాప్‌ల్యాప్, అతనికి సహకరించిందనే ఆరోపణలున్న మరో విద్యార్థినికి చెందిన ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విద్యార్థినులు, కళాశాల యాజమాన్యం ఎదుట ఓపెన్ చేసి పోలీసులు పరిశీలించారు. ఈ ఘటనలో అనుమానితుడిగా ఉన్న ప్రకాశం జిల్లా పుల్లలచెరువు గ్రామానికి చెందిన బీటెక్ తుది సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అదేవిధంగా అతనికి సహకరించినట్లుగా అనుమానిస్తున్న ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన విద్యార్థినితోపాటు, మరో విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫైనలియర్ విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకోకముందే 'ఇలాంటి ఘటనకు పాల్పడతావా' అంటూ కొందరు విద్యార్థులు అతనికి దేహశుద్ధి చేశారు.

రక్షణ కల్పించండి: విద్యార్థినులు

వాష్‌రూమ్‌లో హిడెన్ కెమెరాల ఏర్పాటు అంశం వివాదాస్పదం కావడంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తక్షణం స్పందించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు ఘటనా స్థలానికి వెళ్లారు. విద్యార్థినీ, విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. రెండురోజుల క్రితమే ఈ ఘటనపై కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశామని, అయినా వారు పట్టించుకోలేదని తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసిన వారిపైనే చర్యలు తీసుకుంటామని లెక్చరర్లు తమపై బెదిరింపులకు పాల్పడ్డారని వాపోయారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం జరిగే వరకు కళాశాలకు వెళ్లేదిలేదని తేల్చి చెప్పారు. తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ వసతిగృహం ఎదుట భైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతోపాటే కూర్చుని మాట్లాడుతూ.. ఈ ఘటనను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా పరిగణిస్తున్నారని, ఇలాంటి ఘటన జరగడం హేయమని అన్నారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వసతిగృహం వార్డెన్, కళాశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. అయినా శుక్రవారం సాయంత్రం వరకు విద్యార్థినులు ఆందోళన కొనసాగించారు. కలెక్టర్, ఎస్పీలతో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మన ఇంటిలో ఆడబిడ్డలకు కష్టంవస్తే ఏవిధంగా స్పందిస్తామో, ఈ ఘటనలోనూ అదేవిధంగా స్పందించాలని అన్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని నిష్పక్షపాతంగా పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు. ఇదిలావుంటే, కళాశాల వాష్‌రూములలో కెమెరాలు పెట్టిన వ్యక్తుల ను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కాలేజీ జల్లెడ

విద్యార్థినుల ఆందోళన నేపథ్యంలో వారి తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు సాంకేతిక పరికరాలను వినియోగించి కాలేజీలోని ప్రతిగదినీ జల్లెడ పట్టారు. అదేవిధంగా బాత్‌రూమ్‌లలోనూ నిశితంగా గాలించారు. ఈ గాలింపు ప్రక్రియ సుమారు నాలుగు గంటలకు పైగానే సాగింది. అయితే.. ఎలాంటి కెమెరాలు లభించలేదని పోలీసులు తెలిపారు. దీంతో విద్యార్థినులు నిరసన విరమించారు.

విచారణకు జేఎన్‌టీయూకే కమిటీ

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాల ఘటనపై జేఎన్టీయూకే(కాకినాడ) ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి. రవీంద్రనాథ్ తెలిపారు. ఆ కళాశాల జేఎన్‌టీయూకే పరిధిలోకి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఇన్‌చార్జి ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్సెస్ డైరెక్టర్ యూవీ రత్నకుమారి, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఏఎస్‌ఎన్ చక్రవర్తిలతో కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కాగా, శుక్రవారం బాలికల వసతి గృహానికి చేరుకుని యాజమాన్యం, విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు రవీంద్రనాథ్ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



హాకథాన్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి

సృజనాత్మకతకు వేదికగా హాకథాన్

పొట్టిశ్రీరాములు కాలేజీలో ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి

వన్‌టౌన్, ఆగస్టు 30: జాతీయస్థాయి హాకథాన్ 1.0 ఒక సృజనాత్మకతకు, ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో రెండురోజుల హాకథాన్ జాతీయస్థాయి 1.0 కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పులు తీసుకురావటానికి సాంకేతికత ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. విద్యార్థులు చూపించే ప్రతిభ, చైతన్యం, ఆవిష్కరణలు భవిష్యత్తులో సాంకేతికతను మరింత ముందుకు తీసుకువెళతాయని చెప్పారు. ఈ ఈవెంట్‌ను ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఖరగ్‌పూర్‌లోని ఐఐటీ, నూజివీడులోని ఐఐటీ, నిట్, అన్నా యూనివర్సిటీ, ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ, లక్కిరెడ్డి బాలరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్, కల్లం హరనాథరెడ్డి ఇన్‌స్టిట్యూట్, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ, ఎంఐసీ కాలేజీ, వాసవీ ఇన్‌స్టిట్యూట్, రామచంద్ర కాలేజీ, కేబీఎన్ కాలేజీ, బాలసాయి డిగ్రీ కాలేజీ నుంచి 100 బృందాలు ఈ హాకథాన్‌లో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టా అమర సుధీర్, జాయింట్ సెక్రటరీ గ్రంధి పవన్ కుమార్, ట్రెజరర్ కాజ రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ అక్బర్, కోఆర్డినేటర్ నవ్యశ్రీ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు ప్రియాంక, సురేష్, షాజహాన్, అనూష, స్వప్న పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి

సీపీ రాజశేఖర్ బాబు

విజయవాడ లీగల్, ఆగస్టు 30 : ఎంతటి తెలివిగలవారైనా సరే సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం వుంటుందని, వీరు దీనిపై ఖచ్చితంగా అవగాహన కలిగి వుండి వాటి బారిన పడకుండా వుండాలని పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్, జిల్లా పోలీస్ కమిషనరేట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గుణరామ్, అజిత్‌సింగ్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, సైబర్ నేరాలు జరిగే విధానంపై, వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చక్కని ఉదాహరణలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామ్‌ప్రసాద్, కార్యవర్గసభ్యులు గండూరి రామశర్మ, కలతోటి క్రాంతి కుమార్, బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, సూరాబత్తుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 30 : అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో అనధికారికంగా నిర్మించిన రెండు అక్రమ కట్టడాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు.స్థానికంగా అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌లో అక్రమార్కులు పేరుతో కథనం ప్రచురితమైంది. స్పందించిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ తక్షణం అక్రమ కట్టడాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది రెండు చోట్ల అనధికారికంగా నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించారు. అయితే వైసీపీ ప్రభుత్వంతో అంటకాగుతూ పలు అక్రమ నిర్మాణాలకు కారణమైన అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతానికి చెందిన సచివాలయ టౌన్‌ప్లానింగ్ విభాగం సెక్రటరిలను ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది.

స్థాయీ సంఘంలో 15 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, ఆగస్టు 30: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 15అంశాలకు ఆమోద ముద్ర వేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 21అంశాలపై చర్చించి 15అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించడం జరిగింది. 4 అంశాలను వాయిదా చేశారు. కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వనం - మనంలో మనమందరం

● వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

వన్‌టౌన్, ఆగస్టు 30: వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యాన భవానీపురం ఎన్డీఏ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి ప్రకృతిని ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపు నిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. వీఎంసీ జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రంగుల గోపిశ్రీనివాస్, రాష్ట్ర ఇన్‌చార్జి కొసరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజి, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి తదితరులు

బీజేపీని పటిష్ఠం చేద్దాం: పురంధేశ్వరి

బీజేపీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. భవానీపురం ఎన్డీఏ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి పార్టీని పటిష్టం చేయాలన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నాటికి బీజేపీ సభ్యత్వాలన్నీ రద్దు అవుతాయని, సెప్టెంబరు 2న ప్రధాని మోదీ సభ్యత్వం తీసుకుని కార్యక్రమాన్ని మొదలుపెడతారని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త విధిగా 2 నుంచి సభ్యత్వాన్ని తీసుకోవాలని తెలిపారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గోపీ మాట్లాడుతూ 18 కోట్ల సభ్యత్వాలను నమోదు చేసి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొసరాజు, చెన్నారెడ్డి, దయాకర్ రెడ్డి, అడ్డూరి శ్రీరామ్, శ్రీనివాస్, షేక్ బాజి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమతో నిండినదే చరిత్ర

శ్రమకావ్యం పుస్తకావిష్కరణలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

విజయవాడ కల్చరల్, ఆగస్టు 30 : చరిత్ర మొత్తం శ్రమతోనే నిండి వుందని, శ్రమ ప్రయాణమే శ్రమాయణం అని ప్రముఖ సినీ కవి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఎంబీవీకే ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం తాను రాసిన శ్రమకావ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ విష్ణువు పెట్టుకొన్న కిరీటం కూడా శ్రమ జీవి తయారు చేసిందేనన్నారు. 56 అక్షరాల తెలుగు భాష దినోత్సవం నిన్ననే, రెండు రాష్ట్రాలలో ఇది తన 56వ శ్రమకావ్యం అని శ్రమకావ్య గానం 56 అక్షరాలే అని విజయవాడలో నా ఈ రోజు 56వ గానం అన్నారు. పౌరాణిక ప్రతీకలను వాడుకొని ఈ గేయాన్ని రాశానన్నారు. శ్రముడు, శ్రమ కలిసి సాగిన ప్రస్థానం ఈ శ్రమ కావ్యం అన్నారు. శారీరక శ్రమ నుంచే నృత్యం, గానం పుట్టాయన్నారు. క్రైస్తవం, ముస్లిం, హిందూ మతాలు ఏర్పడక ముందే ఏర్పడిన ఏకైక మతం శ్రామిక మతమని తాను ప్రకటిస్తున్నానన్నారు. రామాయణం, శివాయణం కన్నా ముందు నుంచే శ్రమ వుందన్నారు. విశ్వరూపమే మహారూపం అయితే శ్రమ అంతకన్నా పెద్ద విశ్వరూపం అన్నారు. ఆది మానవుల్లో మొదటి నుంచి వచ్చిందే పాట అని తరువాతే మాట వచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి జాషువా వేదిక అధ్యక్షుడు సునీల్ అధ్యక్షత వహించారు. ఎంబీవీకే కార్యదర్శి పి.మురళీకృష్ణ, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ



దుర్గగుడిలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



క్యూలో భక్తులు



అన్నవితరణకు రూ.5లక్షలు అందజేస్తున్న దాసరి కస్తూరి కుటుంబ సభ్యులు

ఇంద్రకీలాద్రి కిటకిట

శ్రావణమాసం చివరి శుక్రవారం దుర్గగుడిలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, ఆగస్టు 30: శ్రావణ మాసం ముగింపులో వచ్చిన శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. నాలుగో శుక్రవారం కావటం, శ్రావణమాసం మరో రెండు మూడు రోజుల్లో ముగియనుండటంతో అమ్మవారిని కొలిచేందుకు ప్రత్యేకంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవటం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చన సేవలో భక్తులు పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, చండీహోమం, శాంతి కళ్యాణం, తదితర ఆర్జిత సేవలలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి కానుకలు సమర్పించారు. ఈవో కేఎస్ రామారావు, ఇతర అధికారులు సమన్వయపరిచారు.

అన్నవితరణకు విరాళం

అన్న వితరణకు గుంటూరు బ్రాడీపేట హారికా ఎన్‌క్లేవ్‌కు చెందిన దాసరి కస్తూరి కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయానికి విచ్చేసి రూ.5 లక్షల చెక్కును ఈవో కేఎస్ రామారావు ద్వారా అందించారు. అమ్మవారి దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు. ● విజయవాడ కొత్తపేటకు చెందిన ప్రకాశి చెన్నకేశవ రావు, కుటుంబ సభ్యులు అన్నవితరణ కార్యక్రమానికి రూ.1,01,116 చెక్కు రూపంలో అధికారులను కలిసి అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

బంగారు డైమండ్ నత్తు కానుక

అమ్మవారి అలంకరణ నిమిత్తం విజయవాడ ఎస్‌బిఐ ఆఫీసర్ల కాలనీకి చెందిన గొల్లపాటి ప్రత్యూష, కుటుంబ సభ్యులు సుమారు రూ.1.5 లక్షలు విలువ చేసే 8.7 గ్రాముల బరువుగల బంగారు డైమండ్ నత్తును అధికారులను కలిసి కానుకగా అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు వారికి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందచేశారు. పండితులు ఆశీస్సులు అందచేశారు.

ఈవో ఆకస్మిక తనిఖీ

మహామండపంలోని రెండో అంతస్థులో నిర్వహిస్తున్న అన్నవితరణ కార్యక్రమ హాలులో వంటలను, భోజనాలు వడ్డిస్తున్న తీరును ఈవో రామారావు ఆకస్మిక పరిశీలన చేశారు. మరోవైపు భక్తులు ఎక్కువ మంది వస్తున్న దృష్ట్యా మహామండపం ఒకటో అంతస్థులో కూడా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా ఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనాలు చేస్తున్న భక్తులను ఆయన రుచి, శుచి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగుగా అన్నప్రసాదం భక్తులందరూ స్వీకరించే విధంగా ఉండాలని రుచిగా ఉండాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఏఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేవితత్వం పై ప్రవచనం

కొవ్వూరుకు చెందిన యనమండ్ర శ్రీనివాస శర్మ ధర్మపథం వేదికపై శుక్రవారం దేవితత్వంపై ప్రవచనం చేశారు. దేవీ లీలా విశేషాలను కళ్లకు కట్టినట్లుగా ఆయన అభివర్ణించి భక్తుల హర్షధ్వానాలు అందుకున్నారు.

శాప్ వెయిట్ లిఫ్టింగ్‌లో పీబీ సిద్ధార్థకు పతకాలు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 30 : నగరంలోని ఐజీఎంసీలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల, మహిళా పోటీల్లో మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల క్రీడాకారులు పతకాలతో మెరిశారని కళాశాల యాజమాన్యం తెలిపింది. పతకాలను సాధించిన వెయిట్ లిఫ్టర్లను కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ పి.నాగేశ్వరరావు, సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు అభినందించారు.

పతకాలు సాధించింది.. వీరే

ఎం.సూర్య(89కిలోలు-స్వర్ణం),ఎం.మణికంఠ(61కిలోలు-స్వర్ణం), ఎస్.బిన్నీ(67కిలోలు-స్వర్ణం), ఎస్ మణిశ్రావణి(+87 కిలోలు-స్వర్ణం), సీహెచ్ శుభకర్(+102 కిలోలు-స్వర్ణం), సీహెచ్.గంగరాజు (73కిలోలు-స్వర్ణం), ఎస్.విజయమోహన్(81 కిలోలు- రజతం), టి.సతీష్ (89కిలోలు-రజతం), ఎస్. వంశీకృష్ణ(81 కిలోలు- కాంస్యం)సాధించారు.



వెయిట్ లిఫ్టర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

అండర్-9 బాల బాలికల చెస్ పోటీలు రేపు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 30 : జూనియర్ చెస్ క్లబ్, ది విజయవాడ చెస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సెప్టెంబరు ఒకటవ తేదీన నగరంలోని సిద్ధార్థ నగర్ ఆరో లైన్ లిటిల్ బ్రెయిన్స్ ప్రైమరీ స్కూల్‌లో ఉదయం 9 గంటకు అండర్-9 బాల,బాలికలకు వేర్వేరుగా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పంపుతామని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9246181858 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రహస్య కెమెరా నిందితులను కఠినంగా శిక్షించాలి

పీడీఎస్‌యూ నేత రాజేష్


ధర్నాచౌక్, ఆగస్టు 30: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న కళాశాల యాజమాన్యం వసతిగృహాల్లో సరైన పర్యవేక్షణ చేయడం లేదని మండిపడ్డారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశించి నిజానిజాల్ని వెలుగులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడటం అత్యంత దుర్మార్గమన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

పాయకాపురం : కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమేరాలపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. ప్రసన్నకుమార్, ఏ. అశోక్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో మాట్లాడారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అర్ధరాత్రి విద్యార్థినిల హాస్టల్‌లో హిడెన్ కెమేరాలు ఏర్పాటు చేయడంతో తీవ్ర ఆందోళనకు గురిచేసిందని అన్నారు. యాజమాన్య పరిరక్షణ లోపం దీనికి ప్రధాన కారణమన్నారు. ఇది విద్యార్థినుల మాన ప్రాణాలకే ప్రమాదం అని తెలిపారు. ఇలాంటి ఘటనలు కళాశాలల్లో పునరావృతం కాకుండా బాధ్యులు ఎంతవారైన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాగం తానం పల్లవి పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, ఆగస్టు 30 : డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన రాగం తానం పల్లవి పుస్తకాన్ని సుప్రసిద్ధ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ, జనసేనాని మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ రచయితని అభినందిస్తూ సినీ ఇండస్ట్రీలోని గీత రచయితలు, సంగీత దర్శకులు, గాయకులు, వారి జీవిత విశేషాను ఒక గ్రంథంగా రికార్డు చేయడం రచయిత అభిరుచికి దర్పణం పడుతోందన్నారు.



రాగం తానం పల్లవి పుస్తకావిష్కరణలో నాగేశ్వరావు, సుద్దాల అశోక్ తేజ, కలిమిశ్రీ తదితరులు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



ప్రసాదంపాడులో మొక్కలు నాటుతున్న గంగారత్నం

గుణదల, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్ తరల భవిత ఆధారపడి ఉందని ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రసాదంపాడులో శుక్రవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ సర్నాల గంగారత్నం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణపై నేడు ఎవరూ దృష్టి సారించక పోవడం వల్లనే నేడు విషజ్వరాలు ప్రబలుతున్నాయని కాలుష్యం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుల భారం నుంచి తప్పించుకునేందుకే..

● కారును కాల్వలోకి తోసేసి అదృశ్యం
● ఆచూకీ కనుగొన్న పోలీసులు

గన్నవరం, ఆగస్టు 30 : మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువలో గల్లంతైన కంకిపాడు మండలం మారేడు మాకకు చెందిన గుడిసె రాజేష్ ఆచూకీ పోలీసులు కనుగొన్నారు. అతను బంధువుల ఇంటి వద్ద క్షేమంగా ఉన్నట్లుగా గుర్తించారు. అయితే అప్పులిచ్చిన వారి నుంచి తప్పించుకునేందుకు రాజేష్ ఈ నాటకం ఆడినట్లుగా తేలింది. వివరాలిలా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి ఏలూరు కాలువలోకి కారు దూసుకుపోయిన సంఘటనలో రాజేష్ గల్లంతు కావడంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోయింది. అయితే రాజేష్ ఆర్థిక పరిస్థితిపై ఆరా తీసిన పోలీసులు వేరే కోణంలో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అతని ఆచూకిని గుర్తించినట్లు తెలిసింది.

అరగంటలోనే చేతికందిన ల్యాప్‌టాప్



బాధితుడికి ల్యాప్‌టాప్ అందిస్తున్న పోలీసులు

వన్‌టౌన్, ఆగస్టు 30: బాధితుడు పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అరగంటలోపే గుర్తించి అతనికి అప్పగించిన కృష్ణలంక పోలీసులు అభినందనలు అందుకున్నారు. తెలంగాణలోని మహబూబాబాద్‌కు చెందిన చేగాని రాంబాబు ఇండస్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తాడు. శుక్రవారం ఏలూరు నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాడు. బెంజిసర్కిల్ దగ్గర దిగిన అతనికి సామానులు చూసుకోగా ల్యాప్‌టాప్ లేదని గ్రహించి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తెలియపరిచాడు. కంట్రోల్ రూమ్ పోలీసులు కృష్ణలంక రక్షక్‌కు తెలియజేశారు. అప్పుడు విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ (1605) జె. శివప్రసాద్, కానిస్టేబుల్ విజయ్ బాబు (506)లు ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేయగా బాధితుడు వచ్చిన బస్సులోనే ల్యాప్‌టాప్ ఉందని గుర్తించారు. వెంటనే బాధితుడికి సమాచారం అందించి ల్యాప్‌టాప్‌ను అతనికి అందచేశారు. బాధితుడు జిల్లా పోలీసులకు, కృష్ణలంక పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను అభినందించారు.

దాడి ఘటనలో ముగ్గురికి జైలుశిక్ష

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 30 : ఇద్దరు మహిళలపై దాడి చేసి గాయపరచిన ఘటనలో నాల్గవ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముగ్గురు నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్ న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన బండారి జయ పండ్ల వ్యాపారం చేస్తుంటుంది. 2018 డిసెంబరులో జయ, ఆమె వదిన ఇంటి అరుగుపై కూర్చున్నారు. మింగి మరియదాసు మోటార్‌సైకిల్‌పై అతి వేగంగా వెళ్తున్నాడు. ఆదేమని మహిళలు ప్రశ్నించగా మరియదాసు, అతని కుటుంబ సభ్యులు మరియమ్మ, రమణమ్మ కలసి దాడి చేశారు. అప్పట్లో అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం విచారణ జరిపిన కోర్టు నిందితులు ముగ్గురికి ఆరు నెలలు జైలు, ఒక్కొక్కరికి రూ.2500 జరిమానా విధించింది.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

ధర్నాచౌక్, ఆగస్టు 30: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపు నిచ్చారు. వర్గీకరణ చేస్తూ రాష్ట్ర కేబినేట్ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. సెప్టెంబరు 2న రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద , 11న ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద, 16న కలెక్టర్ కార్యాలయాలు, 27న విజయవాడలో రాష్ట్రస్థాయి ర్యాలీ, అక్టోబర్ రెండో వారంలో చలో అమరావతి, సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జీకే.బాబు, జాతీయ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మాదే సుజాత, రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, జిల్లా కన్వీనర్ డి.వినయ్‌కుమార్, కృష్ణాజిల్లా కన్వీనర్ నల్లబోటు సామియులు పాల్గొన్నారు.

సినీనటి సంఘటనతో ఎలాంటి వ్యవస్థలో ఉన్నాం

నేతి మహేశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 30: ఉన్నత చదువులు చదువుకున్న డాక్టర్, సినీనటికి జరిగిన అన్యాయాన్ని గమనిస్తే ఎలాంటి వ్యవస్థలో మనం ఉన్నామో అర్థమవుతుందని ప్రొఫెషన్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా ఉద్యోగాలు పొందిన ఉన్నతాధికారులు ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు పొందుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయాలిగాని రాజకీయ పార్టీలకు ఊడిగం చేయడం సరైంది కాదన్నారు. ఈ ప్రభుత్వంలో ఇటువంటివి జరగకుండా కట్టుదిట్టమైన విధానాలను రూపొందించాలన్నారు. బొప్పన రాజశేఖర్‌రావు, తోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేయాలి

అజిత్‌సింగ్‌నగర్ : బాలివుడ్ నటి కాదంబరి జెత్వాని అక్రమ నిర్బంధం, వేధింపుల వ్యవహారం తీవ్ర ఆందోళన కలిగించేదిలా ఉన్నాయని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి. రమాదేవి డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు కాలేజీ విద్యార్థినిల ఆరోపణలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ధర్మకర్తల చేతిలోనే ఆలయాలకు ఖ్యాతి: ఆనం

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల ఖ్యాతిని ఇనుమడింపజేసేలా వంశపారంపర్య ధరకర్తల పనితీరు ఉండాలని దేవదాయ మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో ఆయనను పలు ఆలయాల వంశపారంపర్య ధర్మకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన వివరించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాల వైభవ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

నీరు చెట్టు పెండింగ్ బిల్లులపై మంత్రుల సమీక్ష

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నీరు-చెట్టు పనులు చేపట్టిన రైతులకు బిల్లులు చెల్లిస్తామని మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు వెల్లడించారు. శుక్రవారం విజయవాడ పంచాయతీరాజ్ అతిథి గృహంలో నీరు-చెట్టు పెండింగ్ బిల్లులపై మంత్రులు సమీక్షను నిర్వహించారు. నీరు చెట్టు కార్యక్రమాన్ని 2014-19 మధ్య ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. ఈ బిల్లులను వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా నిధులు దారిమళ్లించడంపై సాగునీటి వినియోగదారుల సంఘాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అయినా జగన్ సర్కారు బిల్లులను చెల్లించకపోవడంతో కోర్టు ధిక్కార కేసులను వేశాయి. రాష్ట్రంలో కూటవి ు ప్రభుత్వం రావడంతో పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు బిల్లులు చెల్లించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు రెండు నెలల కాలవ్యవధిలోనే మూడుసార్లు పయ్యావుల, నిమ్మల సమావేశమయ్యారు. ఈ బిల్లులను త్వరలోనే చెల్లిస్తామని నిమ్మల తెలిపారు.

కేఆర్ఎంబీ ఆఫీసు బెజవాడలోనే పెట్టాలి

- సీఎంకు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య వినతి

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడలోనే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలోనే కేఆర్ఎంబీ కార్యాలయం ఉండాలని విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఆధ్వర్యంలోని బృందం విజ్ఞప్తి చేసింది. విభజన చట్టం ప్రకారం కేఆర్ఎంబీ ఆంధ్రప్రదేశ్‌లోనూ, జీఆర్ఎంబీ హైదరాబాద్‌లోనూ ఉండాలని పేర్కొన్నారని గుర్తు చేశారు. 2014-19 మధ్య కాలంలో కేఆర్ఎంబీ కార్యాలయం విజయవాడలోనే ఉండాలని నిర్ణయించినా.. 2019లో జగన్ అధికారంలోనికి వచ్చాక కృష్ణా నది పరీవాహక ప్రాంతంతో సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారని అన్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోనే కేఆర్ఎంబీని ఏర్పాటు చేయాల్సి ఉన్నందున తక్షణమే ఆమేరకు ఆదేశాలు జారీ చేయాలని సీఎం చంద్రబాబును, గోపాలకృష్ణారావు కోరారు.

సాయి ఈశ్వరుడి హత్య కేసులో 'విట్నెస్ రీకాల్'

- చికెన్ బాషా, 'బైరెడ్డి' సంభాషణలను పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టుకు విజ్ఞప్తి.. విచారణ 5కి వాయిదా

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సాయి ఈశ్వరుడు 2014లో దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ కేసులో ప్రధాన నిందితుడు చికెన్ బాషా, ఏ 5గా ఉన్న వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ రికార్డును సాక్ష్యంగా పరిగణించాలని కోరుతూ దాఖలు చేసిన విట్నెస్ రీకాల్ పిటిషన్‌ను విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. దానిని సవాల్ చేస్తూ మృతుడి కుమార్తె జ్యోతి హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం సుదీర్ఘ వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... 'హత్య కేసులో నిందితులుగా ఉన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చికెన్ బాషా మధ్య జరిగిన ఫోన్ సంభాషణను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ సీఆర్‌పీసీ సెక్షన్ 311 ప్రకారం విట్నెస్ రీకాల్ పిటిషన్ దాఖలు చేశాం. విజయవాడ ప్రత్యేక కోర్టు దానిని తోసిపుచ్చింది. మృతుడి కుమార్తెగా రీకాల్ పిటిషన్ దాఖలు చేసే అధికారం పిటిషనర్‌కు ఉంటుంది. కేసులో విచారణ పూర్తయి తీర్పు వెల్లడించేలోపు సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. నిందితుల మధ్య జరిగిన ఫోన్‌కాల్ సంభాషణను సాక్ష్యంగా నమోదు చేసేందుకు సాక్ష్యాల నమోదు ప్రక్రియను తిరిగి తెరిచేలా విజయవాడ కోర్టును ఆదేశించండి' అని కోరారు. సిద్ధార్థరెడ్డి తరఫు న్యాయవాది యు.ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.... 'విజయవాడ కోర్టు ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసే అధికారం పిటిషనర్‌కు లేదు. సాక్ష్యాలను ప్రాసిక్యూషన్ ద్వారా మాత్రమే కోర్టు ముందుంచాలి. నిందితుల మధ్య జరిగిన సంభాషణగా చెబుతున్న ఫోన్ కాల్ ఆడియోను కోర్టు ముందు ఉంచే విషయంలో చట్టం నిర్దేశించిన విధానాన్ని పిటిషనర్ అనుసరించలేదు. కేసు విచారణ తుదిదశకు చేరిన ఈ దశలో సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు నిబంధనలు అనుమతించవు' అని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు సమయం ముగియడంతో వాదనలు కొనసాగింపు కోసం విచారణను సెప్టెంబరు 5కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు ఇచ్చారు.

కృష్ణా జలాల పునఃపంపకంపై రిజాయిండర్


- ట్రైబ్యునల్లో దాఖలుకు ఆంధ్ర సమాయత్తం

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పునఃపంపకాలకు సంబంధించి కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బుధ, గురువారాల్లో (ఈ నెల 28, 29 తేదీల్లో) బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు వాదనలు విపించాయి. అనంతరం 36 అంశాలపై పునఃసమీక్షకు ట్రైబ్యునల్ ముసాయిదా ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అభ్యంతరాలను రిజాయిండర్ రూపంలో రెండు వారాల్లోగా సమర్పించాలని తెలుగు రాష్ట్రాలను ఆదేశించింది. అందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమవుతోంది. పునఃసమీక్ష కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ కాలపరిమితిని పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపుల మేరకే రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు ఉండాలని స్పష్టం చేసింది. అదేవిధంగా పార్లమెంటు చేసిన రాష్ట్ర విభజన చట్టాన్ని అతిక్రమించి ట్రైబ్యునల్ కృష్ణా నీటి కేటాయింపులపై ఎలా పునఃసమీక్షిస్తుందని ప్రశ్నిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలోని 85(8)(ఇ) పై అధ్యయనం చేసేందుకు ట్రైబ్యునల్‌కు హక్కు ఉందా అనే సందేహాన్ని సాక్షాత్తూ ట్రైబ్యునలే వ్యక్తపరచిందని గుర్తుచేస్తోంది. కృష్ణా జలాల్లో ఉమ్మడి రాష్ట్రానికి 811 టీఎంసీల కేటాయింపులు ఉండగా.. రాష్ట్ర విభజన తర్వాత ఇందులో ఆంధ్రకు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను ట్రైబ్యునల్ కేటాయించింది. అయితే.. ఈ కేటాయింపులు సరికాదని.. తమకు సగం వాటా రావాలని తెలంగాణ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో నీటి పంపకాల పునఃసమీక్ష బాధ్యతను కేంద్రం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు అప్పగిస్తూ నిరుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు గెజిట్ జారీచేసింది.

చవితి ఉత్సవాలకు వెబ్‌సైట్ అనుమతులు: లోకేశ్

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా వెబ్‌సైట్ http://ganeshutsav.net ద్వారా అవసరమైన అనుమతులన్నీ సింగిల్ విండో విధానంలో ఇచ్చేలా ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ఈ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలని శుక్రవారం 'ఎక్స్' వేదికగా సూచించారు.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించొద్దు: సీపీఐ



అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులు అమ్ముడుపోయి పార్టీలు మారుతున్నారంటే.. ఇంతకన్నా నీచమైన విషయం ఏదీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో పూర్తి మెజారిటీ సాధించిన చంద్రబాబు ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం తగదని స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గంధపు చెక్కల స్మగ్లర్స్, క్రిమినల్స్‌ను తన పార్టీలో చేర్చుకోవడానికి సిద్ధపడటం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ముంబై సినీనటి కేసులో ఐపీఎస్ అధికారులు, రాజకీయ నాయకులు, అంతకుమించిన పెద్దలు ఎవరున్నా వదలొద్దన్నారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసరాల ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 1 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు.



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

హౌసింగ్ కింగ్‌లు వారే!

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో రెండున్నర దశాబ్దాల క్రితం జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన ఒక సాధారణ ఉద్యోగి.. అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా, మేనేజరుగా, డిప్యూటీ జనరల్ మేనేజరుగా పదోన్నతులు పొంది.. ఇప్పటికీ అక్కడే తిష్ఠ వేసి హల్‌చల్ చేస్తున్నారు. కీలకమైన పరిపాలనా విభాగంతోపాటు ఇతర విభాగాల్లోనూ 'ఆయన'దే పెత్తనం. ఆయనమాటే వేదం!. పాతికేళ్లుగా అదే స్థానంలో కొనసాగుతూ చక్రం తిప్పుతున్నారు. ఆయనకు సన్నిహితంగా మెలిగే మరికొంతమంది అధికారులు కూడా ఏళ్లతరబడి పాతుకుపోయారు. వీరంతా కలిసి కోటరీగా ఏర్పడి ఉన్నతాధికారులను సైతం శాసించే స్థాయికి ఎదిగిపోయి.. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కింగ్‌ల్లా చక్రం తిప్పుతున్నారని ఆ సంస్థ ఉద్యోగులే చెబుతున్నారు.

- ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారిదే హవా
- దశాబ్దాలుగా పాతుకుపోయిన కొందరు అధికారులు
- జూ. అసిస్టెంట్ నుంచి డిప్యూటీ జీఎంగా
- ఓ అధికారి పాతికేళ్లుగా ఒక్కచోటే
- సంస్థలోని అన్ని విభాగాల్లోనూ ఆయనదే పెత్తనం
- ఆయనకు సన్నిహితంగా ఉండే మరికొందరిదీ ఇదే దారి
- రిటైర్డ్ ఉద్యోగులకూ పునరావాస కేంద్రం?!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

హౌసింగ్ కార్పొరేషన్‌లోని కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో సీఈ నుంచి ఏఈల వరకు, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో డీజీఎం నుంచి సూపరింటెండెంట్ల వరకు పలువురు అధికారులు ఏళ్ల తరబడి అక్కడే పాతుకుపోయారు. కీలకమైన విభాగాల్లో వీళ్లే హల్‌చల్ చేస్తుండటం, వాళ్లు చెప్పిందే వేదమన్నట్లుగా పరిస్థితి మారిపోవడంతో సంస్థ ఉన్నతాధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. అందువల్లే హౌసింగ్ కార్పొరేషన్ పనితీరు పూర్తిగా గాడి తప్పిందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఉదాహరణకు ఇతర ఉద్యోగులు ఎవరైనా కీలక స్థానాలు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు వంటివి పొందాలంటే ముందుగా 'పాతికేళ్లుగా పాతుకుపోయిన అధికారి అనుగ్రహం పొందాల్సిందే. లేదంటే నాన్ ఫోకల్ స్థానాలకు పరిమితం కావాల్సిందే. అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా పేరున్న ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడే ఉద్యోగులపై కక్ష సాధింపులు, వేధింపులకు షరా మామూలే. దాంతో ప్రభుత్వాలు మారుతున్నా.. సంస్థ ఉన్నతాధికారులు ఎందరు మారుతున్నా ఆయన మాత్రం సేఫ్ జోన్‌లోనే ఉంటున్నారు!.

జిల్లాల్లోని ఏఈఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకేనా బదిలీలు?

ఉద్యోగులకు ప్రభుత్వం ఏటా సాధారణ బదిలీలకు అవకాశం కల్పిస్తోంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధన ఉంది. కూటమి ప్రభుత్వం కూడా ఈ నెల 19 నుంచి 31వ తేదీలోపు ఉద్యోగుల సాధారణ బదిలీకు అవకాశమిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈమేరకు జిల్లాల స్థాయిలో అసిస్టెంట్ ఇంజనీర్లు, రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేస్తున్న గృహనిర్మాణ సంస్థ ఉన్నతాధికారులు.. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన అధికారులను మాత్రం కదిలించలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పాతుకుపోయిన కోటరీ.. తమపై అధికారుల ఇళ్లలో పనిచేయడానికి డ్రైవర్లు, స్వీపర్లు, అటెండర్లను, వాహనాలు, వారి ఇళ్లలోకి అవసరమైన నిత్యావసర సరుకులతో సహా సకల సేవలు అందిస్తుంటారని, అందువల్లే వారెవరినీ ఇక్కడ నుంచి బదిలీ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక రాష్ట్రస్థాయి బదిలీల పరిధిలోకి వచ్చే డీఈఈలు, ఈఈలు, డీహెచ్‌ల బదిలీల విషయంలో పైరవీలకే పెద్ద పీట వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారంతా రాజకీయ నేతల సిఫారసులతోపాటు ఉన్నతస్థాయిలో పైరవీలు, పెద్దఎత్తున ముడుపులు చెల్లించుకుని తాము కోరుకున్న చోట పోస్టింగ్‌లు పొందుతున్నారని, ఏటా ఇదే తంతు కొనసాగుతుందని కిందిస్థాయి ఉద్యోగులు వాపోతున్నారు. ఇక, హౌసింగ్‌లో అస్మదీయులైన కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులకు కార్పొరేషన్‌ను పునరావాస కేంద్రంగా మార్చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ జీవీ ప్రసాద్ పదవీ విరమణ వయసు రెండేళ్ల క్రితమే ముగిసిపోయినా.. ఇప్పటికీ ఆయన అదే పోస్టులో కొనసాగుతున్నారు. పైగా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాధ్యతలను కూడా ఇటీవల ఆయకే కట్టబెట్టారు. ఫైనాన్స్ విభాగంలో రెండేళ్ల క్రితమే రిటైరైన అకౌంటెంట్ శర్మ, పరిపాలనా విభాగంలో 12 ఏళ్ల క్రితం రిటైరైన అకౌంట్స్ మేనేజరు ఏడుకొండలు, 8ఏళ్ల క్రితం రిటైరైన మేనేజరు హరిశంకర్, ఇంజనీరింగ్ విభాగంలో ఏడాదిన్నర క్రితం రిటైరైన ఈఈ కోటేశ్వరరావు, ఐదేళ్ల క్రితం రిటైరైన మేనేజరు రాధాకృష్ణలను ఇప్పటికీ ఉద్యోగాల్లో కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్‌లో 62ఏళ్ల పదవీ విరమణ వయసును కోర్టు వీరికి వర్తించదని తేల్చడంతో, వీరందరినీ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తిరిగి నియమించుకున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఇప్పటికైనా గాడి తప్పిన హౌసింగ్ కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

టీడీఆర్‌లపై సీఐడీ విచారణ

- మంత్రి ప్రకటించిన మరుసటి రోజే రంగంలోకి..
- జీవీఎంసీలో రికార్డుల పరిశీలన

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిర్మాణదారులు జీవీఎంసీ నుంచి అడ్డగోలుగా పొందిన ట్రాన్సఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగా సీఐడీ అధికారులు గురు, శుక్రవారాల్లో ఆశీల్‌మెట్ట జంక్షన్‌లోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఆరా తీశారు. దీంతో ఆయా వర్గాల్లో గుబులు మొదలైంది. గత ఐదేళ్ల (2109 నుంచి 2024 మే నెల వరకు)లో ఎన్ని టీడీఆర్‌లు ఇచ్చారు?, వాటి విలువ ఎంతో? వివరాలు తెలపాలని కోరారు. అందుకు సంబంధించిన దరఖాస్తులతో కూడిన ఫైళ్లను తమ వెంట తీసుకువెళ్లడానికి అనుమతి కోరారు. నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా ఉంటూ ప్రజా ప్రతినిధులుగా మారిన వారే కోట్లాది రూపాయల టీడీఆర్‌లు అడ్డగోలుగా తీసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. వారు దరఖాస్తు చేసిన ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ కానీ, జీవీఎంసీ కానీ ఎటువంటి రహదారి విస్తరణ పనులు చేపట్టకపోయినా, ఆ మార్గంలో రహదారి విస్తరణపై అనేక సందేహాలు ఉన్నా పక్కనపెట్టి కోట్ల రూపాయల విలువైన టీడీఆర్‌లను అధికారులు ఇచ్చిన సంగతి తెలిసిందే. పెదజాలరిపేట తమదేనంటూ ఓ జమీందారు కుటుంబం తరఫున వందల కోట్ల విలువైన టీడీఆర్ కోరారు. అలాగే సీతమ్మధారలో బిలాల్ కాలనీకి కూడా వందల కోట్ల రూపాయల విలువైన టీడీఆర్‌ల కోసం వైసీపీ నేతలు ప్రయత్నం చేశారు. పురపాలక శాఖ ఉన్నతాధికారిణి, ఇక్కడ జీవీఎంసీలో టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులతో పాటు నాటి కమిషనర్లు కూడా పూర్తి సహకారం అందించారు. వాస్తవంగా భూములు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇవ్వకుండా కేవలం వైసీపీకి చెందిన వారికే ఇచ్చారనే విమర్శలు కూడా ఉన్నాయి. మూడు రోజుల క్రితం విశాఖపట్నం వచ్చిన పురపాలక శాఖ మంత్రి టీడీఆర్‌లపై విచారణ చేయిస్తామని ప్రకటించిన మరుసటిరోజే సీఐడీ రంగంలోకి దిగడం గమనార్హం.

కేజ్రీవాల్ కలలోకొచ్చారు.. హితబోధ చేశారు

- 4 రోజులకే సొంతగూటికి చేరిన ఆప్ నేత రాంచందర్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్.. ఆ రాష్ట్ర మాజీ ఎమ్మెల్యే ఒకరికి కలలోకి వచ్చారట! ఆప్‌ను వీడి బీజేపీలో చేరిన తనకు హితబోధ చేశారట! దీంతో తిరిగి సొంత గూటికి చేరుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారట! గతంలో ఆప్ ఎమ్మెల్యేగా పనిచేసి, ప్రస్తుతం ఢిల్లీ మునిసిపాలిటీలో కౌన్సిలర్‌గా ఉన్న రాంచందర్ నాలుగు రోజుల క్రితం ఆప్‌ను వీడి బీజేపీలో చేరారు. అయితే బుధవారం రాత్రి కేజ్రీవాల్ తన కలలోకి వచ్చారని, "రాంచందర్.. మేలుకో! మనీశ్ సిసోడియాను, పార్టీ ఇతర నేతలను కలిసి మాట్లాడు. నీ కార్యకర్తలతో కలిసి.. నీ ప్రాంతంలో పనిచేసుకో!" అంటూ హితబోధ చేశారని రాంచందర్ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఆప్ నేతలను కలిసి ఈ విషయం చెప్పి.. తిరిగి పార్టీలో చేరారు.

విర్రవీగద్దు..

అణిగిమణిగి ఉండండి

ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి

- కూటమిలో మిగిలిన పార్టీలతో కలిసి పనిచేయండి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, నేతలకు మంత్రి లోకేశ్ సూచన
- అక్టోబరు నుంచి పార్టీ సభ్యత్వ నమోదు



విశాఖపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వచ్చాం కదా అని విర్రవీగొద్దు. అణిగిమణిగి ఉండాలి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ సూచించారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. '2019 ఎన్నికల్లో వైసీపీకి 151 సీట్లు ఇస్తే అధికారం తలకెక్కి, అరాచక పాలన సాగించింది. ప్రజాగ్రహానికి గురయింది. క్రమశిక్షణ కలిగిన టీడీపీ, మిత్రపక్షాలైన జనసేన, బీజేపీతో కలసి పోటీ చేసి విజయం సాధించాం. రాష్ట్రంలో నీతివంతమైన పాలన అందించేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. అందుకు తగిన విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలతో కలిసి పనిచేయాలి. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలి. దీనికి అనుగుణంగా అక్టోబరు నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తాం. ప్రతి ఎమ్మెల్యే/ఇన్‌చార్జి తమ పరిధిలో సభ్యత్వ నమోదు పక్కాగా చేపట్టాలి. గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తాం. నామినేటెడ్ పదవులపై ఇప్పటికే కసరత్తు జరిగింది. కష్టపడే వారికి పదవులు వస్తాయి. మరోసారి విశాఖ వచ్చినప్పుడు విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి, అన్ని విషయాలపై చర్చిస్తా. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలి. బదిలీల్లో సీఎం పక్కాగా వ్యవహరిస్తున్నారు. సమర్థులకు పోస్టింగ్స్ ఇస్తున్నారు. అదే ఒరవడి కొనసాగించాలని నిర్ణయించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బాగా పనిచేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారు' అని లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసి భారీఎత్తున అవినీతికి పాల్పడిన అధికారి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందుకు ఒకరిద్దరు సిఫారసు లేఖలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ అవినీతికి పాల్పడే అధికారిని విశాఖ జడ్పీ సీఈవో పోస్టులో నియమించబోమని హామీ ఇచ్చారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమస్యలపై మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు నియోజవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కిడారి శ్రావణ్ కుమార్, నాయకులు గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, ప్రగడ నాగేశ్వరరావు, బుద్దా నాగజగదీష్, చింతకాయల విజయ్, దాడి రత్నాకర్, కోరాడ రాజబాబు, పైలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాలేరు-నగరి డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి సస్పెన్షన్

తిరుపతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 1వ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.కోదండరామిరెడ్డిని రాష్ట్రప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఓ రిట్ పిటిషన్‌కు సంబంధించి హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ సక్రమంగా దాఖలు చేయలేదని, దాంతో కోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ నివేదించింది. ఆ నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కోదండరామిరెడ్డి గతంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో అక్కడి గాలేరు-నగరి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 4వ యూనిట్‌కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేశారు. అప్పట్లో భూసేకరణ వివాదానికి సంబంధించి కె.నాగిరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ (నంబరు 119-2022) దాఖలు చేశారు. ఈ కేసులో కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్‌ను సక్రమంగా దాఖలు చేయకపోవడంతో విచారణ సందర్భంగా హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. దీంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసే సమయంలో ఆర్ అండ్ ఆర్ పాలసీ-2005, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏ ఆర్ అండ్ ఆర్ యాక్ట్ - 2013 చట్టాల్లోని అంశాలను విస్మరించారని, హైకోర్టుకు వాస్తవాలను వివరించడంలో విఫలమయ్యారని గుర్తించారు. ఈ కారణంగానే హైకోర్టు ఎదుట ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్.. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

26 జిల్లాలకు ప్రత్యేక అధికారులు

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. మొత్తం 26 జిల్లాలకు 26 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎల్ఏ జి.జయలక్ష్మి(ఎన్టీఆర్ జిల్లా), పంచాయతీరాజ్ శాఖ, ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్(ఏలూరు), ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే(అనంతపురం), ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్(విశాఖపట్నం), పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్(మన్యం), అగ్రికల్చర్ కార్యదర్శి బాబు.ఎ(పశ్చిమగోదావరి), పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్(సత్యసాయి జిల్లా), పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్(చిత్తూరు), మైనార్టీ వెల్ఫేర్ కార్యదర్శి కె.హర్షవర్ధన్ (కర్నూలు), మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీ పోలా భాస్కర్(నంద్యాల), మైన్స్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్(శ్రీకాకుళం), స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ ఎం.వి.శేషగిరి బాబు (బాపట్ల), సోషల్ వెల్ఫేర్, కార్యదర్శి కె.కన్నబాబు(అల్లూరి), దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ(తిరుపతి), పర్యాటక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ (విజయనగరం), మహిళా,శిశు సంక్షేమ కార్యదర్శి ఎ.సూర్యకుమారి(అన్నమయ్య), హ్యాండ్‌లూమ్స్ కమిషనర్ జి.రేఖ(పల్నాడు), సెర్ప్ సీఈవో జి.వీరపాండియన్(కాకినాడ), ఆరోగ్యశాఖ డైరెక్టర్ సీహెచ్ హరికిరణ్(నెల్లూరు), పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి(అనకాపల్లి), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు(ప్రకాశం), కె.వి.ఎన్.చక్రధరబాబు(కడప), మున్సిపల్ శాఖ డైరెక్టర్ ఎం.హరినారాయణ(తూర్పుగోదావరి), సర్వే సెటిల్‌మెంట్ డైరెక్టర్ శ్రీకేశ్ బాలాజీ(కోనసీమ), పాఠశాల విద్య డైరెక్టర్ వి.విజయరాజు(కృష్ణా), బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ ఎ.మల్లికార్జున(గుంటూరు) ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. జిల్లాల్లో జరిగే ప్రతి కార్యక్రమాన్ని పర్యవేక్షించడంతో పాటు జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలి. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత వీరిపై ఉంటుంది.

430 ఎకరాలు కబ్జా చేసిన వైసీపీ నేతలు

- మంత్రి భరత్‌కు బడుగు వర్గాల వారి ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం పోలేపల్లి గ్రామంలో 1986లో నాటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల వారికి 430 ఎకరాల భూమిని ఇస్తే వైసీపీ నేతలు గత ప్రభుత్వ హయాంలో వాటిని కబ్జా చేశారని ఆ గ్రామానికి చెందిన బడుగు వర్గాలవారు ఫిర్యాదు చేశారు. పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్ శుక్రవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పోలేపల్లి గ్రామానికి చెందిన వారు మంత్రిని కలిసి తమ వినతిని అందచేసి న్యాయం చేయాలని కోరారు. హిందూపురం మండలం జంగాలపల్లి గ్రామంలో వైసీపీ నేత నరసింహులు తమ భూములను కాజేయడంతోపాటు భూమిలోకి వెళ్తే కొట్టిస్తున్నాడని ఆ గ్రామానికి చెందిన అలివేలమ్మ, చిన్న తిమ్మరాయప్ప, అశ్వర్థప్ప ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ఇళ్లు పోతున్న వారి నుంచి వైసీపీ నేతలు లంచాలు వసూలు చేసి పరిహారాలు ఇప్పిస్తున్నారని, ఇవ్వనందుకు తమకు తక్కువ పరిహారం వచ్చేలా చేశారని రేణిగుంట మండలం కరకం బాడి పంచాయితీకి చెందిన చెంచు లక్ష్మి, జయలక్ష్మి ఫిర్యాదు చేశారు. సత్యసాయి జిల్లా ఓబుళచెరువు మండలం తంగేడు కుంట గ్రామానికి చెందిన సోమశేఖర రెడ్డి మాట్లాడుతూ... 'మేం టీడీపీలో చేరామన్న కక్షతో టాంజానియాకు పంపిన మా కుమారుడిపై మధ్యలో ఉన్న ఏజెంట్ అక్కడ అక్రమ కేసులు పెట్టించాడు. నా కుమారుడిని తిరిగి మన దేశానికి రప్పించండి' అని కోరారు.

ఏఐసీసీ ఏపీ ఇన్‌చార్జి కార్యదర్శిగా గణేశ్ కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి కార్యదర్శిగా గణేశ్‌కుమార్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ పాలక్ వర్మ నియమితులయ్యారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శులుగా పీసీ విష్ణునాథ్, పి.విశ్వనాథన్ నియమితులయ్యారు. శుక్రవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఏఐసీసీ తరఫున కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నియామకాలు చేపట్టినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పీసీ విష్ణునాథ్ ప్రస్తుతం తెలంగాణ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తుండగా ఆయనకు తాజాగా మరోసారి అవే బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్న సంపత్‌కుమార్‌కు అధిష్ఠానం ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది. ఆయన గతంలో మహారాష్ట్ర ఏఐసీసీ కార్యదర్శిగా పనిచేశారు.

'డెంటల్' స్కామ్‌పై విచారణ

- ముగ్గురు వైద్యులతో కమిటీ.. ఆరోగ్యశ్రీ ట్రస్టులో తనిఖీలు
- పలు అవకతవకలు గుర్తింపు నేడూ కొనసాగనున్న తనిఖీలు
- ముగ్గురు వైద్యులపై వేటు



అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) ట్రస్టులో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన డెంటల్ స్కామ్‌పై విచారణ ప్రారంభమైంది. ట్రస్టు అధికారులు ముగ్గురు సీనియర్ దంతవైద్యులతో ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ ఆస్పత్రులు చేసిన శస్త్ర చికిత్సలు, ట్రస్టు పెట్టిన క్లెయిమ్‌లు, ప్యానల్ డాక్టర్ ఇచ్చిన అనుమతులు, ట్రస్టు డాక్టర్ నుంచి జేఈవో వరకూ క్లెయిమ్‌లకు ఆమోదించడంపై ఈ బృందం విచారణ చేపట్టింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిపిన తనిఖీల్లో పలు అవకతవకలను గుర్తించారు. కొన్ని శస్త్రచికిత్సలు చేయకుండానే చేసినట్లుగా చూపించారని, చెల్లించాల్సిన దానికంటే అధిక మొత్తంలో బిల్లులు చెల్లించారని తేలడంతో ఆ వివరాలను సీఈవోకు అందించారు. శనివారం కూడా ఈ తనిఖీలు కొనసాగనున్నాయి. కాగా, డెంటల్ స్కామ్‌తో సంబంధం ఉన్న ముగ్గురు వైద్యులను ట్రస్టు నుంచి తొలగించారు. ఇద్దరు జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారులతో పాటు ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ను ట్రస్టు తొలగించింది. వైద్యబృందం ఇచ్చే నివేదిక ఆధారంగా సోమవారం తర్వాత మరికొంత మందిపై వేటు పడనుంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 31 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

మిలిటరీ స్కూళ్లలో
6, 9వ తరగతుల్లో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు

- 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: ప్రశ్న పత్రంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: https://www.rashtriyamilitaryschools.edu.in/



బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం)- 'ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్(పీసీపీ-టీటీఎం)'ను అందిస్తోంది. టీ బోర్డ్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించే ఈ ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ వ్యవధి 45 రోజులు. నవంబరు 4 నుంచి డిసెంబరు 18 వరకు ట్రెయినింగ్ సెషన్స్ ఉంటాయి. ఫ్రెషర్స్, టీ ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ సహా టీ మాన్యుఫాక్చరింగ్, టీ ప్రొడక్షన్, టీ ట్రేడింగ్/బ్లెండింగ్, టీ రిటైలింగ్ విభాగాల్లో అనుభవం ఉన్న వారికి టెక్నికల్, ఫంక్షనల్, మార్కెటింగ్ అవసరాలకు తగ్గట్టుగా టీ టేస్టింగ్ సెషన్స్ నిర్వహిస్తారు.

టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్‌లో
ప్రొఫెషనల్ సర్టిఫికెట్

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో టీ బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెట్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నిక్‌లకు సంబంధించిన అంశాలు వివరించడంతోపాటు టీ టేస్టింగ్ స్కిల్స్ నేర్పిస్తారు. దేశ విదేశాల్లో తయారుచేసే టీ రకాలను టేస్ట్ చేసే మెథడాలజీని వివరిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా అకడమిక్, టెక్నికల్, ప్రాక్టికల్ మాడ్యూల్స్ ఉంటాయి. చివరలో అసెస్‌మెంట్ వర్క్ ఉంటుంది.

- అకడమిక్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్ ఫర్ రైట్ మార్కెటింగ్, టీ టేస్టింగ్-ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ అంశాలు; టెక్నికల్ మాడ్యూల్‌లో మైక్రో ప్రొఫైలింగ్ ఆఫ్ టీ గ్రేడింగ్, లాంగ్వేజ్ ఆఫ్ టీ టేస్టింగ్, కప్ టేస్టింగ్ టెక్నిక్స్, ఎలక్ట్రానిక్ నోస్ అండ్ ఎలక్ట్రానిక్ టంగ్, ఎవల్యూషన్ అండ్ స్కోరింగ్, టేస్టింగ్ ఫర్ ప్రొక్యూర్‌మెంట్స్ అండ్ టీ బ్లెండ్స్, ప్యాలెట్ మెమరీ-టీ టేస్టింగ్/ బ్లెండింగ్ అంశాలు ఉంటాయి. ప్రాక్టికల్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్, సెన్సరీ స్కిల్స్‌కు సంబంధించిన శిక్షణతోపాటు ఫీల్డ్ స్టడీ, టీ ఎస్టేట్/ ఫ్యాక్టరీ విజిట్స్, మార్కెటింగ్ అంశాలు ఉంటాయి. అసెస్‌మెంట్‌లో ప్రాజెక్ట్ ప్రజంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్‌లు, రిటెన్ టెస్ట్‌లు, కేస్ అనాలిసిస్, ఎక్స్‌పర్ట్ కమిటీ ఎవల్యూషన్ అండ్ సర్టిఫికేషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం తప్పనిసరి. టీ సంబంధిత ప్రొడక్షన్, మార్కెటింగ్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. విదేశీయులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: ఇంటర్వ్యూ, టీ టేస్టింగ్‌కు సంబంధించిన సైకోమెట్రిక్ టెస్ట్, బైండ్ సెన్సరీ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.80,000+జీఎస్‌టీ(విదేశీయులకు 1100 యూఎస్ డాలర్లు)
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500; విదేశీయులకు 15 యూఎస్ డాలర్లు
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 18
- **చిరునామా:** ఎండీపీ యూనిట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, జ్ఞాన భారతి క్యాంపస్, బెంగళూరు-560056
- **వెబ్‌సైట్:** www.iipmb.edu.in

ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐసీటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ముంబయి, ఐఓసీ భువనేశ్వర్, మరాఠ్వాడా జల్నా క్యాంపస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

ఐసీటీలో పీహెచ్‌డీ

స్పెషలైజేషన్‌లు: బయోప్రాసెస్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, ఫైబర్స్ అండ్ టెక్స్‌టైల్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, గ్రీన్ టెక్నాలజీ, పర్ఫ్యూమరీ అండ్ ఫ్లేవర్స్ టెక్నాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మకాలజీ, ఫార్మకాగ్నసీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, పాలిమర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సర్ఫేస్ కోటింగ్ టెక్నాలజీ, ప్లాస్టిక్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోకెమికల్ ఇంజనీరింగ్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ కెమిస్ట్రీ



అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాల నుంచి కనీసం 65 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(కెమికల్ ఇంజనీరింగ్/కెమికల్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు డైరెక్ట్ పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **సెలెక్షన్ ప్రాసెస్ వెయిటేజీ:** రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం మార్కులు, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం మార్కుల వెయిటేజీ ఇస్తారు.
- **వెబ్‌సైట్:** http://ictmumbai.edu.in

జాబ్ కార్నర్

యూనియన్ బ్యాంకులో

ఖాళీలు 500

అప్రెంటిస్‌లు

ముంబయిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మానవ వనరుల శాఖ, సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా యూబీఐ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 50, తెలంగాణలో 42 ఖాళీలున్నాయి.

ఖాళీలు: యూఆర్-248, ఎస్సీ-64, ఎస్టీ-32, ఓబీసీ-115, ఈడబ్ల్యూఎస్-41

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు రూ.15,000

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ నాలెడ్జ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్) సబ్జెక్టులు: జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు - 25 మార్కులు), జనరల్ ఇంగ్లీష్(25 ప్రశ్నలు- 25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు - 25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు- 25 మార్కులు).

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీలకు రూ.800. ఎస్సీ/ఎస్టీ/మహిళా అభ్యర్థులకు రూ.600. దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 17

వెబ్‌సైట్: www.unionbankofindia.co.in/

వెస్ట్ సెంట్రల్ రైల్వేలో

ఖాళీలు 3317

జబల్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- వెస్ట్ సెంట్రల్ రైల్వే...డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు: జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ

అర్హత: పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హౌస్ కీపర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్, వెల్డర్, వైర్‌మన్ తదితరాలు.

వయోపరిమితి: 2024 ఆగస్టు 5 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.141. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.41.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: https://wcr.indianrailways.gov.in/

గెయిల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు 391

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

- నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు: (యూఆర్- 174, ఈడబ్ల్యూఎస్-29, ఓబీసీ-89, ఎస్సీ-60, ఎస్టీ-39)

1. జూనియర్ ఇంజనీర్(కెమికల్): 2 పోస్టులు
2. జూనియర్ ఇంజనీర్(మెకానికల్): 1
3. ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): 1
4. ఫోర్‌మన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 14
5. ఫోర్‌మన్(సివిల్): 6
6. జూనియర్ సూపరింటెండెంట్(అఫీషియల్ లాంగ్వేజ్): 5
7. జూనియర్ కెమిస్ట్: 8
8. జూనియర్ అకౌంటెంట్: 14
9. టెక్నికల్ అసిస్టెంట్(ల్యాబొరేటరీ): 3
10. ఆపరేటర్(కెమికల్): 74
11. టెక్నీషియన్(ఎలక్ట్రికల్): 44
12. టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 45
13. టెక్నీషియన్(మెకానికల్): 39
14. టెక్నీషియన్(టెలికాం అండ్ టెలిమెట్రీ): 11
15. ఆపరేటర్(ఫైర్): 39
16. ఆపరేటర్(బాయిలర్): 8
17. అకౌంట్స్ అసిస్టెంట్: 13
18. బిజినెస్ అసిస్టెంట్: 65

అర్హతలు: పోస్టును అనుసరించి పదోతరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎస్, బీబీఎం, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంకాం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతభత్యాలు: జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ.35,000 - రూ.1,38,000. జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ అకౌంటెంట్ పోస్టులకు రూ.29,000 - రూ.1,20,000. మిగిలిన పోస్టులకు రూ.24,500 - రూ.90,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.50. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 7

వెబ్‌సైట్: https://gailonline.com/

ఆదిలాబాద్ రిమ్స్‌లో ఫ్యాకల్టీ

ఖాళీలు 97

ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

విభాగాలు: అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్స్, పాథాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,90,000; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,50,000; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,25,000; మిగతా పోస్టుకు పోస్టుకు రూ.52,000.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా


ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 4

వేదిక: ఆఫీస్ ఆఫ్ ద డైరెక్టర్, రిమ్స్ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్.

వెబ్‌సైట్: rimsadilabad.org/



లిటిల్స్



వంటవాడి సమయ స్ఫూర్తి

వందన గిరి రాజ్యాన్ని ప్రవీణుడు అనే రాజు పాలించే వాడు అతనికి చాలా ముక్కోపి అని పేరుండేది. అతని దగ్గర ధర్మయ్య అనే వంటవాడు ఉండేవాడు. అతను చేసే వంటకాలంటే మహారాజుకు చాలా ఇష్టం ఉండేది. ఒక రోజు ధర్మయ్య త్వరత్వరగా వంట పూర్తి చేసి, తన కొడుక్కి అనారోగ్యంగా ఉండటంతో మహారాజుకు వడ్డించే పనిని మరొక పనివాడికి అప్పగించి తాను ఇంటికి వెళ్లిపోయాడు. ఆ రోజు కూరల్లో కారం ఎక్కువ అయింది. మహారాజు రుచి చూడగానే కారం ఎక్కువయిందని తెలిసి, కోపంతో ఆ మర్నాడు ధర్మయ్యకి మరణ దండన విధించాలని నిర్ణయం చేశాడు. ఇది తెలిసిన ధర్మయ్య రాజు కొలువుకువచ్చి 'మహారాజా చనిపోయే ముందు ఎవరిదైనా చివరి కోరిక తీరుస్తారు కదా. అలాగే నా చివరి కోరిక కూడా తీర్చండి. నాకు ఓ ధనుస్సు, బాణం కావాలి తెప్పించండి. ఆ బాణం నేను రాజుగారి మీద వేయాలి అనుకుంటున్నాను' అన్నాడు అదేమిటి? అని అడిగినరాజుతో ధర్మయ్య "కేవలం కూరలో కారం ఎక్కువ అయినందుకే నా ప్రాణం తీశారనే అపకీర్తి మీకు వద్దు మహారాజా.. ఇపుడు ఇంత హాని మీకు తలపెట్టాను అని చెప్పి నన్ను ఉరి తీయించండి' అన్నాడు శిక్ష తప్పించుకోవడానికి వంటవాడు చూపిన సమయ స్ఫూర్తికి నవ్వుకున్న రాజు అతనికి విధించిన మరణదండన రద్దు చేసి, క్షమించి పంపేశాడు అలా ధర్మయ్య ఉపాయంతో తననుతాను కాపాడుకున్నాడు.

5 తేడాలను కనిపెట్టండి






ఏవి ఎన్ని?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 398

								9
	9				4	5		8
			9	5	2		6	
	5				6	9		
2	6			3			1	4
		4	1				5	
	3		4	8	1			
5		1	6				3	
9								

సుడోకు - 397 సమాధానం

8	2	7	9	3	5	1	4	6
6	1	4	7	2	8	3	9	5
3	9	5	4	1	6	2	8	7
5	7	8	1	6	3	9	2	4
1	6	9	5	4	2	7	3	8
4	3	2	8	9	7	6	5	1
7	4	1	2	5	9	8	6	3
2	5	6	3	8	1	4	7	9
9	8	3	6	7	4	5	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.